అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శనివారం 3-3-2018 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 64 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12+16 పేజీలు వెల : 5.00

అది చిన్న పొరపాటే

- పెద్ద ఉపన్యాసంలో చిన్న తప్పిదం
- అలా అనుకుంటే 600 కోట్ల మంది నాకు ఓటేశారని దావోస్‌లో మోడీ చెప్పలేదా?
- అలాంటి వాటిని పట్టించుకుని రాద్ధాంతం చేయడమెందుకు : ప్రధానిపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల కవిత వివరణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రధానమంత్రి నరేంద్రమోడీని వ్యక్తిగతంగా వాడు అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు సీరియస్ అయ్యారు. దీంతో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు టీఆర్ఎస్ నేతలు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు నానా తంటాలు పడుతున్నారు. ప్రసంగం ఫ్లోలో అలా వచ్చిందని, రైతులకు మద్దతుగా నిర్ణయాలు తీసుకోకపోవడంతో బాధతో అలా అని ఉంటారని, కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీని కించపర్చడం ముఖ్యమంత్రి ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు. ఈ నెల ఐదు నుండి రెండో విడత పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రిని, కేంద్రప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకునేందుకు టీఆర్ఎస్‌పార్టీ నేతలు ఇప్పట్నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిజామాబాద్ ఎంపీ కవిత మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీని కించపరిచే ...9లో



ఎన్‌కౌంటర్!

పది మంది మావోయిస్టులు, గ్రేహౌండ్ కానిస్టేబుల్ మృతి

- మృతుల్లో మా అన్న వదిన లేరు : హరిభూషణ్ కుటుంబ సభ్యులు
- ఆపరేషన్ కొనసాగుతున్నది : ఎస్పీ
- హైకోర్టు ఆదేశంతో భద్రాచలంలోనే పోస్టుమార్టం

వివరాలు 9లో

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో శుక్రవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులతో పాటు గ్రేహౌండ్ కానిస్టేబుల్ ఒకరు మృతిచెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. మావోయిస్టు మృతదేహాల్లో ఎవరెవరివి ఉన్నాయన్నదాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని పూజారి కాంకేడ్ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి.



టార్గెట్ హరిభూషణ్!

- ఏడాది కాలంగా ఎస్ఐబీ వ్యూహరచన
- సీనియర్ ఐపీఎస్ అధికారి స్వీయ పర్యవేక్షణ
- ఈ నాలుగేండ్ల ఎన్‌కౌంటర్లలో 28 మంది హతం

వివరాలు 9లో



కేసీఆర్ ఫాసిస్ట్ పాలనకు పరాకాష్ట

వివరాలు 9లో

టాప్ 400లో భారత వర్సిటీలు ఆరే

- క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీస్ ర్యాంకింగ్- 2018 జాబితా విడుదల

వివరాలు 2లో

నేడు మూడు రాష్ట్రాల ఫలితాలు

- భారీ భద్రతా ఏర్పాట్లు : ఈసీ
- ఫలితాలపై ఉత్కంఠ

బీసీలకు 60 సీట్లిస్తాం..మీరిస్తారా..?

టీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీఎల్ఎఫ్ సవాల్

- ఆ రెండు పార్టీలు నాణేనికి బొమ్మ, బొరుసులాంటివే
- ఒక్క హామీనీ అమలు చేయని కేసీఆర్ :బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్
- 14న రాష్ట్ర కార్యాలయం ప్రారంభం: జి రాములు

వివరాలు 9లో



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్

తెలంగాణకు 24, ఏపీకి 9 టీఎంసీలు

కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణకు 24, ఏపీకి 9 టీఎంసీల నీటిని కేటాయిస్తూ కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. శుక్రవారం జలసౌధలో బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధరరావు, ఏపీ నీటిపారుదల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కృష్ణా ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న 33 టీఎంసీఆల నీటి లభ్యత ఆధారంగా ఈ కేటాయింపులు జరిగాయి. కేటాయించిన నీటి కన్నా అదనంగా నాగార్జునసాగర్ నుంచి ఏపీ నీటిని వాడుకుందని తెలంగాణ వాదించింది. తెలంగాణకు కేటాయించిన నీటిలో 16.42 టీఎంసీల నీరు ఇంకా వాడుకోవాల్సి ఉన్నదని స్పష్టం చేసింది. మార్చి 20 వరకు సాగర్ మట్టం 520, అదే నెల చివరికి 515 అడుగులు నీటి మట్టం ఉండేలా రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఇందుకుగాను శ్రీశైలం నుంచి నీటిని సాగర్‌కు విడుదల చేయటానికి ఏపీ అంగీకరించింది. ఏప్రిల్ నుంచి రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు సంబంధించి మళ్లీ ఉత్తర్వులు జారీచేయాలని బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. సాగర్ లో కనీస నీటి మట్టం తగ్గిపోతే గత సంవత్సరం తాగునీటి అవసరాలకు నీళ్ళందించలేక ఇబ్బందులు పడిన విషయాన్ని తెలంగాణ గుర్తు చేసింది. ఈ సారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా శ్రీశైలం నీరు విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఆగస్టు వరకు తెలంగాణకు 46 టిఎంసీలు అవసరమని ఈ సమావేశంలో అధికారులు తెలిపారు. ప్రస్తుతం రబీ పంటకు ...9లో

విషాదం నింపిన హోలీ

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి..మరో ఐదుగురికి గాయాలు

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- సంగారెడ్డి జిల్లా ఐబీ(హెచ్) వద్ద ప్రమాదం

వివరాలు 9లో



టచ్‌లో పెద్ద తలకాయలు

- సరైన సమయంలో వెల్లడిస్తా
- ప్రజలు నూతన ఒరవడి కోరుతున్నారు : కోదండరామ్

వివరాలు 9లో



ఇద్దరు జడ్జిల నియామకంపై కేంద్రం తిరకాసు

- కొలీజియం సిఫారసులను పక్కన పెట్టిన మోడీ సర్కార్
- సీనియారిటీ లేదనా..? ఇంకా ఏదైనా కారణమా..?

వివరాలు 2లో





...కావాలంటే వచ్చే నాలుగేండ్లలో ఏంజెయ్యాలనుకుంటున్నానో రాసిస్తా... కానీ.. ఈ నాలుగేండ్లలో ఏం జేసినవో రాసియ్యమంటే శానా కష్టం సార్..!!

అంతర్మథనం

నిలదీయడమా?..ప్రస్తావించడమా?

- 5 నుంచి పార్లమెంటు రెండో విడత సమావేశాలు
- వ్యూహంపై నేడు ఎంపీలతో కేసీఆర్ భేటీ



(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పార్లమెంటు బడ్జెట్ రెండో విడత సమావేశాలు ఐదునుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో అటు లోక్‌సభలోనూ, రాజ్యసభలోనూ సమస్యలపై నిలదీసేందుకు టీఆర్ఎస్‌పార్టీ ఎంపీలు సిద్ధమవుతున్నారు. ఇదే చివరి బడ్జెట్ సమావేశాలు కావడంతో కేంద్రప్రభుత్వంతో అమీతుమీకి సిద్ధం కావాలా, లేక సామరస్యంతో వ్యవహరించాలా అన్నదానిపై టీఆర్ఎస్ ఎంపీలకు దిశానిర్దేశం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం సాయంత్రం నాలుగు గంటలకు జరగనుంది. అంశాలవారీగానే కేంద్రానికి మద్దతు ఇస్తున్నామని, తమకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంతో ఎలాంటి ఒప్పందమూ లేదని గులాబీ ...9లో

రాజ్యసభ రేసులో కాంగ్రెస్?

- మూడో అభ్యర్థిని దించాలనే యోచన
- అమరవీరుల కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నది. తగిన బలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టేందుకు అధికార టీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా...అమరవీరుల కుటుంబాలకు చెందిన వ్యక్తిని బరిలోకి దించాలని ఆ పార్టీ ప్లాన్ చేస్తున్నది. దీనిపై ఇప్పటికే పార్టీ సీనియర్ నేతలు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగానే అమరవీరుల కుటుంబ సభ్యులకు సీటు కేటాయించాలని అధికార టీఆర్ఎస్‌ను ఇప్పటికే నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెలాఖరులో మూడు రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఆ మూడింటిని కైవసం చేసుకునేందుకు టీఆర్ఎస్ పావులు కదుపుతున్నది. అధికార పార్టీకి ఎమ్మెల్యేల సంఖ్యాపరంగా రెండు రాజ్యసభ సీట్లు దక్కుతాయి. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, సీపీఐ పార్టీల నుండి తమ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల సంఖ్యతో మూడో సీటును దక్కించుకునేందుకు టీఆర్ఎస్ ఎత్తులు వేస్తున్నట్టు సమాచారం. మూడో అభ్యర్థిగా కేసీఆర్ సమీప బంధువు, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌రావును నిలబెట్టాలని కేసీఆర్ నిర్ణయించినట్టు లీకులిస్తున్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో మూడో సీటును దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్న టీఆర్ఎస్‌ను నిలువరించాలని కాంగ్రెస్ పావులు కదుపుతున్నది. మూడో సీటును అమరవీరుల ...9లో

సీపీఐ(ఎం) నేత ఖగేంద్ర కన్నుమూత

అగర్తలా : ప్రముఖ సీపీఐ(ఎం) నేత, త్రిపుర మంత్రి ఖగేంద్ర జమాతియా (61) శుక్రవారం కన్నుమూశారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ఉదయం 8.10గంటలకు ఆయన మరణించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ ధృవీకరించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఖోవాయి జిల్లాలోని కృష్ణపూర్ ఎస్టీ నియోజకవర్గం నుండి వామపక్ష సంఘటన అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలియాముదాలోని త్రిషబరి ఆయన సొంత గ్రామం. కొంతకాలం నుండి ఆయన అస్వస్థులుగా వున్నారు. సిపిఎం త్రిపుర రాష్ట్ర కమిటీ సభ్యులు, మంత్రి అయిన కామ్రేడ్ ఖగేంద్ర మృతికి పార్టీ సంతాపాన్ని ప్రకటించింది. ఆయన మృతికి నివాళి అర్పిస్తూ, సంతాప సూచకంగా పార్టీ పతాకాన్ని అవనతం చేశారు.

ఐదు లక్షలకు పైగా ఉచిత ఇండ్లను నిర్మిస్తున్న కేరళ సర్కార్

తిరువనంతపురం : కేరళలో ఇండ్లులేని నిరుపేదలకు ఉచితంగా గృహాలు నిర్మించి ఇవ్వాలని కేరళ ప్రభుత్వం భావిస్తోంది. ఐదులక్షల మందికి పైగా ఉచిత గృహాలను నిర్మించే ప్రాజెక్టుపై చర్చించిన కేరళ మంత్రివర్గం 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.4లక్షల వ్యయంతో ఇంటిని నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఎవై) కార్యక్రమం తరహాలోనే దీన్ని చేపట్టాలని భావిస్తోంది. పిఎంఎవై కింద ఇంటికి రూ.3లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇందులో రూ.1.5లక్షలు కేంద్రం వాటా కాగా, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం, వినియోగదారుడు రూ.50వేల చొప్పున భరించాల్సి వుంటుంది. ఇక్కడ కేరళ ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులో వినియోగదారుడు భరించాల్సిన మొత్తాన్ని తొలగించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలు భరించగా, స్థానిక పాలకమండలి రూ.2లక్షలు అందచేయాల్సి వుంటుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి రు.2500కోట్లు కేటాయించారు. ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టు లబ్దిదారులుగా 5,13,000 మందిని గుర్తించినట్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. 2018-19లో 1,76,00 ఉచిత గృహాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 66,570 ఇళ్ళను ఈ మార్చికల్లా పూర్తి చేస్తారు.



మధు కుటుంబాన్ని ఆదుకుంటాం

- నిందితులకు కఠిన శిక్ష : కేరళ ముఖ్యమంత్రి విజయన్

తిరువనంతపురం: తినుబండారాలు దొంగిలించాడనే ఆరోపణతో గత నెలలో కేరళలో గిరిజనుడు మధు(30)ను చేతులుకట్టేసి కొట్టి చంపిన కేసులో.. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఆయన పాలక్కడ్‌లోని మధు కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మతిస్థిమితం కోల్పోయిన మధును హత్యచేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. మధు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఘటనకు సంబంధమున్న 16 మందిని అరెస్టు చేశామని చెప్పారు. విజయన్ వెంట ఆరోగ్యశాఖ మంత్రి కె.కె.శైలజ ఉన్నారు. అనంతరం ప్రభుత్వాధికారులతో నిర్వహించిన సమావేశంలో... రాష్ట్రంలోని గిరిజనులకు కనీస అవసరాలైన నీరు, ఆహారం అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ వంటశాలలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాల పరిధిలోని ప్రతీ గిరిజన వ్యక్తికి యేడాదికి 200 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. గిరిజనులు మద్యం భారీన పడకుండా చర్యలు తీసుకోవాలని, దీనికోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

గ్రామీణ బ్యాంక్‌లో రూ.14కోట్లు స్వాహా

హసన్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని హసన్‌పూర్‌లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లో రు.14కోట్ల కుంభకోణాన్ని సీబీఐ వెలికితీసింది. ఈ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, మరో ఎనిమిది మంది ఉద్యోగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తమ బ్రాంచ్‌లో అనుమానాస్పదమైన లావాదేవీలు జరుగుతున్నాయని బ్యాంక్ నుండి ఫిర్యాదు అందగానే సీబీఐ రంగంలోకి దిగింది. కోట్లాది రూపాయిల కుంభకోణాన్ని కనుగొన్న వెంటనే బ్యాంక్ తన యూజర్ ఐడీని, పాస్‌వర్డ్‌ను సస్పెండ్ చేసింది. ప్రధాన నిందితుడైన బ్రాంచ్ మేనేజర్ విపిన్ కుమార్, ఇతరులు ప్రధమ్ కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాల్లోకి డబ్బులు వేసి, ఆ తర్వాత ఆ మొత్తాన్ని సెక్యూర్డ్ ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాల్లోకి, ఇతర ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. దేశంలో పలు బ్యాంకింగ్ కుంభకోణాలు బయటపడుతున్న తరుణంలోనే ఇది కూడా చోటు చేసుకుంది.

హోలీ రోజున ఢిల్లీలో దారుణం

యువకుడిని 50 సార్లు కత్తితో పొడిచిన దుండగులు



న్యూఢిల్లీ: ఢిల్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడిపై కొంతమంది దుండగులు విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... రాజధానిలోని కాన్పూర్ దుంగల్ కాలనీలో గురువారం సాయంత్రం ఆశిశ్ అనే యువకుడు జిమ్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు అతన్ని అడ్డుకున్నారు. క్షణాల్లో 20 మంది దుండగులు బైకులపై అక్కడికి చేరుకుని ఆశిశ్‌ను చుట్టుముట్టారు. అనంతరం వారి వద్ద ఉన్న కత్తులతో అతడిపై నిర్దాక్షిణ్యంగా దాడి చేశారు. ఆ యువకుడిని 50 సార్లకు పైగా పొడిచి, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. చుట్టుపక్కల ఉన్నవాళ్లు ఎవరూ కూడా వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. అశిశ్ రోడ్డుపై పడిపోయిన వెంటనే దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత స్థానికులు పోలీసులకు సమాచారమందించి, యువకుడిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. ఆశిశ్‌పై దాడి ఎందుకు జరిగిందనేది ఇంకా తెలియలేదు. అయితే గురువారం ఉదయం ఓ బాలుడు అనుకోకుండా కొంతమందిపై వాటర్ బెలూన్లు విసిరాడని, దీంతో వారు ఆ బాలుడిని కొడుతుండగా రక్షించడానికి ఆశిశ్ వారిని అడ్డుకోవడంతో చిన్న వాగ్వాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వారే ఈ దాడికి పాల్పడి ఉండొచ్చని అంటున్నారు.

తొలిరోజు... కార్తీని ప్రశ్నించిన సీబీఐ

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయి సీబీఐ కస్టడీలో ఉన్న కార్తీ చిదంబరానికి.. అధికారులు తొలిరోజు ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే విచారణ ప్రారంభించిన అధికారులు.. ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎఫ్ఐపీబీ) అందించిన పత్రాల ఆధారంగా ప్రశ్నలు సంధించారు. అంతకుముందే కార్తీ తన న్యాయవాదితో గంటసేపు సమావేశమయ్యారు. ఈ నెల ఆరు వరకు ఆయన సీబీఐ కస్టడీలో ఉండనున్నారు. కార్తీ తండ్రి పి. చిదంబరం కేంద్ర మాజీ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు.. ఐఎన్ఎక్స్ మీడియాలో అక్రమంగా విదేశి పెట్టుబడులను అనుమతించారనే ఆరోపణలతో కార్తీని మూడు రోజుల క్రితం సీబీఐ అరెస్టు చేసింది.

పీఎన్‌బీ కుంభకోణాన్ని 'క్యాన్సర్'తో పోల్చొద్దు

బ్యాంక్ సీఈవోకు వైద్యుడి లేఖ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణాన్ని క్యాన్సర్‌తో పోల్చొద్దని ఆ బ్యాంకు సీఈవో సునీల్ మెహతాకు రాసిన లేఖలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత, కాన్సర్ స్పెషలిస్ట్ వి.శాంత స్పష్టం చేశారు. దేశంలోనే అతిపెద్ద కుంభకోణానికి తెరతీసి విదేశాలకు పారిపోయిన నీరవ్‌మోడీకి సంబంధించిన 12,717 కోట్ల కుంభకోణాన్ని క్యాన్సర్‌తో పోల్చుతూ సునీల్ మెహతా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే 'క్యాన్సర్' అనే పదాన్ని వాడటం సరికాదని మెహతాను డాక్టర్ శాంత అభిశంసించారు. 'పంజాబ్ నేషనల్ బ్యాంకు స్కాంను క్యాన్సర్‌తో పోల్చడం సరికాదు. అవినీతి అనేది నేరం.. సిగ్గుచేటైన విషయం... కానీ క్యాన్సర్ అలాంటిది కాదు. రెండింటిని పోల్చడానికి ప్రయత్నించవద్దు' అని ఆమె లేఖలో పేర్కొన్నారు. మెహతా చేసిన వాఖ్యలు చదివి తాను ఎంతో చింతించానని అన్నారు. ఎంతోమందికి చికిత్స ద్వారా క్యాన్సర్ నయమవుతున్నదని, వార ఎప్పటిలాగే జీవిస్తున్నారని అన్నారు. అపరాధ భావం, నిరాశ, ఆందోళనలకు క్యాన్సర్ అనే పదం వాడకూడదని, అవమానించడానికి అస్సలు వాడకూడదని ఆమె తెలిపారు.

సోషల్ లొల్లి

జాతిపితకి నమస్కారం...జాతి ద్రోహికీ మరో నమస్కారం!

జనమే వెర్రి గొర్రెలు



ఇద్దరు జడ్జీల నియామకంపై

కేంద్రం తిరకాసు

కొలీజియం సిఫారసులను పక్కన పెట్టిన మోడీ సర్కార్



న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియంతో కేంద్ర ప్రభుత్వానికి వివాదం కొనసాగుతూనే ఉన్నది. ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కెఎం జోసెఫ్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా, పంజాబ్-హర్యానా హైకోర్టు జడ్జి సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేయగా కేంద్రం నిరాకరించింది. సీనియారిటీ సూత్రాన్ని పాటించలేదంటూ కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఏడాది జనవరి 10న ఈ రెండు నియామకాలను కొలీజియం ప్రతిపాదించగా కేంద్రం పక్కన పెట్టింది. కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రాతోపాటు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్‌గొగోయ్, మరో ఇద్దరు న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నారు.

1990వ దశకంలో సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు తీర్పులకూ కొలీజియం సిఫారసులు విరుద్ధంగా ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దేశంలోని 24 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం జస్టిస్ జోసెఫ్ 12వ స్థానంలో, హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం 45వ స్థానంలో ఉన్నందున సుప్రీంకోర్టు జడ్జిగా ఎలా సూచిస్తారని కొలీజియాన్ని కేంద్రం ప్రశ్నించింది. అయితే, వారి ఎంపికకు సంబంధించి కొలీజియం పరిగణనలోకి తీసుకున్న ఇతర అంశాలు కూడా ఉన్నాయి. అంతేగాక జస్టిస్ కెఎం జోసెఫ్ పట్ల కేంద్రం అభ్యంతరానికి పరిశీలకులు వేరే కారణాన్ని ఉటంకిస్తున్నారు. 2016లో ఉత్తరాఖండ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించగా జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని ఆ రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. అందుకే జస్టిస్ జోసెఫ్ పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకత అని పరిశీలకులు చెబుతున్నారు.

గౌరీ లంకేశ్ హత్యకేసు నిందితుడిని అప్పగించండి : సిట్



బెంగళూరు : జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడిని విచారించేందుకు తమకు అప్పగించాలని ప్రత్యేక విచారణ బృందం(సిట్) బెంగుళూరు పోలీసులను కోరింది. సెప్టెంబరు 5, 2017న గౌరీ లంకేశ్ (55)ను బెంగళూరుకు సమీపంలో ఆమె నివాసంలో హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. కాగా, ఈ హత్యకేసులో ఫిబ్రవరి 18న కె.టి. నవీన్‌కుమార్(37) అరెస్టు చేశారు. విచారణలో మద్దూర్ ప్రాంతంలోని కొందరు మిత్రులతో అతని ఫోన్ సంభాషణలు వెలుగులోకి వచ్చాయని, వారికి గౌరీ లంకేశ్ హత్యతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో అతనిని విచారించేందుకు తమకు అప్పగించాలని సిట్ బృందం కోరుతోంది. నిందితుడు కుమార్‌కు హిందుత్వ యువ సేనా, హిందూ జన జాగృతి సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు విచారణలో వెల్లడైంది. అతని నుండి మారణాయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గౌరీ లంకేశ్ హత్యకు వాడిన తుపాకి కూడా 7.65 రేంజ్ సామర్థ్యమున్న దేశీయ తుపాకీ కావడంతో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించినట్టు తెలిపారు. గౌరీలంకేశ్ హత్యకు వాడిన బుల్లెట్లు, తుపాకి కూడా కన్నడ స్కాలర్, రీసెర్చర్ అయిన ఎంఎం. కల్బుర్గి హత్యకు వాడినతరహావేనని తేల్చారు. గోవింద్‌పన్సారే, ఆయన భార్య ఉమా పన్సారేల హత్యకు కూడా ఇవే ఆయుధాలు ఉపయోగించినట్టు నిర్ధారణైందని పోలీసులు తెలిపారు. నరేంద్ర దబోల్కర్‌ను ఆగష్టు 20, 2013లో పూణెలో హత్య చేసింది కూడా ఇదే తరహా తుపాకీతో అని తేల్చారు.

నేడు మూడు రాష్ట్రాల ఫలితాలు



అగర్తల/కోహిమా/షిల్లాంగ్: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. త్రిపురలో ఫిబ్రవరి 18న, మేఘాలయా, నాగాలాండ్‌లలో ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. మూడు రాష్ట్రాల్లోనూ 60 చొప్పున అసెంబ్లీ స్థానాలున్నాయి. అయితే మూడు రాష్ట్రాల్లోనూ 59 స్థానాలకే పోలింగ్ జరిగింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

త్రిపుర

25 ఏండ్లుగా సీపీఎం నేతృత్వంలోని వామపక్ష కూటమే అధికారంలో ఉన్న త్రిపురలో ఈసారి కూడా విజయం తమదేనని లెఫ్ట్ నేతలు స్పష్టం చేస్తున్నారు. సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ మాట్లాడుతూ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేది వామపక్ష కూటమేనని అన్నారు. 'లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వమే ఏర్పడుతుంది. అందులో ఎలాంటి సందేహంలేదు. శాంతి, స్థిరమైన అభివృద్ధికి త్రిపుర ప్రజలు ఓటువేశారు' అని ధర్ చెప్పారు. 'బీజేపీని త్రిపుర ప్రజలు అడ్డుకుంటారు. భారత రాజకీయాల్లో బీజేపీ వ్యతిరేక శ్రేణుల్లో త్రిపుర విజయం నూతనోత్సాహాన్ని నింపుతుంది' అన్నారు. బీజేపీ కూడా విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నది. త్రిపుర ప్రజలు మార్పు కోరుకుంటున్నారనీ, తదుపరి ప్రభుత్వం తమదేనని బీజేపీ త్రిపుర అధ్యక్షులు బిప్లవ్ కుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు.

నాగాలాండ్

నాగాలాండ్‌లో 2003 నుంచి నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్ఎఫ్‌పీ) పార్టీనే అధికారంలో ఉంది. 2008లో ఇక్కడ రాజకీయ సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో మూడు నెలల పాటు రాష్ట్రపతి పాలన విధించారు. అయినప్పటికీ ఆ తర్వాత కూడా ఎన్ఎఫ్‌పీనే అధికారంలోకి వచ్చింది. ఈసారి కూడా మాదే విజయమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి టిఆర్ జిలియంజ్ విశ్వాసం వ్యక్తం చేశారు. తాము సొంతంగానే ఆ మ్యాజిక్ ఫిగర్‌ను సాధిస్తామన్నారు. కనీసం 27 స్థానాలు తమను వరిస్తాయన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) జనతాదళ్ యునైటెడ్ (జేడీ-యూ)తో కలసి ఎన్‌పీఎఫ్ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని అన్నారు.

మేఘాలయ

మేఘాలయాలో గత పదేండ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ సారి కూడా అధికారంలోకి వస్తే ముచ్చటగా మూడోసారి మేఘాలయా పీఠాన్ని దక్కించుకోనుంది. ఈ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని కాంగ్రెస్ భావిస్తున్నది.

మూడు రాష్ట్రాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు : ఈసీ

మూడు రాష్ట్రాల్లో ఎన్నికల లెక్కింపుకు ఈసీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. కట్టుదిట్టమైన భద్రత నడుమ శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నట్టు ఈసీ అధికారులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రతను ఏర్పాటుచేశాం. కౌంటింగ్ హాల్స్ కూడా సిద్దంగా ఉన్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు, సాధారణ పరిశీలకులను నియమించాం' అని ఎన్నికల అధికారులు తెలిపారు.

టాప్ 400లో భారత వర్సిటీలు ఆరే

- క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీస్ ర్యాంకింగ్-2018 జాబితా విడుదల



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల్లో భారత వర్సిటీలు చతికిలపడ్డాయి. టాప్ 400 ర్యాంకుల్లో దేశానికి చెందిన ఆరు విశ్వవిద్యాలయాలు ఆరు మాత్రమే చోటుచేసుకున్నాయి. ఇందులో ఐదు ఐఐటీలు అయితే ఒకటి ఐఐఎస్‌సీ. ఈ ర్యాంకుల్లో ఐఐటీ ఢిల్లీ 172వ స్థానాన్ని పొంది ఇండియా వర్సిటీల్లో మొదటి స్థానంలో ఉన్నది. తర్వాత వరుసగా ఐఐటీ బొంబాయ్ 179వ, ఐఐఎస్‌సీ 190వ, ఐఐటీ మద్రాస్ 264వ, ఐఐటీ కాన్పూర్ 293వ, ఐఐటీ ఖరగ్‌పూర్ 308వ ర్యాంకులను పొందాయి. గతేడాది ర్యాంకులతో పోల్చితే ఐఐటీ ఢిల్లీ 13 ర్యాంకులను, ఐఐటీ బొంబాయి 40 ర్యాంకులను మెరుగుపరుచుకోగా, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లు కొద్ది మొత్తంలో అభివృద్ధిని చూపించాయి. అయితే ఐఐఎస్‌సీ 38 ర్యాంకులను, ఐఐటీ మద్రాస్ 15ర్యాంకుల మేర దిగజారాయి. ఆర్ట్స్ అండ్ హ్యూమనిటీస్ విభాగం టాప్ 400 ర్యాంకుల్లో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) 228వ, ఢిల్లీ యూనివర్సిటీ 252వ, ఐఐటీ ఢిల్లీ 351వ ర్యాంకులను సాధించాయి. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం టాప్ 400లో దేశానికి చెందిన 10 వర్సిటీలు చోటును సంపాదించుకున్నాయి. ఈ జాబితాలో ఐఐటీ ఢిల్లీ(64), ఐఐటీ బొంబాయి(68), ఐఐటీ మద్రాస్(95), ఐఐటీ ఖరగ్‌పూర్(108), ఐఐఎస్‌సీ(115), ఐఐటీ కాన్పూర్(115), ఐఐటీ రూర్కీ(173), ఐఐటీ గువహతి(271), ఢిల్లీ యూనివర్సిటీ(296), చెన్నైలోని అన్నా యూనివర్సిటీ(388)లు ఉన్నాయి.

సికార్‌లో 144వ సెక్షన్

రైతు ఆందోళనలపై రాజస్థాన్ సర్కార్ నిర్బంధకాండ

- ఎన్ని అడ్డంకులు సృష్టించినా మోడీ సభలో మా నిరసన గళం వినిపిస్తాం : ఏఐకేఎస్



జైపూర్ : రైతు ఆందోళనలపై రాజస్థాన్‌లో వసుంధరరాజే నేతృత్వంలోని బీజేపీ సర్కార్ నిర్బంధకాండకు దిగుతున్నది. గత కొన్ని నెలలుగా వివిధ దశల్లో రైతులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. రుణమాఫీ చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం తమ పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఆందోళనలకు కేంద్ర బిందువుగా వున్న సికార్ జిల్లాలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 144వ సెక్షన్ విధించింది. నలుగురు కంటే ఎక్కువమంది గుంపుగా కనిపిస్తే అరెస్టులు చేస్తామని ఆదేశాలు జారీచేసింది. ఈ జిల్లాలో గత సెప్టెంబరులో భారీ ఎత్తున రైతు ఉద్యమం జరిగింది. ఆ తర్వాత ఫిబ్రవరి 22న జైపూర్‌లో రైతులు నిరసన ప్రదర్శనకు దిగారు. ఈ ప్రదర్శన నేపథ్యంలో వివిధ జిల్లాల్లో రైతులను ప్రభుత్వం ఎక్కడికక్కడ అరెస్టులు చేయించింది. తమ సమస్యల పరిష్కారం కోసం నిర్బంధాన్ని ఎదిరించి రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రుణమాఫీ, స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధరను చెల్లించాలని రైతు ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) డిమాండ్ చేస్తున్నది.

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఝుంఝునుకు రానున్న ప్రధాన మంత్రి మోడీ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్ళాలని ఏఐకేఎస్ నిర్ణయించింది. ఆ కార్యక్రమ నిర్వహణకు ఏఐకేఎస్ ప్రణాళికలను అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా సికార్‌లో 144వ సెక్షన్ విధించింది.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి ప్రధాని మోడీ పలు సభల్లో చేసిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమయ్యారు' అని ఏఐకేఎస్ జాయింట్ సెక్రటరీ సంజయ్ మాధవ్ అన్నారు. 'జైపూర్‌లో మాస్ ధర్నాలు, ర్యాలీలు నిర్వహించేందుకు ఇప్పటికే అనుమతించడంలేదు. సిటీకి 10 కిలో మీటర్ల దూరంలో నిరసన కార్యక్రమాలు చేసుకోమని ప్రభుత్వం చెబుతున్నది. అది కూడా మధ్యాహ్నం 12 నుంచి నాలుగు గంటలవరకే అనుమతి ఉంది. అదే సమయంలో మతపరమైన ఊరేగింపులకు మాత్రం స్వేచ్ఛగా అనుమతినిస్తున్నారు' అని మాధవ్ చెప్పారు. 8న మోడీ కార్యక్రమం కోసం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి వసుంధర రాజే ఫిబ్రవరి 28న ఝుంఝునును సందర్శించారు. గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. కాగా, ఏదేమైనా తమ ఆందోళనను విరమించేదిలేదని, మోడీ సభలో తమ నిరసనను వ్యక్తంచేసి తీరుతామని ఏఐకేఎస్ స్పష్టం చేస్తున్నది. 'ప్రధానమంత్రి మోడీని కలిసేందుకు మా ప్లాన్‌లో మేమున్నాం. రాష్ట్ర యంత్రాంగం మమ్మల్ని అడ్డుకోవాలని చూస్తే.. ఆ తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రధానికి మా నిరసన గళం వినిపిస్తాం. మా సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఈ ఆందోళన ఆగదు' అని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు అమ్రా రామ్ చెప్పారు.

నెట్-ఫోన్ వలలో యువత విలవిల



న్యూఢిల్లీ దేశంలో యువత పెద్ద ఎత్తున స్మార్ట్ ఫోన్‌లు, వాటితో లభించే ఇంటర్నెట్ సేవలకు బానిసలై పోతున్నారని వైద్య రంగానికి చెందిన ఒక సర్వే నిర్ధారించింది. ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్య పరిశోధనల సంస్థ, మౌలానా అజాద్ మెడికల్ కాలేజీ సంయుక్తంగా నిర్వహించిన సర్వే ఫలితాలను అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా జర్నల్ ప్రచురించింది. ఈ సర్వేలో 817 మంది కాలేజీ, స్కూలు విద్యార్థులతో పాటు యువ ప్రొఫెషనల్స్‌ను ఫోన్ వినియోగంపై ప్రశ్నించారు. వారిలో అత్యధికులు అంటే దాదాపు 56 శాతంమంది ఏదో రూపంలో మొబైల్ ఫోన్ దుష్ప్రభావాలకు గురైనట్టు అంగీకరించారు. ఫోన్‌లో గేమింగ్, ఇంటర్నెట్ వాడకం, సోషల్ మీడియాలో తలమునకలైపోవటం వంటివి నిత్య కృత్యంగా మారిందని, ఫలితంగా నిద్రలేమి సమస్యను ఎదుర్కొంటున్నారని స్పష్టమైంది. ముఖ్యంగా ఫోన్ అందుబాటులో లేని సమయాల్లో అలజడి, పని ఒత్తిడి, మానసిక ఆందోళన, అతి దూకుడు, ఒంటరితనం, ముభావంగా ఇతరులతో కలవకుండా దురంగా ఉండిపోవడం వంటి వ్యక్తిత్వ ప్రభావాలు కనిపిస్తున్నాయని, అందువల్ల వాటి నుంచి బయటపడేందుకు నిపుణుల సహాయసహకారాలు తీసుకుంటున్నామని వారిలో 41 శాతం అంగీకరించారు. 15 శాతం మంది ఇప్పటికే తాము నిపుణులను ఆశ్రయించినట్టు తెలిపారు. సర్వే నిర్వాహకుల్లో ఒకరైన మౌలానా అజాద్ మెడికల్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ సునీలా గార్గ్ సమస్యను వివరిస్తూ ఈ ఫోన్ ప్రభావం చాలా ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఎయిమ్స్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ నందకుమార్ మాట్లాడుతూ ఇదివరకు సాంకేతికంగా అభివృద్ధి చెందిన దక్షిణకొరియా వంటి దేశాలకే పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు మనదేశంలో కూడా విస్తరిస్తోందని చెప్పారు.

దళిత క్రైస్తవ కుటుంబంపై దాడి

చర్చిలో ప్రార్థన చేస్తుండగా రాళ్లు విసిరిన వైనం

- ఆర్ఎస్ఎస్ వ్యక్తులమంటూ బెదిరించిన దుండగులు
- బాధితులకు కేవీపీఎస్ పరామర్శ



నవతెలంగాణ-కలెక్టరేట్/రామడుగు

చర్చిలో ప్రార్థనలు చేసుకుంటున్న ఓ దళిత ఫాస్టర్ కుటుంబంపై కొందరు గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆర్ఎస్ఎస్ వ్యక్తులమంటూ అకారణంగా దాడి చేయడంతో పాటు ఇదేంటని ప్రశ్నించినందుకు దుర్భాషలాడుతూ రాళ్లు విసిరి గాయపరిచారు. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కేవీపీఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించడంతో విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.

బాధితుల వివరాల ప్రకారం... గత నెల 26న రామడుగు మండలం రాంచంద్రాపూర్‌లోని చర్చిలో ఫాస్టర్ మోజెస్, తల్లి నర్సమ్మ, అక్క మరియా, తమ్ముడు ఇమ్మాన్యుయల్, కుమారుడు ప్రభాకర్ ప్రార్థనలు చేసుకుంటున్నారు. చర్చి ఆవరణలోని చెట్ల కింద బైబిల్ పఠిస్తున్నారు. అదే సమయంలో రామడుగుకు చెందిన గుర్తుతెలియని ఆరుగురు యువకులు మద్యం మత్తులో అక్కడికి వచ్చారు. చర్చిని ఆనుకుని ఉన్న చేతిపంపును బలంగా కొడుతూ బూతులు తిట్టారు. చర్చి గేటుకు ఉన్న ఫ్లెక్సీని అసభ్యపదజాలంతో చదువుతూ 'ఇక్కడ ఫాస్టర్ ఎవడ్రా..?' అంటూ రెచ్చగొట్టారు. అక్కడే ఉన్న మోజెస్ తానే ఫాస్టర్‌నని చెబుతుండగా బూతుపురాణం అందుకున్నారు. ఫాస్టర్ కుటుంబ సభ్యులు ఇదేంటని ప్రశ్నించడంతో ఒక్కసారిగా దాడికి దిగారు.


అక్కడే ఉన్న రాళ్లను వాళ్లపైకి విసరడంతో మోజెస్, ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. ఇమ్మాన్యుయల్ కాలుపై బండరాయి వేశారు. దీంతో అతని కాలు విరిగింది. 'మేం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలం' అంటూ బెదిరింపులకు దిగారు. గొడవ సమయంలో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చినా ఘటనా స్థలానికి చేరుకునేలోపే ఇద్దరు పరారయ్యారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బాధితులు చికిత్స పొందు తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శోభ స్పందించి కేసు విచారణ చేయాలని ఆదేశించారు. తమకు ప్రాణభయం ఉందని, పోలీసులే రక్షించాలని బాధితులు కోరుతున్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : సురేష్, కేవీపీఎస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి

దళిత ఫాస్టర్ కుటుంబంపై దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యం అందించాలి. ఇలాంటి ఘటనలు మరలా జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

ఫ్రెండ్లీ ఫైట్

- బీజేపీ, టీఆర్ఎస్‌లవి డ్రామాలు : వీహెచ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని మాజీ ఎంపీ వి.హనుమంతరావు విమర్శించారు. ఆ రెండు పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటూ లోలోపల మాత్రం అవగాహనతో ఉన్నా యని, ఆ పార్టీలు ఫ్రెండ్లీ ఫైట్ చేస్తున్నాయన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎందుకు ఖండించ లేదన్నారు. సీఎం వ్యాఖ్యలు తనను ఎంతో బాధించాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెబుతుంటే...కవిత మాత్రం ఆ పదాలు మాత్రం పొరపాటుగా దొర్లి ఉంటాయని చెప్పడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. తిట్లదండకంలో మంత్రి కేటీఆర్ పీహెచ్‌డీ సాధించారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే అమరవీరుల కుటుంబాలకు రాజ్యసభసీటు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పంట రాయితీ రూ.4 వేలివ్వాలి

- కౌలు, పోడు రైతులకు వర్తింపజేయాలి
- 15 వరకు దశలవారీ ఆందోళనకు తెలంగాణ రైతు సంఘం పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న వ్యవసాయ పంట రాయితీని కౌలు, పోడు భూములు సాగుచేసే రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15 వరకు ఆందోళనలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈమేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, ఉపాధ్యక్షులు హరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి వి.సంజీవరెడ్డి ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల, డివిజన్ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, కౌలుదార్లు, ఇతరులు భారీస్థాయిలో పాల్గొని ఆందోళనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 1971 పాసు పుస్తకాల చట్టం, అధ్యాయం 6లోని సెక్షన్ 2లో భూయజమాని కౌలుదారు, తాకట్టుదారు, ఆక్రమణదారులకు పాసు పుస్తకాలు ఇవ్వాలని ఉందని అన్నారు. కాగా ఈ చట్టాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో సవరించి చట్టం నుంచి కౌలుదారు, ఆక్రమణదారు, తాకట్టుదారు అనే పదాలను తొలగించిందని విమర్శించారు.

దీంతో 14 లక్షల మంది కౌలుదార్లు పంట రాయితీని కోల్పోయారని గుర్తు చేశారు. వీరి రక్షణకు అనేక చట్టాలు ఉన్నా, ప్రభుత్వం పట్టించుకో వడం లేదన్నారు. రక్షిత కౌలుదారీ చట్టం-1951, పాసు పుస్తకాల చట్టం -1971, ఆంధ్రప్రదేశ్ కౌలు దారీ చట్టం-1984, లైసెన్స్‌డ్ రైతుల చట్టం-2011 చట్టాల ద్వారా నిజాం కాలం నుంచి 2014 వరకు కౌలుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించినట్టు చెప్పారు. కౌలుదార్లకు రక్షణ కల్పిస్తామని ఒకవైపు చెబుతూనే, మరోవైపు వారి హక్కులను కాలరాస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ప్రభుత్వ పథకాలు వర్తించవని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 56 లక్షల కమతాల్లో 20లక్షల మందికి ప్రభుత్వ రాయితీలు వర్తించవన్నారు. దాదాపు 36 లక్షల మందికే పంటల రాయితీ పథకం అమలుచేయనున్నారని చెప్పారు.

బహుళ పంటల విధానానికి స్వస్తిచెబితే దిగుబడులు దెబ్బతింటాయన్నారు. రుణాల పంపిణీ బాధ్యతను కూడా రైతు సమన్వయ సమితిలకు అప్పగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్కెట్ జోక్యం పథకం కింద సమితులకు నిధులు కేటాయిస్తారని, వాస్తవ పరిస్థితిని గుర్తించి పంటలు వేసి నష్టపోతున్న రైతులందరికి ప్రభుత్వ రాయితీలు ఇవ్వాలని కోరారు. అందుకనుగుణంగా చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

సత్యపాల్‌ను తొలగించాలి

- టీఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సైన్స్‌కు వ్యతిరేకంగా కేంద్రమంత్రి సత్యపాల్ మాట్లాడటం సరికాదని టీఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందునాయక్, శోభన్‌నాయక్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అశాస్త్రీయ వాదనలు రాజ్యాంగలక్ష్యమైన శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. సైన్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూ, విద్యాశాఖమంత్రిగా కొనసాగడంసరికాదనీ, సత్యపాల్ సింగ్‌ను వెంటనే కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

జనజాతరకు టీటీయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఎస్ రద్దు కోసం ఈనెల 10న సీపీఎస్ఈయూ నిర్వహిస్తున్న జనజాతర కార్యక్రమానికి తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) మద్దతు ప్రకటించింది.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈ రఘునందన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీఎఫ్ మండల, జిల్లా కమిటీలు తగు ఏర్పాట్లు చేసుకుని, జనజాతరకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. పింఛన్ భిక్ష కాదనీ, ఉద్యోగుల హక్కని సుప్రీంకోర్టు చెందని గుర్తు చేశారు.

కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి:టీఆర్‌కేఎస్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని కార్మికులకు కనీసవేతనం రూ.18వేలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక సమాఖ్య(టీఆర్‌కేఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణారెడ్డి, కార్యదర్శి బి.సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసంఘంరాష్ట్ర కమిటీ సమావేశం చందా నగర్‌లో జరిగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పలురంగాల్లో నుంచి కనీసవేతనాలు జీవోల కాలపరిమితి ముగిసినా, ఇప్పటికీ అవే కొనసాగుతు న్నాయని అన్నారు.

కాంగ్రెస్‌ది అంతిమయాత్ర

అది అలీబాబా దొంగల యాత్రే

- జానాకు రోషమెక్కువ.. పనితక్కువ
- తెలంగాణలో బీజేపీకి తికానా లేదు: హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



నవతెలంగాణ- వికారాబాద్‌రూరల్

కాంగ్రెస్‌ది ప్రజాచైతన్య బస్సుయాత్ర కాదని.. ఆ పార్టీకి అది అంతిమయాత్రని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా నవాబ్‌పేట్ మండలంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ అధికార కాంక్షతో టీఆర్ఎస్‌పై అనవసర ఆరోపణలు చేస్తోందన్నారు. ఐటీశాఖ మంత్రి తారకరామారావు అన్నట్టు వారు బస్సుయాత్రలో అలీబాబా 40 దొంగల యాత్ర సాగిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డికి రోషమెక్కువ.. పని తక్కువ ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీకి తికానా లేకున్నా వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తామే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ప్రచారం చేయడం విచిత్రంగా ఉందన్నారు. తెలంగాణలో ఏడు సీట్లు గెలవలేని బీజేపీ అధికారం ఎలా చేపడుతుందని అన్నారు. కేంద్రంతో తమకు పనిలేదని, ప్రజలే తమకు బాసులని అన్నారు. త్వరలో కోటి ఎకరాలకు సాగు నీరందిస్తామని వివరించారు. మార్చిలో మిషన్ భగీరథ కింద ఇంటింటికీ తాగు నీరందిస్తామని చెప్పారు. 2018 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించి ఖరీఫ్, రబీ సీజన్‌కుగానూ ఐదెకరాల్లోపు ఉన్న ప్రతి రైతుకూ ఎకరానికి రూ.8వేల చొప్పున చెక్కుల రూపంలో అందజేస్తామన్నారు. శాంతి భద్రతల్లో తెలంగాణ పోలీస్ శాఖ నెంబర్‌వన్‌గా ఉందన్నారు. నిజాం కాలంలో నిధులు అధికంగా నిల్వ ఉండేవని, ఆ తర్వాత మళ్లీ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 17.5 శాతం వృద్ధిరేటు సాధించి దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్‌గా ఉందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా ఇంత వృద్ధిరేటు సాధించలేదని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ వంద సీట్లు గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజీవరావు, కాలే యాదయ్య, వికారాబాద్ గ్రంథాలయ చైర్మెన్ కొండల్‌రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీకల్లోతు కష్టాల్లో టీడీపీ..

చంద్రబాబే దిక్కు : మోత్కుపల్లి

- రేవంత్‌పై విమర్శలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమున్నత ఆశయాలతో నాడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు భ్రష్టుపట్టిపోయిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం టీడీపీ పీకల్లోతు కష్టాల్లో ఉందని, నాయకత్వలోపంతో కొట్టుమిట్టాడుతున్నదని, ఓటుకు నోటు కేసు వల్లే ఈ దుస్థితి దాపురించిందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. గత ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సాధించినా, తర్వాతి కాలంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా పార్టీని వీడినా అడిగే దిక్కులేకుండాపోయిందని, పరిస్థితి మారాలంటే చంద్రబాబునాయుడే స్వయంగా తెలంగాణలో తిరగాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం ఉధృతమైన సమయంలో టీడీపీ రెండు నాల్కల విధానంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా, నాయకులు సైతం తిట్టిపోసినా పట్టించుకోకుండా చంద్రబాబు వెంటే నడిచానని మోత్కుపల్లి చెప్పారు. ఉద్యమానికి మద్దతు ఇవ్వని కారణంగా కొందరు నన్ను చంపాలనుకున్నారు. మా ఇంటి దగ్గర రెక్కీ కూడా చేశారు. అయినాసరే నేను భయపడలేదు. నా ప్రాణాన్ని పణంగా పెట్టి, ఉరితాడు వేసుకుని మరీ చంద్రబాబుకు అండగా నిలబడ్డాను. కానీ నా త్యాగాలకు విలువలేకుండా పోయిందని అన్నారు. అసమర్థులు, ద్రోహుల చేతికి చంద్రబాబు పార్టీని అప్పగించారు. ఆ నీతిమాలిన, బజారు మనుషుల పక్కనే నేనూ కూర్చోవాల్సి వచ్చింది. అయినాసరే, చంద్రబాబు నాయకత్వాన్నే సమర్థించాను. కానీ ఆయనేం చేశారు? నన్ను పిలవకుండా హైదరాబాద్‌లో మీటింగ్ పెట్టారు. ఇది నన్ను దారుణంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డు పరిస్థితుల్లోనూ టీడీపీ గత ఎన్నికల్లో పలు ఎమ్మెల్యే సీట్లు గెలిచిందని, అయితే, ఓటుకు నోటు కేసు తరువాత అంతా తలకిందులైంది. డబ్బు సంచులతో పట్టుపడ్డ రేవంత్ రెడ్డిని ఆనాడే పార్టీ నుంచి బహిష్కరించి ఉంటే పార్టీ బతికుండేది. అలా జరగకపోవడం వల్ల ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక్కొక్కరుగా పార్టీ నుంచి జారుకున్నారు. పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరి పరువు తీశారని చెప్పారు. పార్టీనే నమ్ముకుని ఉన్న కార్యకర్తలకు దిక్కులేకుండా పోయింది. స్వయంగా చంద్రబాబు తిరిగితేగానీ తెలంగాణలో మేం బాగుపడం" అని మోత్కుపల్లి అన్నారు. తెలంగాణలో పార్టీ బతకాలంటే పొత్తులు తప్పనిసరి. ఏ పార్టీతో అన్నది సమయం వచ్చినప్పుడు నిర్ణయిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై మోత్కుపల్లి స్పందించారు. కాంగ్రెస్, బీజేపీలతో ఎట్టిపరిస్థితుల్లోనూ కలవబోమని, టీఆర్ఎస్‌తోనే టీడీపీ పొత్తు పెట్టుకుంటుందని, చాలా కాలం నుంచే తానీ ప్రతిపాదన చేస్తున్నానని ఆయన గుర్తుచేశారు.

దొంగల నోట నీతి సూక్తులు

సంపాదకీయం

విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ కుంభకోణాల నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలంటూ కొద్దిరోజులుగా కార్పొరేట్ శక్తులు చేస్తున్న చర్చ విస్మయం కలిగిస్తోంది. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, సామాన్యులకు అండగా నిలిచిన జాతీయ బ్యాంకులను లూటీ చేయడంలో పాత్రధారులుగా వ్యవహరించిన వారే తాజా చర్చకు సూత్రధారులు కావడం కలవరపరిచే పరిణామం. బ్యాంకింగ్ వ్యవస్థను సంక్షోభంలోనికి నెట్టివేసిన ఈ ఆర్థిక నేరాలన్నీ కార్పొరేట్ సంస్థల నిర్వాక ఫలితమే! సొంత లాభాల కోసం ఎంతకైనా తెగించే కార్పొరేట్ యాజమాన్యాలు నిస్సిగ్గుగా ఆ దోపిడీకి పాల్పడ్డాయి. లక్షల కోట్ల ప్రజాధనాన్ని దిగమింగాయి. జాతి కష్టార్జితాన్ని స్వాహా చేసిన ఈ ఘరానా దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిన పాలకవర్గాలు వారి అడుగులకు మడుగులొత్తాయి. విదేశాలకు సాగనంపి స్వామిభక్తి చాటుకున్నాయి. జాతి సంపదను కొల్లగొడుతున్న ఈ వ్యాపార, పాలకవర్గ కుట్రను ఎత్తి చూపడానికి బదులుగా తప్పంతా ప్రభుత్వ రంగ బ్యాంకులదే అన్నట్టు, ప్రయివేటీకరణతోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నట్టు కార్పొరేట్ మీడియా కథనాలు వండి వారుస్తున్న తీరు దుర్మార్గం.

దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తూ, సామాన్యులకు అండగా ఉంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవడం అందరి బాధ్యత! దేశాన్ని దర్జాగా దోచుకుతింటున్న దొంగల నోటివెంట వస్తున్న నీతి సూక్తుల్లోని అసలు విషయాన్ని ప్రజానీకానికి చేరవేయడానికి మేధావులు నడుంబిగించాలి. వాస్తవాలను వివరించి ప్రజలను చైతన్యపరచాలి.

ప్రయివేటీకరణ వాదన చేస్తున్న వారు, దానిని సమర్థిస్తున్న వారు ఉద్దేశ్యపూర్వకంగానే కొన్ని వాస్తవాలను దాచిపెడుతున్నారు. వీటిలో కీలకమైనది ప్రయివేటురంగానికి జాతి హితం పట్టదన్నది! ఒకప్పుడు ప్రయివేటు యాజమాన్యాలు చేసిన సహాయ నిరాకరణ కారణంగానే బ్యాంకుల జాతీయకరణ అంశం ముందుకు వచ్చింది. ఆ తరువాత దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగ బ్యాంకులు నిర్వహించిన పాత్ర విస్మరించలేనిది. మారుమూల గ్రామాల్లో బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయడం నుంచి, రైతులు, నిరుద్యోగులు, ఇతర అణగారిన వర్గాలకు రుణాలు ఇవ్వడం వరకు జాతీయ బ్యాంకులు కీలకపాత్ర పోషించాయి. అంతెందుకు, నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున చేపట్టిన జన్‌ధన్ ఖాతాల ఏర్పాటులో కూడా వీటిదే పైచేయి. ప్రయివేటు బ్యాంకులు ఇది తమ పని కాదన్నట్టు వ్యవహరించాయి. ఈ ఒక్క ఉదాహరణే చాలు దేశ ప్రజలకు ఉపయోగపడేవి ఏవో తెల్చుకోవడానికి! ఇక ప్రభుత్వ రంగమంతా అవినీతిమయమంటూ చేస్తున్న ప్రచారం వాస్తవాలను తలకిందులుగా చూపడమే! లాభాలను పెంచుకోవడమే పరమావధిగా భావించే కార్పొరేట్ శక్తులు అవినీతిని పెంచి పోషిస్తాయి. చట్టాలను, నిబంధనలను ఉల్లంఘిస్తాయి. పాలకవర్గాల అండదండలతో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు, ఇతరులనూ ప్రలోభపరుస్తాయి. ఇక ప్రయివేటు రంగంలో పరిపాలనా



విధానాలు బ్రహ్మాండంగా ఉంటాయని వాదించే వారు పాలనా విధానాలు అంత గొప్పగా ఉంటే దివాళా ఎందుకు తీస్తున్నాయని, అప్పులు ఎందుకు ఎగవేస్తున్నా యంటూ ఎస్‌బీఐ చీఫ్ రజ్నీష్‌కుమార్ వేసిన ప్రశ్నలకు జవాబు చెప్పవల్సివుంది. బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలన్నీ ప్రయివేటోళ్లవేనని, ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా అప్పులు ఎగ్గొట్టలేదంటూ ఆయన చెప్పిన వాస్తవాలను విస్మరించలేం.

దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత చోటుచేసుకున్న కుంభకోణాలన్నింటిలోనూ కనిపించేది వ్యాపార, పాలకవర్గాల మధ్య పెరుగుతున్న అనైతిక మైత్రే! కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పరంపర నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ హయాంలో పతాకస్థాయికి చేరిందనడంలో సందేహం అక్కర్లేదు. అస్మదీయులకు ఉన్నదంతా దోచిపెట్టి, వారికి అన్ని విధాలా రక్షణ కల్పించే ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ విశృంఖలత కారణంగానే అన్ని వ్యవస్థలూ పతనావస్థకు చేరుతున్నాయన్నది నిర్వివాదాంశం. ప్రభుత్వరంగ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసిన విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ నిరభ్యంతరంగా విదేశాలకు వెళ్లిపోవడానికీ, ఆ తరువాత కూడా ఒకదాని వెంట మరొకటిగా వెలుగులోకి వస్తున్న బ్యాంకింగ్ అక్రమాలకూ ఈ విధానాలే కారణం. దోషులను వదిలిపెట్టి, బ్యాంకుల ఆడిటర్లు, నియంత్రణ వ్యవస్థలదే తప్పని సాక్షాత్తు దేశ ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పడం అసలు విషయాన్ని పక్కదోవ పట్టించడమే! త్వరలో జరగనున్న ఎన్నికల్లో కార్పొరేట్ల కరుణా కటాక్షాల కోసమే ప్రధానమంత్రి నరేంద్రమోడీ బ్యాంకు కుంభకోణాలపై పెదవి విప్పడంలేదన్న ఆరోపణలనూ తోసివేయలేం.

దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తూ, సామాన్యులకు అండగా ఉంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవడం అందరి బాధ్యత! దేశాన్ని దర్జాగా దోచుకుతింటున్న దొంగల నోటివెంట వస్తున్న నీతి సూక్తుల్లోని అసలు విషయాన్ని ప్రజానీకానికి చేరవేయడానికి మేధావులు నడుంబిగించాలి. వాస్తవాలను వివరించి ప్రజలను చైతన్య పరచాలి. అభూత కల్పనలు, అసత్యాలతో సాగుతున్న గోబెల్స్ ప్రచారాన్ని నిలువరించడం కోసం అభ్యుదయ, ప్రజాతంత్ర శక్తులు కదలాలి.

నల్లధనం రాదు.. అవినీతి పోదు..



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

పాలకులు అబద్దాలు, అతిశయోక్తులు, అశాస్త్రీయాలు వల్లించినా, ప్రజావ్యతిరేక విధానాలతో పాలించినా సహచరులు ప్రశ్నించరు. పెట్టుబడిదారీ పాలన ముదిరి సామ్రాజ్యవాదంగా మారుతుందని మార్క్స్ అన్నారు. సౌజన్య పక్షపాతం, నిరాసక్త నిష్క్రియాత్మకత కవలలు. ఈ దుష్ట చతుష్టయాలుసామాజిక వినాశకాలు.

సౌజన్య పక్షపాతం: అధినేతలకు, యజమానులకు మనస్తాపం కలుగుతుందని అసంతృప్తిని వ్యక్తీకరించనిలేదా తక్కువగా ప్రస్తావించే స్పందనాతీరును, మానసిక ధోరణిని సౌజన్య పక్షపాతం అంటారు. తమ అభిప్రాయాన్ని, నిజాన్ని, జ్ఞానాన్ని దాచి సమాజం ఆమోదించే ఆలోచనను చెప్పడమే సౌజన్య పక్షపాతం.దీన్ని హాథోర్న్ ఎఫెక్ట్


ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నీరవ్ మోడీ 12 వేల కోట్ల కుంభకోణానికి ఆలస్యంగా స్పందించిన మోడీ హుంకరించారు. మోసగాళ్ళు విదేశాలకు పారిపోయారు. అక్కడ మోడీయం పనిచేయదు. సౌజన్య పక్షపాతం పక్షవాతంలా పనిచేస్తోంటే చర్యలుండవు, నల్లధనం రాదు, అవినీతి పోదు, ప్రజాస్వామ్యం మనుగడ కోల్పోతుంది, రాజ్యాంగం రద్దవుతుంది, భారత్ హిందూత్వ మత దేశమవుతుంది.

(పరిశీలక ప్రభావం) అని కూడా అంటారు. అమెరికాలో షికాగో దగ్గర ఈ ప్రభావాన్ని తొలిసారిగా అనుభవించిన స్థలం హాథోర్న్. మనలను ఇతరులు గమనిస్తున్నప్పుడు వారికి అనుకూలంగా ప్రవర్తించడమే పరిశీలక ప్రభావం. ఆధునిక మానవుణ్ణి ఆవరించిన అనేక అభిజ్ఞాత పక్షపాతాలలో ఇదీ ఒకటి. "వారు మా పోషకులు, మేము లబ్దిదారులం. వారి సహాయానికి కృతజ్ఞులం. వారిని తప్పుపట్టం, విమర్శించం." ఇదీ అనుచరుల సమర్థన. అధికారం దారితప్పి, నీతి నిజాయితీలు తగ్గి, అహంకారం పెరిగి, పొగడ్తలకు పొంగి, తెగడ్తలకు కుంగి, తెగిడినవారిని తెగటార్చుతున్నప్పుడు ప్రజా జీవితంలో, సామాజిక సంబంధాలలో సౌజన్య పక్షపాతం ప్రత్యక్షమౌతుంది.

సర్వేలలో సౌజన్య పక్షపాత ధోరణులు: అనేక అంశాలపై సర్వేలు జరుగుతాయి. సర్వే చేస్తున్న సంస్థ మద్దతు ఇవ్వాలనుకున్న వాళ్ళకు అనుకూల జవాబులు వచ్చేటట్టు ప్రశ్నావళి రూపొందిస్తారు. అమరావతి భూసేకరణ సందర్భంలో ఒక దినపత్రిక వాకింగ్ పార్కులలో చర్చాగోష్ఠి నిర్వహించేది. అందులో పాలక పార్టీకి అనుకూలమైన జవాబులు వచ్చేటట్టు ప్రశ్నలడిగేవారు. మన ప్రధాని పత్రికలకు ఇంటర్వ్యూ ఇవ్వరు. ఇస్తే ఆయన ఇచ్చిన ప్రశ్నలనే పాత్రికేయులు అడగాలి. ప్రజలు పాలకులకు కోపమొచ్చే జవాబులు చెప్పరు. తమ నైజాన్ని బయట పెట్టుకోరు. అభ్యుదయవాదులుగా నటిస్తారు. ఒక సర్వేలో 80శాతం ప్రజలు పర్యావరణ పరిరక్షణకు పాటుబడుతున్నామని చెప్పారు. అదే నిజమైతే పర్యావరణం ఎందుకు పాడవుతోంది? ఎవరైనా మేము పర్యావరణాన్ని పట్టించుకోమని చెపుతారా? అని తార్కిక ప్రశ్న. రాజకీయ ప్రశ్నలకూ ఆమోద జవాబులే ఇస్తారు. ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమం వింటారా? ప్రధాని పథకాలు, విదేశీ పెట్టుబడులు మంచివా? వంటి ప్రశ్నలకు విరుద్ధ జవాబులిచ్చి, సంఘీయుల సతాయింపునకు గురికావాలని ఎవరైనా కోరుకుంటారా? అభిప్రాయ సేకరణ ప్రారంభిస్తారు. ముగ్గురు అస్మదీయులను అడుగుతారు. సహజంగా ముగ్గురూ సానుకూల జవాబులిస్తారు. 100శాతం మద్దతు లభించిందని ప్రకటిస్తారు.

ప్రజల మధ్య వ్యక్తిగత సంబంధాలను అంచనా వేయడానికి మౌఖిక సమావేశాలు, గుణాత్మక అధ్యయనాలు, ప్రత్యక్ష పరిశీలనలు జరిపారు. ప్రజా సేవలను పరీక్షించారు. భారత్, పెరు, ర్వాండాలలో విరుద్ధ ఫలితాలు వచ్చాయి. మందు పేరు తప్పుగా పలికినందుకు మొరాకోలో నర్సు నవ్వారని, తన సహోద్యోగులకు చెప్పి ఎగతాళి చేశారని మెర్సీని అన్నారు. మెరుగైన సేవలను కోరినందుకు ఈక్వడార్‌లో స్క్రింషాకు, హొండురాస్‌లో ముండిగోకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. వరుసగా నేపాల్, బొలీవియా, బంగ్లాదేశ్‌లకు చెందిన స్క్యాలర్, రాంస్, హుసేన్‌లు తమకు ఆస్పత్రులలో విరుద్ధ ప్రవర్తనలు ఎదురయ్యాయని, మమ్ములను మూర్ఖులుగా పరిగణించారని తెలిపారు. అయినా బహిరంగ సర్వేలో మొరాకోలో 94శాతం, ఈక్వడార్, ఉగాండా, జింబాబ్వేలలో 99శాతం, కరీబియన్, లాటిన్ అమెరికాలలో 100శాతం తమను మర్యాదగా చూశారని, తమకు అద్భుత సేవలు లభించాయని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో ఆరోగ్య సేవలు అధ్వానం. అయినా 2,428 మందిని సర్వే చేయగా 33శాతం మందే నిజం చెప్పారు. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచి జిల్లాలో బుర్ము, కంకే, ఒర్మాంఝి ప్రాంతాలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళలు గ్రామీణ ఆరోగ్య సేవలకు సంబంధించి నిజాలను దాచారు. ప్రభుత్వ శాఖలు శిక్షణా తరగతులు నిర్వహిస్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయాచిత లబ్ధి పొందుతారు. శిక్షణ తర్వాత సేకరించే ఫీడ్ బ్యాక్ లో విద్యార్థులందరూ అబద్ధాలే రాస్తారు. ప్రయోజనాలు పోతాయని వీళ్ళ భయం. ఫలితంగా ప్రజాధనం ఖర్చయినా శిక్షణల ప్రయోజనం నెరవేరదు.

పాలనలో: కేంద్ర పాలకులు అమెరికా తానా అంటే తందానా అంటున్నారు. అమెరికా అభివృద్ధి శాఖ మన వాణిజ్య శాఖ 2016 అక్టోబర్‌లో భారత్‌లో నగదు రహిత ఆర్థికంపై ఒప్పందం చేసుకున్నాయి. ఆ మేరకు ప్రధాని ఏకపక్షంగా నోట్లరద్దు చేశారు. మంత్రివర్గం, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ నోరు విప్పలేదు. ప్రజా వ్యతిరేక బిల్లులు, కార్యక్రమాలు, పథకాల విషయంలో మంత్రులు, అధికారులు పట్టించుకోరు. కేంద్ర నిఘావిభాగాలు, ఎన్నికల సంఘం, అధికారగణం ప్రధాని మాట జవదాటరు. బీజేపీ అధ్యక్షుని ఆదేశాలను సంఘ్ గవర్నర్లు, విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులు, సంఘీయులు పాటిస్తారు. కార్పొరేట్ల విన్యాసాలకు అధికారులు, మంత్రులు చిందేస్తారు. విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలలు, పరిశోధనాలయాలకు నిధులు తెగ్గోస్తే, దేశద్రోహం అభాండాలతో విద్యార్థులను నిర్బంధిస్తే ప్రగతి ఎలా సాధ్యం? ఇంతటి తిరోగమన "అభివృద్ధి" నమూనాను అమలు చేస్తుంటే సంబంధితులు ఎవరూ అడగరు, అడ్డుకోరు. సౌజన్య పక్షపాతం వీళ్ళను అడ్డుకుంటుంది. సంస్కృతీ పునరుద్ధరణ పేరుతో మానవ



సంస్కృతిని నాశనం చేస్తున్నారు. మనిషి మొండానికి ఏనుగు తలను అతికించిన ప్లాస్టిక్ సర్జరీ, జన్యుశాస్త్రం, కాండ కణ సాంకేతిక పరిజ్ఞానం హైందవ భారతంలోనే ఉన్నాయని మోదీ అన్నారు. ఆ సభలో పలువురు ప్రఖ్యాత వైద్యులు, అమితాబ్ బచ్చన్, సచిన్ తెండూల్కర్, సునిల్ గవాస్కర్ వంటి ప్రముఖులు ఉన్నారు. కానీ నోరు విప్పలేదు. వీరందరికీ ఏదో భయం. అందుకే ఈ నిష్క్రియాపరత్వ, పక్షపాతాలు. పాకిస్థానీయులు తలలు నరుక్కు పోయిన భారత సిపాయిల మొండాలకు పశు శిరస్సులను అతికించకుండా నాటి పాలకులను ఎందుకు నిందించారని ఎవరూ ప్రశ్నించలేదు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై మూడేండ్ల నుండి రాష్ట్ర పాలకులు కేంద్ర పాలకులకు వంత పాడుతున్నారు. అమరావతిలో ఎక్కడో ఉన్న విదేశీ సంస్థలకు, మతసంస్థలకు, ప్రయివేట్లకు వేల ఎకరాలు దానం చేశారు. అక్కడే ఉండి ప్రభుత్వాధినేతలకు ఊడిగం చేస్తున్న అధికారులకు, కార్మికులకు, ప్రగతిలో భాగస్వాములైన పేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పేదలకు, వెనుకబడిన వర్గాలకు ఒక్క అడుగు భూమి కూడా ఇవ్వలేదు. ఇది సౌజన్య పక్షపాతం పొందడానికి చేసిన పరోక్ష భూవిక్రయం.

మాధ్యమాలలో: పాలకపక్షం గాక పాలితపక్షం వహించేది, నిజాన్ని నిర్భయంగా నివేదించేది పాత్రికేయత. వామపక్షాల పత్రికలు తప్ప నేటి మాధ్యమాలన్నీ కార్పొరేట్ల సొంతం. కార్పొరేట్ల యజమానులు, ప్రభుత్వాధినేతలు, మతాధికారులు ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసిమెలిసి పనిచేస్తున్నారు. నీకిది నాకది (క్విడ్ ప్రో కో) సూత్రాన్ని అమలు చేస్తున్నారు. అందుకే వార్తలు, కథలు, కథనాలు, వ్యాసాలు, విశ్లేషణలు, వివరణలు, చిత్రాలు, వీడియోలు, సినిమాలు అన్నీ వీరి ప్రయోజనాలను కాపాడుతున్నాయి. సామాన్యుల, తాడిత, పీడిత జనాల, కూలీల, అణగదొక్కబడిన తరగతుల, శూద్రుల, గిరిజన ఆదివాసుల, రైతుల, మహిళల సమస్యలు ప్రతిబింబించవు. చట్టసభలలోని ధనికులు, వాణిజ్యవేత్తలు, గుత్తేదారులు, పెట్టుబడిదారులు చేసుకునే ప్రజావ్యతిరేక చట్టాలకు ఈ పత్రికలు మద్దతిస్తాయి. ప్రజామోదాన్ని సంపాదిస్తాయి. మతఛాందసాలను, మూఢనమ్మకాలను పోషిస్తాయి. అవినీతిని అందలమెక్కిస్తాయి. సామ్రాజ్యవాదాన్ని సమర్థిస్తాయి. యుద్ధాలకు మద్దతునిస్తాయి. ఇదంతా పత్రికా సౌజన్య పక్షపాతమే.

నష్టాలు: సౌజన్య పక్షపాతం నకారాత్మకతను సకారాత్మకంగా మారుస్తోంది. పరిశోధనలను దారి తప్పిస్తున్నది. సామాజిక శాస్త్రాల పరిశోధనా ప్రయోగాలపై దుష్ప్రభావం కలిగిస్తుంది. దీని సామాజిక ప్రభావాలు పిల్లల, విద్యార్థుల, యువకుల వ్యక్తిత్వ వికాసం, నైతికతల అభివృద్ధి మీద చెడు ప్రభావాలను కలిగిస్తాయి. ఇంటర్వ్యూ చేసినవారిని సంతోషపెట్టడానికి, సంబంధిత అధికారులకు కోపం తెప్పించకుండా ఉండడానికి వ్యక్తీకరించిన ఈ సౌజన్య పక్షపాతాల వలన సేవలు ఇంకా అధ్వాన్నమవుతాయి. అధికారులు, ప్రభుత్వాలు మరింత గర్విష్టులు కావడానికి, ప్రజాసేవలను ఇంకా అశ్రద్ధ చేయడానికి దారితీస్తాయి. ప్రపంచ వ్యాపితంగా పరిశోధనా ఫలితాలను తారుమారు చేస్తాయి. ఫాసిజాన్ని, సామ్రాజ్యవాదాన్ని ప్రోత్సహిస్తాయి.

ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నీరవ్ మోడీ 12 వేల కోట్ల కుంభకోణానికి ఆలస్యంగా స్పందించిన మోడీ హుంకరించారు. మోస గాళ్ళు విదేశాలకు పారిపోయారు. అక్కడ మోడీయం పనిచేయదు. సౌజన్య పక్షపాతం పక్షవాతంలా పనిచేస్తోంటే చర్యలుండవు, నల్లధనం రాదు, అవినీతి పోదు, ప్రజాస్వామ్యం మనుగడ కోల్పోతుంది, రాజ్యాంగం రద్దవుతుంది, భారత్ హిందూత్వ మత దేశమవుతుంది.

సెల్: 9490204545

ప్రజా సంక్షేమమా? పెను సంక్షోభమా?



నంబూరి పరిపూర్ణ

ఉదయపు చీకట్లింకా తొలగక ముందే, ముంగిట్లో దినపత్రిక ఠపీమని పడ్డప్పుడు, ఎంతో ఉత్సుకతతో చేతుల్లోకి తీసుకుని, గబగబా పత్రిక పేజీల్లోకి చూపులు సారిస్తాం. మన సామాన్య పాఠకులందరి చిరకాలపు అలవాటిది. పత్రిక ముఖ పేజీలో మొదటగా కనబడేవి ప్రభుత్వం కొత్తగా చేపట్టి ప్రారంభించనున్న ప్రాజెక్టుల, పారిశ్రామిక సంస్థల వార్తలు. అంతో యింతో ఆశ, సాంత్వనలను పాఠకులకు కలిగించుతుంటాయ్ అవి. మరి తరువాతి పేజీల నిండా వ్యాపించి కనబడేవి ఏమిటి? అధికశాతం చావు వార్తలు, ఆత్మహత్యల ఉదంతాలు, రౌడీల, కిరాయి మూకలవల్ల హత్యలు! వీటికి తోడుగా ఈ మధ్యకాలంలో ప్రతి దినం చిన్న కార్ల, లారీల, మోటారు బైకుల యాక్సిడెంట్లు! వార్తలలో అత్యధికంగా అవే చోటు చేసుకుంటున్నాయి. రోజువారీగా ముగ్గురు నలుగురు, ఒక్కో దినం కుటుంబం మొత్తం - ఆన్ ది స్పాట్ మరణాలకు గురవుతున్నట్టు చదివి తెలుసుకుంటున్నప్పుడు ప్రాణం విలవిలలాడు తుంది, గుండె బద్దలవుతుంటుంది.

ఈ వరుసవారీ, రోజువారీ 'రోడ్ల మరణాల'ని - ఆకస్మిక సంఘటనలు - అని ఎలా అనుకోగలం? ఎంత వరకూ అనుకోగలం? యాక్సిడెంట్ల మరణాలకు కారకులవుతున్నవాళ్ళు వృత్తి డ్రైవర్లు మాత్రమే కాదు, ఉన్నత స్థితిపరులు, ఉన్నత చదువుల యువకులు, ఎలెక్ట్రానిక్ మీడియా కళారంగ ప్రదర్శకులూ, అధిక సంఖ్యలో వుంటున్నారు. వీరంతా అనివార్యంగా మద్యానికీ, దాని ఉన్మత్త సుఖానికీ దాసోహమన్న తరువాతనే 'డ్రైవింగ్ వీల్'ని చేతబట్టుకుంటున్నారు. వీరిలో చాలామంది - అవసరం వచ్చిగాక, రాత్రి వేళ ఆనంద విహారాలకు బయల్దేరి, మతీ శృతీ తప్పి, వాహనం మీద పట్టుకోల్పోయి, పల్టీలు కొట్టించడం జరుగుతోంది.

అనునిత్యం జరిగిపోతున్న ఈ రోడ్డు మరణాలు - తాగినవారి చేతులూ, చేతల మీదుగా జరుగుతున్నవే! ప్రజల బతుకుల రక్షణ కోసం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వ పాలకులు చేపడుతున్న పథకాలు, ప్రాజెక్టుల గురించి వారిని అభినందిస్తునే -మరో విధంగా ప్రజల బతుకులనీ, కుటుంబాలనీ సంక్షోభంలోకి దించుతున్న ప్రభుత్వ మద్య విధానాన్ని తీవ్రంగా అభిశంసించక తప్పదు ఈ సందర్భంలో.

ప్రభుత్వం అనేక చట్టపరమైన చర్యల్ని తీసుకుంటోంది. జూదాలు, బెట్టింగులు, కోడి పందేలు మొదలైనవాటిపై నిషేధ చర్యలు అమలవుతున్నాయి. గంజాయి, గుట్కా సెంటర్ల మీద దాడులు జరిపి, అమ్ముతున్న బాధ్యుల్నీ, వ్యసనపరుల్నీ అరెస్టులు చేసి శిక్షిస్తోంది. ఇవన్నీ గమనిస్తున్నప్పుడు - ప్రజల రోజువారీ బతుకులు చక్కదిద్దడం పట్ల ఎంతటి శ్రద్ధ, మరెంత పట్టింపు ప్రభుత్వ యంత్రాంగానికి - అన్న సంతృప్తి కలుగుతుంటుంది.

మరి - ఈ పేర్కొన్న వ్యసనాల జాబితాలోకి రాదా మద్యపానం అన్నది ప్రభుత్వం ముందూ, తాగే జీవుల ముందూ నిలిచిన ఓ పెద్ద ప్రశ్న! మెజారిటీ సమాజ ప్రజలు, గృహిణులు, జ్ఞానసంస్కారులున్న వ్యక్తులు - మద్యపానమంత భయంకర, వినాశకర వ్యసనం మరొకటి లేదని ఏకకంఠంతో పలుకుతారు. మద్యం అమ్మకాల వల్ల అందుతున్న ప్రభుత్వ రెవెన్యూ, దాని రాబడిలో అధికశాతంగా ఉంటున్న మాట నిజమే. మరి పాలిత జనంలోని అధికశాతం సామాన్య, దారిద్ర్యరేఖకు దిగువన ఉండే వాళ్ళ మాటేమిటి? వీళ్ళంతా తాగి ఇల్లూ, ఒళ్ళూ గుల్ల చేసుకుంటూ సమర్పించే డబ్బుతోనా పాలనాయంత్ర ఆర్థికస్థితి బ్యాలెన్సు అవ్వవలసింది?

తాగుబోతులు ఇటు తమ కుటుంబాలకూ, అటు సమాజానికీ చీడపురుగులని తెలియనివారెవరు? కుటుంబ పరంగా వీళ్ళు ఏ బాధ్యతలు లేని జులాయిలు. తాగేందుకు అవసరమైన డబ్బులివ్వని తల్లుల్నీ తండ్రుల్నీ కూడా నరికి చంపుతున్నారే! తాగి ఇండ్లకొచ్చి భార్యల్ని చావబాదుతున్నారు. వీళ్ళతోనో, మరొకరితోనో ఘర్షణ పెట్టుకుంటేనే నిషా దిగుతుందన్న పరిస్థితి. ఇంక సమాజం విషయానికొచ్చినప్పుడు - తాగుడు కోసం - ఇండ్లు దోచడం, లైంగిక దాడులూ, తరువాత చంపడం - ఈ విధమైన క్రూర చర్యలన్నిటికీ మూలం తప్పతాగుడేనని ఒప్పుకోరా ఎవరుగానీ?

వర్తమాన సిటీ కల్చరు, పెద్ద పెద్ద పట్టణాల కల్చరు - పెద్దల వ్యసనాల బాటలలో చిన్నపిల్లల్నీ గొప్పగా నడిపిస్తోంది. పన్నెండేండ్ల మగపిల్లలు తాగి ఆడపిల్లల వెంటబడడం, కిడ్నాపులు చేయడం - అభివృద్ధి చెందుతున్న సిటీ కల్చరుకు నిదర్శనం. ప్రతి సభలో, సమావేశంలో రాజకీయనేతలూ, సంఘాల పెద్దలూ - ఈనాటి యువతీయువకులే ముందునాటి దేశ భవిష్యన్నిర్మాతలు, దార్శనికులు అని మాట్లాడుతుంటారు. బాగా కలిగిన ఇండ్ల మగపిల్లలు, ఆడ పిల్లలు కూడా - అర్ధరాత్రి వరకూ క్లబ్బుల్లో పబ్బుల్లో తాగి తైతక్కలాడుతుండడం ప్రగతికి చిహ్నమా లేక మార్గమా? వీరంతా రేపటి సత్పౌరులు అవుతారా?

ఏడాదికేడాదికి మద్యం విక్రయాల టార్గెట్లను పెంచుతూ, వాటిని జయప్రదం చేస్తున్న ఎక్సైజు అధికార్లను ప్రశంసించి ప్రమోషన్‌లిచ్చి సమాజం మొత్తాన్ని తాగుబోతు సమాజంగా మార్చినప్పుడు - ప్రభుత్వం ఆశిస్తున్న ప్రజా సంక్షేమం ఎలా ఏర్పడుతుంది? సంక్షోభంలో పడడం తప్ప?!


ఈమధ్య ఒకరోజు ఆత్రంగా పేజీలు తిరగేస్తుంటే, కండ్లు చెదిరే, గుండెలదిరే వార్తొకటి కంటబడింది. ఓ రోజు మధ్యాహ్నం సమయాన పద్దెనిమిదేండ్ల ఓ యిద్దరు కుర్రాళ్ళకు మద్యంతో మజా చేసుకోవాలనిపించిందట. ఐతే ఆటో నడిపే ఆ ఇద్దరి చేతుల్లోనూ పైసల్లేవు. ఆ సమయంలో - నగర శివార్లలోని ఇండ్లకు చేరదలచిన ఇద్దరు ప్రయాణీకులు - ఒకరు ఒక కుర్రాడి ఆటోలో, రెండో అతను రెండో యువకుడి ఆటోలోను ఎక్కి కూర్చోడం, అవి దారి బట్టి సాగిపోతూ, మధ్యలో మనిషి జాడలేని పిచ్చి కంపల పొదల మధ్య హఠాత్తుగా ఆగాయి. ఆటో ఎక్కిన వాళ్ళిద్దర్నీ - వాటిని నడుపుతున్న కుర్రాళ్ళిద్దరూ - బండరాయి గుద్ది ఒకరు, కత్తితో మెడ నరికి రెండో వాడూ చంపేసి - వాళ్ళ జేబులు కొట్టారు. ఒకడికి రెండొందల రూపాయలు, సెల్‌ఫోనూ, రెండో కుర్రాడికి రెండో హతుడి జేబు నుంచి ఐదొందల రూపాయలు దక్కాయట. మనిషి ప్రాణం విలువ ఇంతేనా?

తండ్రి విపరీత తాగుడు మాన్పించాలనుకొన్న ఒక పదిహేనేండ్ల టెన్తు క్లాసు బాలిక - ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తండ్రిని ఏదో బెదిరించుదామని చిన్న మొత్తంలో ఎలుకల మందు మింగింది. కానీ పాపం - అది వికటించి నిజంగానే ప్రాణం వదిలింది. ఎంతటి విషాదకరమీ ఘటన!

ప్రభుత్వం ఒక ఉద్యమ స్థాయిలో నడుపుతున్న మద్య విక్రయాలు - సమాజానికీ, దాని తాలూకూ యువతకూ ఒనగూర్చుతున్న సంక్షేమ క్రియకు - పైన వివరించిన సంఘటనలు సాక్షీభూతాలని ఆనంద పడదామా? ఆలోచించాలి సామాజికులు!

సెల్: 9948464365

రైతు కోరుతున్న దేమిటీ? పాలకులు ఇస్తున్నదేమిటీ?



సిహెచ్. మధు

అన్నం పెట్టే రైతు గిట్టుబాటు ధర కోసం నిరసన తెల్పటం, రోడ్డు ఎక్కటం, పిడికిలి ఎత్తటం తెలంగాణ ప్రభుత్వానికి శోభ కాదు. నీళ్లు, కరెంట్, ఎరువులు, విత్తనాలు ఏమిచ్చినా రైతుకు సంతృప్తి కాదు. రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటుధర రావాలి. ఇది ముఖ్యం.

రెండు తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా తెలంగాణలో గిట్టుబాటు ధర కోసం రైతుల ఆందోళన.. బాధ.. కన్నీళ్లు చూసి బాధగా ఉంది. పాలకుల తీయని మాటలు, దళారీల మోసాలు, మిల్లర్ల దోపిడీ మధ్య పంట పండించిన రైతు విలవిలా కొట్టుకుంటున్నాడు. పండించిన పంట ఎన్నో ఆశలతో మార్కెట్‌కు తెచ్చి.. మార్కెట్‌లో జరుగుతున్న దళారీల మోసం చూసి సిండికేట్ రాజ్యం చూసి విస్తుపోయి నిరాశతో ఆకాశం చూస్తున్న మాట నిజమే..! బాధే కాదు, దుఃఖం కూడా వుబికి వస్తోంది. దుఃఖమే కాదు కోపం కూడా పెల్లుబుకుతోంది. రాత్రింబగళ్లు, చలీ వానా ఎండా చూడక కష్టపడి పండించిన పంటను రైతు మార్కెట్‌కు తీసుకెళితే ధర రాక పోవటం చూసి, మార్కెట్‌లో రైతు పరిస్థితి మనకు కలిగే స్పందన అది. రైతు ఎవరు? అన్నం పెట్టేవాడు. కష్టపడేవాడు, దేశంలో ఉత్పత్తి పెంచేవాడు, దేశ ఆర్థిక పరిస్థితిని క్రమబద్ధంలో ఉంచేవాడు, అటువంటి రైతు దయనీయ పరిస్థితి చూస్తే కడుపు తరుక్కుపోతోంది. కనులు గోదారి అవుతాయి. రైతు తాను పండించిన పంటకు మార్కెట్‌లో ధరరాక విలవిలలాడుతూ ఉంటే.. దేశం నాశనమయ్యింది. రాజకీయాలు బురదగా ఉన్నాయి. అంతే.."అంతా అవినీతే" మారే పరిస్థితి లేదు. "ఎటు చూసినా నిరుద్యోగులే మన దురదృష్టం" ఇలా మన మనసులో భావజాలం పేరుకుపోయింది. ఈ భావజాలం భయానికమైందే! నిరాశాపూరితమైందే! విషాదకరమైందే. ఈ దృష్టితోనే రైతు గిట్టుబాటు ధర గూర్చి కూడా ఆలోచిస్తాం. ఒక పంటకు ధర రాలేదంటే.. మార్కెట్ పరిస్థితి.. మార్కెట్ ధర. జాతీయ అంతర్జాతీయంగా ఆ పంట డిమాండ్‌ను బట్టి అర్థం చేసుకోవచ్చు. అన్ని పంటలకూ ధర రాకపోతే..? అన్ని పంటల పరిస్థితి మార్కెట్‌లో ఒకేలా ఉండదు. అన్ని పంటల ఉత్పత్తి ఒకేరకంగా ఉండదు. అన్ని పంటల కాలం ఉత్పత్తి ఖర్చులూ ఒకే విధంగా ఉండవు. అన్ని పంటలకు ధర రాకపోతే కావాలని చేస్తున్న కుట్రగా, దగాగా, దోపిడీగా అర్థం చేసుకోవల్సిందే! ఈ కుట్రలో సర్కారు పాత్ర లేదని అనుకోలేని పరిస్థితి. ఎందుకంటే.. తెలంగాణ సర్కారు, మంత్రులు, అధికారులు, కలెక్టర్లు పదేపదే ఒక మాట అంటున్నారు. "రైతు పండించిన మొత్తం పంట మేము కొంటాము" మొత్తం ఖరీదు చేయటానికి మార్కెట్ యార్డ్‌లో అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. ఏ రైతుకు అన్యాయం జరగనియ్యం. ప్రతీ పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తాం. మార్కెట్‌లో దళారీల జోక్యాన్ని అరికడతాం.. దళారీల దోపిడీ నుండి రైతును రక్షిస్తాం.. ఇవి ఘనమైన సర్కారు మాటలు. నాలుగేండ్ల నుండి వినిపిస్తున్న రికార్డు. విని వినీ అలసిపోయాం. కానీ రైతులకు నమ్మకముంటుంది. 'మన తెలంగాణ'.. 'మన నాయకుడు' 'మన కేసీఆర్'' "మేము ఉద్యమంలో ఆయనతో కల్సి నడిచాం.." మార్కెట్‌లోకి తమ పంటను తీసుకొని వెళ్లిన తర్వాత జరుగుతున్న దగా, మోసం చూసి రైతు నివ్వెరపోతాడు. తెచ్చిన పంట వాపసు తీసుకుపోలేడు. అమ్మాల్సిందే! అమ్మకపోతే చేసిన అప్పులు తీరవు..గిట్టుబాటు ధర జోలికి పోడు. మార్కెట్ ధరకు అమ్మేస్తాడు. ఇదీ జరుగుతున్న మోసం... ఇదే ఏండ్ల తరబడి జరుగుతున్న మోసం. మన తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మోసం తగ్గుతుందని, దళారీ రాజ్యం పోతుందని, రైతులు ఆశించారు. పంట తీసుకుపోయిన రైతుకు మార్కెట్‌లో కనిపించే దృశ్యమేమిటీ? మోసం.. దగా.. అంతా దళారీ రాజ్యం.. దళారీల ఆపలేని అసమర్థ సర్కారు



అక్కడ కనిపిస్తోంది. రైతుకు తెలిసిపోయింది. మోసం జరిగిందని, మన తెలంగాణ కాదని, తన రాష్ట్రం కాదని, గతానికి యిప్పటికీ ఏతేడా లేదని, పైగా మోసం, దగా పెరిగిందనే సత్యం రైతుకు అర్థమవుతోంది. "దళారీలు తెలంగాణ సర్కారు ఒక్కటేనని" వేరు వేరు కావని" "సర్కారు దళారీల పక్షమే అని".

ఒక రకంగా వీరోచిత సంఘటనలు, ధిక్కరణ సంఘటనలు, పిడికిలెత్తిన సంఘటనలు, ఆకలికీ, అప్పులకూ బాధపడి, భయపడి ఆత్మహత్య చేసుకొన్న రైతు ఇప్పుడు తిరగబడుతున్నాడు. ఇంతవరకు లక్షల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అన్ని రాష్ట్రాలలో మొత్తం భారతదేశంలో అన్నపూర్ణ మన తెలుగు రాష్ట్రాలలో ఈ ఆత్మహత్యలు తక్కువేమీ లేవు. భారతీయుల మంతా సిగ్గుపడాల్సిన ఆత్మహత్యలివి. రైతు ఆత్మహత్యలంటే.. అన్నం పెట్టే చేతుల ఆత్మహత్యలు ఇంకోరకంగా చెప్పాలంటే.. కష్టం చేసి యింటిని కాపాడే యింటి పెద్ద ఆత్మహత్య.. ఇప్పటికీ ఈ ఆత్మహత్యలు తగ్గటం లేదు. కానీ ఈ ఏడాది కొన్ని ఆశారేఖలు కనిపిస్తున్నాయి. రైతు తిరగబడుతున్నాడు. ధిక్కరిస్తున్నాడు. గిట్టుబాటు ధర కోసం పోరాడుతున్నాడు. సమిష్టి గొంతుతో పిడికిలి ఎత్తుతున్నాడు. సర్కారును సర్కారు బలగాలను, దళారీల మోసాలను మిల్లర్ల దోపిడీని సిండికేట్ ఎత్తుగడలను లెక్కచేయటం లేదు. "ఇది మా పంట... మేము పండించిన పంట.. మాకు సరియైన ధర రావాలి. గిట్టుబాటు ధర మా కడుపు నిండేలా ఉండాలి" ఇదీ కనిపిస్తున్న దృశ్యం. ఒక ఆశాకిరణం ఒక తూర్పురేఖ. ఒక వెలుగు కోణం.. రైతు వాస్తవ చిత్రం కొంత మారింది.

ఖమ్మంలోని రైతులు మిర్చి ధర తగ్గినందుకు ఆగ్రహంతో ఉన్నారు. గతేడాది కూడా ఖమ్మం రైతులు గిట్టుబాటు ధర కోసం తిరుగుబాటు చేసారు. గిట్టుబాటు ధర కడుపు నింపదని ప్రశ్నించారు. రైతుల సమిష్టి గొంతుకు సర్కారు దిగివచ్చినట్టు కనిపించిన మాట నిజం అయినా ఖమ్మం రైతులు మిర్చి గిట్టుబాటు ధరపై సంతృప్తిగా లేరు. విషయంలో అర్థం కానిదొకటి. రాష్ట్రంలో నెలక్రితం మిర్చి క్వింటాలుకు 11వేలు. ఇప్పుడు ఏడు వేలకు 8 వేలకు తగ్గించారు. రైతులకు కడుపుమండుతున్నది. భారీగా మిర్చి రావచ్చు. ధర తగ్గిస్తే ఎలా? పంట ఎక్కువ పండించటం రైతు తప్పా? ఎక్కువ దిగుబడి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి లాభం.. దేశ ఉత్పత్తికి వన్నెతెస్తుంది. ఎక్కువ కష్టపడి ఎక్కువ ఉత్పత్తి చేసిన రైతులను అభినందించే బదులు ధర తగ్గించి పొట్ట కొడితే ఎలా? వ్యాపారులు దళారీలు కుమ్మక్కై ధర తగ్గించారని వార్త. సర్కారు ఏం చేస్తున్నట్టు? ఖరీదు చేస్తా మన్నారు ఏదీ? దళారీలను అడ్డుకుంటా మన్నారు ఏదీ?

ఇటువంటి సంఘటనలు ఈ ఏడాది కాలంలో కొన్ని జరిగాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఎర్రజొన్నల గిట్టుబాటు ధర కోసం రైతులంతా ఒక్కటై ధర్నా చేశారు. నిరాహారదీక్ష చేసారు. ఒకటి రెండు మూడు రోజులు ఉద్యమించారు. ఎందరో అరెస్టు అయ్యారు.. రైతులు ఎంత ఆగ్రహంతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. పాలమూరు రైతులు పల్లి గిట్టుబాటు ధర రూ.4,400 కోసం డిమాండ్ చేసారు. రూ.రెండువేలకే ఖరీదు చేస్తామంటే ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు రూ.15వేల మద్దతు ధర కోసం జగిత్యాల రైతులు ర్యాలీ నిర్వహించారు.

ఒకరకంగా ఇటువంటి సంఘటనలు కొంత ఆశారేఖలుగా కనిపించినా, మనసులో బాధ కలిగే మాట నిజం. తెలంగాణలో ఇలా జరుగుతుందేమిటీ? సర్కారు మాటలకు చేతలకూ పొంతన కుదరటం లేదేమిటీ? ఎంతకాలం ఈ దళారీల దోపిడీ... అన్నం పెట్టే రైతు గిట్టుబాటు ధర కోసం నిరసన తెల్పటం, రోడ్డు ఎక్కటం, పిడికిలి ఎత్తటం తెలంగాణ ప్రభుత్వానికి శోభ కాదు. నీళ్ల, కరెంట్, ఎరువులు, విత్తనాలు ఏమిచ్చినా రైతుకు సంతృప్తి కాదు. రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటుధర రావాలి. ఇది ముఖ్యం.

సెల్: 9949486122



మగవాళ్ళకీ, పురుషులకీ మధ్యా, ఆడవాళ్ళకీ, స్త్రీలకీ మధ్యా అపారమైన తేడా ఉందని నాకు చాలాకాలం కిందటే అర్థమయింది. జననేంద్రియాల తేడా వల్ల తెలిసేది ఆడా, మగా అన్నది మటుకే. కాని, స్త్రీపురుషులు రూపొందాలంటే మటుకు, నిర్విరామ క షి, క్రమశిక్షణ, సాహసం, ప్రేమ తప్పనిసరి.

– మాయా ఏంజిలో

ద్విపాత్రాభియనం చేసిన తొలినటి



మద్దెల నగరాజకుమారి
(1921- 3మార్చి, 2008)

సినిమాలో ద్విపాత్రాభినయం అన్నది ప్రస్తుతం అందుబాటులో ఉన్న గ్రాఫిక్స్‌తో సులభమే. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేనిరోజుల్లోనే ద్విపాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించిన హీరో వి.వి. సుబ్బారావు, హీరోయిన్ మద్దెల నగరాజకుమారి. కుమారిగా పేరుగాంచిన ఆమె మాయపిల్ల (1951) చిత్రంలో ద్విపాత్రాభినయం చేశారు. దొంగల రాణి 'మాయపిల్ల'గా, రూపగా ఆమె ఈ సినిమాలో రెండు పాత్రల ద్వారా ప్రేక్షకుల మదిదోచుకున్నారు.

తెనాలిలో 1921లో జన్మించిన మద్దెల నగరాజకుమారికి చిన్నతనం నుండి నటన అంటే ఆసక్తి. అందం, చలాకీతనం కలబోసిన ఆమెకు చిన్నతనంలోనే నటించే అవకాశాలు వచ్చినా తల్లి అంగీకరించలేదు. సంగీతం నేర్చుకుని, కమ్మని స్వరంతో హాయిగా పాడుతుంటే విని ఎంతో ఆనందించేది ఆమె తల్లి.


కన్నాంబ నాటక సమాజంలో వయోలినిస్టుగా పనిచేసే అంజయ్య 'క్వాలిటి పిక్చర్స్ పతాకం'పై దశావతారాలు (1937) చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించాడు. నటీనటుల ఎంపిక కోసం విజయవాడ వచ్చిన ఆయన నగరాజకుమారికి దూరపుబంధువు కావడంతో ఆమె తల్లిని ఒప్పించాడు. ఈ సినిమాలో సీత, లక్ష్మీ, యశోధర పాత్రలకు ఆమెను ఎంపిక చేశారు. రెండవ చిత్రం నిరంజన్ పాల్ దర్శకత్వంలోని 'అమ్మ' చిత్రం. 1939లో విడుదలైన ఈ చిత్రంలో రాజకుమారి పాడిన 'వికసిత సుమములకున్', 'నిరీక్షించవా నాకై' పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 1939లోనే విడుదలైన 'ఉష'లో నటించారు. ఆమె నటజీవితాన్ని మలుపు తిప్పిన చిత్రం 'సుమంగళి'. 1940లో విడుదలైన ఈ చిత్రం తర్వాత ఆమె కుమారిగా గుర్తింపు పొందారు. వాహిని సంస్థ వారి 1941లో విడుదలైన 'దేవత' చిత్రంలో నాయికగా నటించారు. ఈ చిత్రం వరకు ఆమె నటించిన అన్ని చిత్రాల్లో పాటలు తనే పాడినా.. దేవత చిత్రం తర్వాత ఆమె పాత్రలకు నేపథ్యగాయకులు పాటలు పాడారు.

WOMEN of the day

కుమారికి మాయపిల్ల (1951) చిత్రంతో మంచి అవకాశం లభించింది. ఇందులో దొంగల రాణి 'మాయపిల్ల' (అసలు పేరు ఆశ) గా, రూపగా ఆమె ద్విపాత్రాభినయం చేశారు. ఈ చిత్రంలో కత్తి యుద్ధాలు, కొండచిలువతో యుద్ధం చేసి ప్రేక్షకుల అభినందనలు అందుకున్నారు. ఆమె నటించిన రెండు పాత్రల్లో వేసుకున్న డ్రస్సులు అప్పుడు పెద్ద ఫ్యాషన్‌గా మారాయి.

వాహినీ సంస్థ నిర్మించిన 'మల్లీశ్వరి' (1951)చిత్రంలో మహారాణిగా పాత్రలో కుమారి నటించారు. ఆ తర్వాత 'పెంపుడు కొడుకు' (1953 తెలుగు, తమిళం), 'కాళహస్తి మహాత్యం' (1954) చిత్రంలో ఆమె నటించారు. నటనకు స్వస్తిపలికి 1958లో మద్రాసు నుంచి విజయవాడకు వచ్చారు. 50ఏండ్ల పాటు అక్కడే నివసించిన ఆమె తన 87వ ఏట మార్చి 3, 2008న చనిపోయారు. ❄

రమ్య ఆలోచనలన్నీ పిల్లల గురించే. ఇప్పటికే పదిరోజులవుతుంది వాళ్ళు స్కూలుకెళ్ళి. అసలే పరీక్షలు దగ్గర పడుతున్నాయి. భర్త ఫోన్లు చేసి రమ్మంటూ వేధిస్తున్నాడు. ప్రతి సారి ఇదే వరస. తిట్టడం, కొట్టడం. కోపంతో తను పుట్టింటికి వెళితే ఏవో కబుర్లు చెప్పి తీసుకురావడం. పద్నాలుగేండ్ల నుంచి జరుగుతున్న పోరాటం ఆమెది.



బాధ్యత తక్కువ

కొట్లాటలెక్కువ

రమ్య ఓ గుడికి వెళితే అక్కడే సుధాకర్ పరిచయమయ్యాడు. అలా రోజు అదే గుడిలో కలుసుకునేవారు. ఒకరినొకరు చూసుకునేవారు. మాటలు కలిపారు. పరిచయం పెరిగి అది పెండ్లి వరకు వెళ్ళింది. అంతకు ముందే నాలుగేండ్ల పాటు సుధాకర్ ఆర్మీలో ఉండి వచ్చాడు. రమ్య తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. అప్పటి నుంచి అన్ననే అన్నీ చూసుకునేవాడు.

సుధాకర్ వాళ్ళకు ఓ షాప్ ఉంది. అతని నాన్న, చెల్లి, తమ్ముడు ఉన్నన్ని రోజు అది బాగా నడిచేది. తండ్రి పక్షవాతంతో మంచాన పడ్డాడు. తమ్ముడు విదేశాలకు పోయాడు. చెల్లి పెండ్లి చేసుకొని వెళ్లిపోయింది. కొన్ని రోజులు సుధాకర్, అతని తల్లి, రమ్య షాపు చూసుకునేవారు. అయితే రమ్యకు బాబు పుట్టాడు. దాంతో షాపు దగ్గరికి రాలేకపోయేది. సుధాకర్ తల్లికి భర్తకు సేవలకు చేయడానికే సరిపోయేది. సుధాకర్ ఒక్కడే షాప్ సరిగ్గా చూసుకోలేకపోయేవాడు. దాంతో షాప్ వేరే వాళ్లకు అద్దెకు ఇచ్చారు. ఆ అద్దె, ఇంటి అద్దెలతో కుటుంబం హాయిగానే గడిచేది.

సుధాకర్ కొంత కాలం రాజకీయాలంటూ తిరిగేవాడు. రమ్యకు ఈసారి పాప పుట్టింది. ఎంత కాలం ఇలా అద్దెల మీద బతకాలి. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలి. ఖర్చులు పెరుగుతున్నాయి. కాబట్టి భర్తను ఏదైనా ఉద్యోగం చూసుకోమంది. కానీ అతనికి ఉద్యోగం చేయడమంటే ఇష్టం లేదు. రమ్య ఎంతో బతిమలాడి, గొడవపడి చివరకు అతను ఉద్యోగం చేయడానికి ఒప్పించింది. అయితే గవర్నమెంట్ ఉద్యోగమైతేనే చేస్తానన్నాడు. రమ్య అన్నకు తెలిసిన వాళ్ళు ఉద్యోగం ఇప్పిస్తానన్నారు. అయితే కొంత ఖర్చు అవుతుందని చెప్పారు. వాళ్ళకు రెండు లక్షలు డబ్బులు కూడా ఇప్పించారు. సుధాకర్‌కు ఇష్టం లేకపోయినా రమ్య గోల భరించలేక వాళ్ళకు డబ్బులు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. అయితే ఆ డబ్బులు తీసుకున్న వాళ్ళు ఉద్యోగం ఇప్పిస్తానంటూ నాలుగేండ్లు తిప్పుకున్నారు. ఒకపక్క సుధాకర్ వేరే ఆ ఉగ్యోగం వస్తుందని వేరే ఉద్యోగాలకేమీ ప్రయత్నం చేయలేదు. ఒక పక్క పిల్లలు ఎదుగుతున్నారు.

రమ్య తనని బలవంతంగా ఉద్యోగానికి ఒప్పించిందని ఆమెపై కోపం పెంచుకున్నాడు. పైగా డబ్బు తీసుకున్న వ్యక్తి మోసం చేశాడు. దాంతో రమ్యపై చిరాకు పెంచుకున్నాడు. పెద్ద పెద్దగా అరిచేవాడు. చీటికీమాటికీ రమ్యను బూతులు తిట్టేవాడు. పిల్లల ముందే కేకలు పెట్టేవాడు. అతని అరిచిన ప్రతిసారి రమ్యకు, అతనికి పెద్ద గొడవే జరిగేది. అది కొట్టుకోవడం వరకు వెళ్ళేది. పెద్ద వాళ్ళు ఎన్నోసార్లు చెప్పి చూశారు. సుధాకర్‌కు ఆదాయం ఏమీ లేకపోవడంతో రమ్య కోపం తెచ్చుకునేది.

ఇక అతను ఎలాగో బయట ఉద్యోగాలేమీ చేయడని నిర్ణయించుకుని, వేరే వాళ్ళకు అద్దెకిచ్చిన షాప్‌ను మళ్ళీ మనమే చూసుకుందామంది. అయితే ఇన్నేండ్లు ఖాళీగా ఉన్న సుధాకర్‌కు మళ్ళీ షాప్ చూసుకోవడం నచ్చలేదు. ఈ విషయంలో ఇద్దరికీ గొడవలు జరిగి రమ్య పుట్టింటి వెళ్ళిపోయింది. షాప్ పెడతానంటేనే వస్తానంది. దాంతో సుధాకర్ తల్లి, తండ్రీ మాట్లాడి అతనితో మళ్ళీ షాప్ పెట్టించారు. ఇప్పుడు ఆ షాప్ పెట్టించిన దగ్గర నుంచి వాళ్ళిద్దరి మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. సుధాకర్ షాపు బాధ్యత పూర్తిగా రమ్యపై వదిలేసి బయట తిరుగుతాడు.

ఇద్దరు పిల్లల్ని రెడీ చేసి స్కూల్‌కి పంపించడం, ఇంటి పని, వంటపని, ఇటు షాపు చూసుకోసువడం రమ్యకు బాగా కష్టంగా మారింది. ఈ పని ఒత్తిడి వల్ల ఆమె ఆరోగ్యం కూడా కాస్త పాడైపోయింది. కానీ సుధాకర్ మాత్రం 'నువ్వే కదా బలవతంగా నాతో ఈ పనులన్నీ చేయిస్తున్నావు. నీకు ఇలాగే ఉండాలి' అంటూ ఆమెను రెచ్చగొట్టేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరికి పెద్ద గొడవ జరిగింది. అతని షాపుకు వచ్చిన వారి ముందే రమ్యను ఇష్టమొచ్చినట్టు తిట్టేవాడు. ఇదంతా ఇక భరించలేక పది రోజుల కిందట మళ్ళీ తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని అన్న దగ్గరకు వెళ్ళింది. అప్పటి నుంచి సుధాకర్ ఫోన్ చేసి పిల్లల్ని తీసుకొని రమ్మని వెంటబడుతున్నారు. ఓసారి తాగి అన్న ఇంటి దగ్గరకొచ్చి గొడవ కూడా పెట్టుకున్నాడు. రమ్య చెల్లి భర్తకు ఫోన్ చేసి వారి కుటుంబం గురించి చెడుగా చెబుతున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక రమ్య ఆందోళన పడుతుంది. తెలిసిన వారు ఎవరో చెబితే రమ్య అన్నను తీసుకొని ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది. ఆమె గురించి అన్ని వివరాలు తెలుసుకున్న

> ***రోజు మధ్యాహ్నం సమయంలో తాగి పడుకుంటావంట. మరి షాపు ఎవరు చూసుకుంటారు. పిల్లలు స్కూలు నుండి వచ్చిన వెంటనే రమ్య వాళ్ళతో కాసేపు గడపాలి. కానీ ఆమె షాపు వల్ల అది చేయలేకపోతుంది. కనీసం నువ్వన్నా పిల్లలతో గడుపుతావంటే అదీ లేదు. దీనివల్ల మీ పిల్లలు మీ ప్రేమకు దూరమవుతారు. వాళ్ళు ఎలా చదువుతున్నారో, ఏం చేస్తున్నారో చూసే సమయమే మీ ఇద్దరికీ ఉండడం లేదు' అన్నారు.***

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

లీగల్‌సెల్ వారు తన తల్లిని తీసుకురమ్మని సుధాకర్‌కు లెటర్ పంపారు. చెప్పిన ప్రకారమే సుధాకర్ వచ్చి...

'ఇప్పటి వరకు నేను రమ్య చెప్పినట్లే చేశాను. ఆమె చెప్పినట్లు నడుచుకోవడం వల్ల నేను అన్ని రకాలుగా నష్టపోయాను. అయినా ఆమెంటే నాకు చాలా ఇష్టం. రమ్మంటే రావడం లేదు. అయినా ఆమెకు మా ఇంట్లో తక్కువేం లేదు. మాకు నెలకు ఇంటి అద్దెలే 20 వేలు వస్తాయి' అంటూ చెప్పుకొచ్చాడు.

'ఆమె చెప్పిది చేయడం వల్ల నష్టపోయానంటున్నావు. మరి నీకు నువ్వుగా ఏం చేశావు. ఇంటి అద్దెలతో ఎంత కాలం బతుకుతారు. నీకంటూ ఓ సంపాదన ఉండాలి. పిల్లలు ఎదుగుతున్నారు. వాళ్ళకు మంచి చదువులు చెప్పించాలంటే ఎంత ఖర్చు అవుతుంది. రమ్య ఆలోచనల్లో తప్పేమీ లేదు. కానీ ఆమె నీతో ప్రతి సారి బలవంతంగా ఒప్పిస్తుంది. దాంతో నువ్వు వాటిని సరిగ్గా అమలు పరచడం లేదు. కేవలం నీకు ఇష్టం లేక ఏపనీ సరిగ్గా చేయడం లేదు. పైగా ఆమెపై కోపం పెంచుకొని అందరి ముందు నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావు.

ఇంట్లో పనులు చేస్తూ, ఇద్దరు పిల్లల్ని చూసుకుంటూ షాపులో ఉండడమంటే మామూలు విషయం కాదు. నువ్వు ఎప్పుడు పడితే అప్పుడు వెళ్ళిపోతావు. రోజు మధ్యాహ్నం సమయంలో తాగి పడుకుంటావంట. మరి షాపు ఎవరు చూసుకుంటారు. పిల్లలు స్కూలు నుండి వచ్చిన వెంటనే రమ్య వాళ్ళతో కాసేపు గడపాలి. కానీ ఆమె షాపు వల్ల అది చేయలేకపోతుంది. కనీసం నువ్వన్నా పిల్లలతో గడుపుతావంటే అదీ లేదు. దీనివల్ల మీ పిల్లలు మీ ప్రేమకు దూరమవుతారు. వాళ్ళు ఎలా చదువుతున్నారో, ఏం చేస్తున్నారో చూసే సమయమే మీ ఇద్దరికీ ఉండడం లేదు' అన్నారు.

'నేనూ అదే చెబుతున్నాను. వాళ్ళిద్దరూ ఒకరికి మించి మరొకరు. ఎవరూ తగ్గరు. ఇద్దరి గొంతులూ ఒకటే. ఒకటే అరుచుకుంటారు. ఎంత చెప్పినా వినరు. పిల్లల్ని పట్టించుకోరు. షాపు సరిగ్గా చూసుకోరు. షాపు రోజూ తియ్యకపోతే బేరాలు రావు. వీళ్ళకు ఎన్ని సార్లు చెప్పినా అర్థం కాదు' అంటూ సుధాకర్ తల్లి బాధపడింది.

'నాకు ఈ మధ్య అస్సలు ఆరోగ్యం బాగోలేదు. డాక్టర్లు ఎక్కువ సేపు నిలబడడం, బరువులు మోయడం, మెట్లు ఎక్కడం దిగడం లాంటివి చేయొద్దన్నారు. ఇకపై నేను షాపు చూసుకోలేను. పైగా ఇంటికి వచ్చే అద్దెల్లో ఒక ఇంటి అద్దె తనే తీసుకుంటాడు. పైగా షాపు నుంచి ఆదాయం ఎటుపోతుందో అర్థం కావడం లేదు' అంది రమ్య.

'అస్సలు షాప్‌కు రాకపోతే ఎలా కుదురుతుంది. షాప్‌కు కావాల్సిన సామాన్లు తీసుకురావాలంటే రెండు, మూడు గంటలు నేను బయటకు వెళ్ళాలి. అప్పుడు షాప్ మూసుకొని వెళ్ళాలా?' అన్నాడు సుధాకర్.

దాంతో లీగల్ సెల్ సభ్యులు 'నువ్వు ఎంత సేపు ఉండగలవు షాపులో' అని అడిగారు. పది గంటల నుంచి హధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటానంది.

'మీరిద్దరూ ఈ సమస్య నుంచి బయట పడాలంటే ఒకటే మార్గం. ఒక ప్లాన్ చేసుకోండి. పిల్లలు స్కూల్‌కి వెళ్లిన తర్వాత మిగిలిన పనులన్నీ పూర్తి చేసుకొని పదిగంటల కల్లా నువ్వు షాప్‌కు వచ్చేసెయ్. నువ్వు షాప్‌లో ఉన్నప్పుడు సుధాకర్ బయట పనులు చూసుకొని వచ్చేస్తాడు. మళ్ళీ అతను భోజనం చేసి షాప్‌కు వస్తాడు. నువ్వు పిల్లలు వచ్చే సమయానికి ఇంట్లో ఉండొచ్చు. వాళ్ళ అవసరాలు కూడా చూసుకోవచ్చు' అన్నారు.

సభ్యులు చెప్పిన దానికి అంగీకరించిన రమ్య 'అద్దె డబ్బుల నుంచి నేను ఆయనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వను. షాపు నుంచే వచ్చే ఆదాయం నుంచి నాకు ఒక్కరూపాయి కూడా వద్దు. ఆయన అప్పులు అన్నీ ఆ షాపు ఆదాయం నుండే తీర్చుకోమనండి. ఇకపై అద్దె డబ్బులన్నీ ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, సేవింగ్స్ కోసం ఉపయోగిస్తాను' అంది రమ్య.

దానికి సుధాకర్ కూడా అంగీకరించాడు. చివరకు ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చి బాధ్యతగా ఉంటామన్నారు. 'మీరు డబ్బు సంపాదన గురించి కాసేపు పక్కన పెట్టిండి. ముందు ఒకరిపై ఒకరు ప్రేమగా, నమ్మకంగా ఉండడం నేర్చుకోండి. అప్పుడే మీ పిల్లలు కూడా మంచి వాతావరణంలో పెరుగుతారు. ఒకరితో ఒకరు గొడవలుపడుతూ, తిట్టుకుంటూ ఉంటే మీ పిల్లలు కూడా అలాగే తయారవుతారు. మీరిద్దరూ ప్రేమగా, బాధ్యతగా ఉంటే సంసారం హాయిగా గడిచిపోతుంది. ఇద్దరూ ఒకరిని ఒకరు తిట్టుకోవడం, దూషించుకోవడం మానుకోండి. మంచిగా ఉండండి. ఇకపై ఏదైనా సమస్య వస్తే మీలో మీరు కొట్టుకోకుండా మా దగ్గరకు రండి' అన్నారు.

అంతా విన్న సుధాకర్ తల్లి 'మీ దగ్గరకు వచ్చినందుకు మంచి విషయాలు చెప్పారు. నేను ఎంత చెప్పినా వాళ్ళ బుర్రలకు ఎక్కదు. ఇకపైనన్న మంచిగా ఉంటే చాలు' అని కన్నీళ్ళు తుడుచుకుంది.

రమ్య సుధాకర్ ఇద్దరం ఇద్దరూ ఒకరినొకరు తిట్టుకోమని, కొట్టుకోమని లీగల్‌సెల్ సభ్యులు చెప్పిన ప్రకారమే ఉంటామని రిజిస్టర్‌లో రాసి, సంతకం చేసి వెళ్ళిపోయారు. గత రెండు వారాల నుంచి వారం వారం ఇద్దరూ వచ్చి లీగల్‌సెల్ సభ్యులను కలిసివెళుతున్నారు.

✍ సలీమ

కారణాలెంటో తెలుసా !



రోజుకి రెండు సార్లు బ్రష్ చేయకపోవడం, క్యావిటీస్ ట్రీట్ చేయకపోవడం, మంచి మౌత్ వాష్ ఉపయోగించకపోవడం నోటి దుర్వాసన (బ్యాడ్ బ్రీత్) కు కారణం అవుతాయి. కాబట్టి ఈ విషయాల్లో జాగ్రత్త వహించాలి. అలాగే మరికొన్ని కారణాలు కూడా నోటి దుర్వాసనకు కారణమవుతాయి అవేంటో తెలుసుకుందాం...

బ్రేక్ ఫాస్ట్ తినకపోవడం: బ్రేక్ ఫాస్ట్ తినకపోతే నోట్లోని సాలివా గ్లాండ్స్ యాక్టివ్‌గా ఉండవని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వల్ల నోరు డ్రైగా మారుతుంది. ఎప్పుడైతే నోరు పొడిగా మారుతుందో అప్పుడు చెడు వాసన వస్తుంది. క్రిములు నోట్లో ఉండిపోతాయి. కాబట్టి హెల్తీ బ్రేక్ ఫాస్ట్ ని ఉదయం తీసుకోవడం మంచిది.

పంటి శుభ్రత: చాలా సార్లు మనం బ్రష్ చేస్తాం. మౌత వాష్ ఉపయోగిస్తాం. కానీ పళ్లలో ఇరుక్కున్న పాచి తొలగించడం మాత్రం మరచిపోతూ ఉంటాం. అనేక ఆహార పదార్థాలు, పాచి పళ్ల మధ్య పేరుకుని, బ్యాక్టీరియా ఏర్పడటానికి కారణమవుతుంది. దీనివల్ల నోటి దుర్వాసన ఎక్కువ అవుతుంది. బ్రష్ చేయడం వల్ల పళ్ల మధ్య ఉండే సన్నటి రంధ్రంలో ఇరుక్కున్న బ్యాక్టీరియా తొలగించలేం. కాబట్టి రెగ్యులర్‌గా ఫ్లాసింగ్ చేయడం చాలా ముఖ్యం. ఇలా చేయడం వల్ల నోటి దుర్వాసనను నివారించవచ్చు.

ప్రోటీన్ ఫుడ్స్ తీసుకోవడం: ఎక్కువగా ప్రోటీన్ ఫుడ్ తీసుకోవాలి. ప్రోటీన్ సప్లిమెంట్స్ తీసుకోవడం వల్ల కండరాలకు మంచిది. అలాగే మోతాదుకి మించి ఆహారం కూడా నోటి దుర్వాసనకు కూడా కారణం అవుతుంది. కాబట్టి ప్రోటీన్ ఉండే ఆహారపదార్థాలను తగిన మోతాడులో తీసుకోవాలి. బ్యాడ్ బ్రీత్ సమస్యతో ఇబ్బంది పడేవారు ఈ విషయాల్లో జాగ్రత్త వహిస్తే సరిపోతుంది. ❄



డైనింగ్ టేబుల్ శుభ్రతకు...

- డైనింగ్ టేబుల్ డిజైన్‌కి తగ్గ క్లాత్‌ని సెలెక్ట్ చేసి దానిమీద వేస్తే డైనింగ్‌టేబుల్ అందంగా కనిపిస్తుంది. కాబట్టి మంచి డిజైన్ ఉన్న క్లాత్‌ని ఎంపిక చేసుకోవాలి.
- వంటింట్లో వండిన పదార్థాలు టేబుల్‌పైన పెట్టే ముందు చిన్న స్టీల్‌స్టాండ్‌ను టేబుల్‌పైన ఉంచి వాటిపైన ఆ పదార్థాల పాత్రల్ని పెట్టాలి. ఇలా చేయడం వల్ల టేబుల్‌పైన ఎలాంటి గీతలు పండేందుకు అవకాశం ఉండదు.
- ఉదయం టిఫిన్ ఐటెమ్స్ చట్నీ, హాట్‌బాక్స్‌లో ఇడ్లీలు, వేరేవి ఏవైనా ఉంటే వాటిని నీట్‌గా టేబుల్‌పైన సర్దుకోవాలి.
- భోజనం చేసే సమయంలోనే ప్లేట్లు, నీళ్ల గ్లాసులు ఉంచాలి. తిన్నవెంటనే ఆ సామాన్లు తోముకుంటే మంచిది. ఎట్టి పరిస్థితులలోనూ తినేసిన ప్లేట్లను టేబుల్‌పైన ఉంచకూడదు.
- డైనింగ్ టేబుల్‌పై అన్ని వస్తువులు తీసేసి సబ్బునీళ్లలో తడిపిన బట్టతో లేదా స్పాంజ్‌తో తుడిచి ఆరబెట్టాలి. ఆ తర్వాత పొడిబట్టతో తుడవాలి.
- చిన్నగ్లాస్‌లో నీరు పోసుకొని దాంట్లో చిన్న చిన్న మొక్కల్ని, పువ్వుల్ని పెట్టి డైనింగ్ టేబుల్ మీద అలంకరించుకోవచ్చు. ఈ చిట్కాలు పాటించడం వల్ల డైనింగ్ టేబుల్ ఎంతో అందంగా కనిపిస్తుంది. ❄

చిన్నతనం నుంచే!



చిన్నతనం నుంచే పిల్లలకు క్రమ శిక్షణ తప్పనిసరి అని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు. చిన్నతనం నుంచే క్రమ శిక్షణ అలవాడితే చెడు పనులకు దూరంగా ఉంటారు. ఎదిగే వయసులో చిన్నారులకు మంచి లక్షణాలు అలవడుతాయి.

- పిల్లలు క్రమ శిక్షణగా పెరగాలంటే తల్లిదండ్రులు తప్పని సరిగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. పిల్లల ముందు తల్లిదండ్రులు క్రమ శిక్షణగా ఉండాలి. ఇంట్లో కొన్నిసార్లు భార్య, భర్తల మధ్య గొడవలు వస్తుంటాయి. ఇది మంచి పద్ధతి కాదు. పిల్లల ముందు అరుచుకోవడం, గొడవపడటం, కొట్టుకోవడం, తిట్టుకోవడం వంటివి చేయకూడదు. ఎందుకంటే పిల్లలు తల్లిదండ్రులు ఏలా ఉంటే వారు కూడా అలాగే ఉండాలని కోరుకుంటారు.
- కాబట్టి ఇంట్లో వాతావరణం ప్రశాంతంగా, క్రమ శిక్షణగా ఉంటే, ప్రేమగా ఉంటే పిల్లలు కూడా అలాగే ఎదుగుతారు.
- ఎప్పుడైనా సరే పిల్లల్ని బలవంతం పెట్టకూడదు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను 'ఆ పని చేయు', 'ఈ పని చేయు' అని బలవంతం చేస్తుంటారు. ఇక చెప్పిన పనులు వినకపోవడంతో కోపంతో కొట్టడానికి సిద్ధపడుతారు. పిల్లల విషయంలో అలా ప్రవర్తిస్తే మొండిగా తయారవుతారు. పిల్లలకు ఏదైన పని చెబితే దాని గురించి వివరంగా, ప్రేమగా చెబితే వింటారు.
- తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపటానికి ప్రయత్నించాలి. ఎన్ని పనులు ఉన్నాకూడా పిల్లల అలనా, పాలనా మరిచిపోకూడదు. ఏ మాత్రం ఖాళి దొరికినా చిన్నారులతో ఆడుకోవడం, మాట్లాడటం వంటివి చేయాలి.
- ప్రతిరోజు వాళ్ల పనుల్ని వాళ్ల చేత చేయించే ప్రయత్నం చేయాలి. ఉదయాన్నే వాళ్ల పనులు అంటే బ్రష్ చేయడం, స్నానం చేయడం, టిఫిన్ తినడం వంటివి చిన్నారులే చేసుకునేలా తయారు చేయాలి.
- చిన్నతనం నుంచే పిల్లలకు మంచి పుస్తకాలను చదివించే అలవాటే చేయాలి. మంచి నీతి కథలు, పొదుపు కథలు, గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివించే ప్రయత్నం చేయాలి. ❄



బంద్ ప్రభావం.. స్తంభించిన సినిమా

- తక్షణమే చార్జీలు తగ్గించాలని ఐక్యకార్యాచరణ సమితి డిమాండ్

హైదరాబాద్: డిజిటల్ ప్రొవైడర్స్ వసూలు చేస్తున్న చార్జీలకు నిరసనగా ఐదు రాష్ట్రాల చిత్ర పరిశ్రమ ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు తెలుగు రాష్ట్రాల్లోని సినిమా హాళ్లు స్తంభించాయి.ఆటలు ప్రదర్శించటంలేదన్న బోర్డులతో బంద్ ప్రభావం కనిపించింది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక, కేరళలోనూ అదే పరిస్థితి కనిపించింది. దీంతో ఎప్పుడూ ప్రేక్షకులతో హడావిడిగాకనిపించే థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు శుక్రవారం బోసిపోయాయి. వినోదపు పన్ను రూపంలో సినిమా ఇప్పటికే దూరం అవుతోందని పంపిణీదారుల సంఘం కార్యదర్శి సాయిప్రసాద్ తెలిపారు. డిజిటల్ ప్రొవైడర్లు, వర్చువల్ ప్రింట్ ఫీజ్, కట్ ఆఫ్ టైమ్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై డిజిటల్ ప్రొవైడర్స్‌తో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోవడం వల్లే బంద్ పాటిస్తున్నామని చెప్పారు. తక్షణమే చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

థియేటర్ల బంద్‌కు సీపీఐ (ఎం) మద్దతు

వర్చువల్ ప్రింట్ ఫీజును తగ్గించాలని డిమాండ్ చేస్తూ దక్షిణాది రాష్ట్రాల సినీ నిర్మాతల మండలి నిర్వహిస్తున్న థియేటర్ల బంద్‌కు సీపీఐ (ఎం) మద్దతు తెలిపింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లను యుఎఫ్ఓ, క్యూబ్ కంపెనీలు అందిస్తున్నాయని పేర్కొంది. అయితే వర్చువల్ ప్రింట్ ఫీజును ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరుగా వసూలు చేస్తున్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీజు దక్షిణాదిలో ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. దీంతో చిన్న నిర్మాతలు ఎక్కువగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్యనున్న సామరస్య పూర్వక వాతావరణం దెబ్బతింటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకుని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాతలతో చర్చలు జరపాలని కోరారు. తద్వారా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కంది రైతులకు న్యాయం చేయండి

- సీఎస్‌కు బీజేపీ నేతల వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కంది పంట వేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని బీజేపీ నేతలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషికి వినతిపత్రం సమర్పించారు. కంది కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, అకాల వర్షాలు వస్తే, రైతులు నిండా మునుగుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కంది కొనుగోళ్ల తేదీని ఈనెలాఖరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్లో కందుల ధర క్వింటాలుకు రూ.3వేల నుంచి రూ.3,500లకే రైతులు అమ్ముకోవాల్సి వస్తున్నదని, దీనివల్ల వారికి పెట్టుబడి సొమ్ము కూడా రావట్లేదని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో దళారులు తిష్టవేసి, రైతులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. సీఎస్‌ను కలిసిన వారిలో బీజేపీ నేతలు బద్దం బాల్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, జి ప్రేమేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్ కంటే మించిన నేత లేరు

- ఆస్తులు, ఆకారాలున్నంత మాత్రాన పెద్ద నాయకులు కారు : జానారెడ్డిపై మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపాటు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సంస్కారం గురించి జానారెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కొత్త, పాత, కొత్తగా చేరిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు తమకు తామే పెద్ద నాయకులమని సర్టిఫికెట్లు ఇచ్చుకుని నోటికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మొండాలను మోరీల్లో పడేస్తామని ఒకాయన, బట్టలూడదీసి కొడతానని ఇంకోయన మాట్లాడుతుంటే అప్పుడేమైంది జానారెడ్డి సంస్కారం అని ప్రశ్నించారు. విజిటింగ్ కార్డులు కొట్టించుకుని జేబులో పెట్టుకున్నంత మాత్రాన జాతీయ నాయకులు కారని, ఆస్తులు ఆకారాలు పెంచుకున్నంత మాత్రాన పెద్ద నేతలా అని ప్రశ్నించారు. ప్రజల మన్ననలు పొందేవారినే పెద్ద నాయకులంటారని అన్నారు. శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, పూల రవీందర్‌లతో కలిసి మంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడినదానిలో ఎక్కడ కుసంస్కారం ఉందో చెప్పాలన్నారు. మంత్రి కేటీఆర్ పార్లమెంటరీ పద్ధతిలోనే మాట్లాడారని ...అసలు బస్సుయాత్రలో ఉన్న ఒక్కరికైనా కేటీఆర్‌కున్న స్థాయి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. అసలు కేటీఆర్ కంటే పెద్ద నాయకుడు ఎవరు ఉన్నారని, ఆయన మంత్రిగా ప్రపంచమంతా తిరుగుతూ తెలంగాణ రాష్ట్ర విశిష్టతను చాటుతున్నారని ఆకాశానికెత్తేశారు. కాంగ్రెస్‌పార్టీలో మీకు ఏపాటి గౌరవం ఉందో అందరికీ తెలుసునన్నారు. బస్సుయాత్రలో ఉపయోగిస్తున్న భాషపై మీరెందుకు నోరు మెదపడం లేదన్నారు. 2014 ఎన్నికల్లో గెలిచిన వారంతా ఈ సారి ఇంటికి పోవడం ఖాయమన్నారు. ప్రధాని మోడీపై కేసీఆర్ వ్యక్తిగతంగా ఎలాంటి పరుష వ్యాఖ్యలు చేయలేదని, బీజేపీ నేతలు తెలివి తక్కువతనంతో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

జూనియర్ సైన్స్, నేషనల్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్స్‌లో శ్రీచైతన్య జయకేతనం

శ్రీచైతన్య స్కూల్
టెక్నో కరిక్యులమ్
ఐఐటీ, మెడికల్, ఒలింపియాడ్ & ఇతర పోటీ పరీక్షలకు సాటిలేని ఎంపిక

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం-హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, ముంబయి సంయుక్తంగా నిర్వహించిన ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్, ఆస్ట్రానమీ ఓలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. తెలుగు రాష్ట్రాల్లో తమ సంస్థల నుంచి అత్యధికంగా ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం గర్వంగా ఉన్నదని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బి.యస్.రావు ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ సైన్స్ విభాగంలో నలుగురు, ఆస్ట్రానమీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరంతా ముంబయిలో జరిగే ఓరియంటేషన్ సెలక్షన్ క్యాంప్‌కు హాజరవుతారని ఆయన తెలిపారు. తమ బోధన, విద్యా ప్రణాళిక, అధ్యాపకుల అంకితాభావమే విద్యార్థుల విజయసాధనకు కారణమని అకాడెమిక్ డైరెక్టర్ సీమా తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి, ముంబయి క్యాంప్‌కు ఎంపికైన విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీకి హోదా ఇవ్వాల్సిందే

బీజేపీ మద్దతు లేకుండా రాష్ట్ర విభజన జరిగిందా?

- చట్టంలో పెట్టమని ఎందుకు అడగలేదు
- సోషల్ మీడియా ద్వారా హోదా ఉద్యమాన్ని చేపట్టాలి : మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్

అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనకు ప్రత్యేక హోదా ప్రాతి పదిక అని అన్నారు. విభజన హామీలను, ప్రత్యేక హోదాను విడదీయలేమన్నారు. 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు- రాష్ట్ర విభజన హామీల అమలు' అనే అంశంపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సెమినార్ జరిగింది. విజయవాడలోని పీబీ సిద్ధార్ధ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఆయన పాల్గొన్నారు. యూపీఏ ప్రభుత్వం విభజించిన తీరువల్లే ఏపీ అస్తవ్యస్తంగా ఉందని ప్రధాని మోడీ మాట్లాడటం సరికాద న్నారు.బీజేపీ మద్దతు లేకుండా రాష్ట్ర విభజన జరిగేదా అని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకొచ్చి నాలుగేండ్లయిందని, విభజన చట్టాన్ని మార్పుచేసి ఎందుకు అమలు చేయ లేదని నిలదీశారు. రాష్ట్ర విభజనకు సీపీఐ(ఎం) మినహా అన్ని రాజకీయ పార్టీలూ కారణమేనన్నారు. హోదా అమలుకు బీజేపీ కుంటి సాకులు చెబుతోందన్నారు. ఆర్థిక వనరులు లేని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వొచ్చన్నారు. విభజన చట్టంలో లేదని, 14వ ఆర్థిక సంఘం ఇవ్వొద్దందని సాకులు వెతుకుతోందన్నారు. హోదాను చట్టంలో పొందుపరిస్తేనే విభజనకు మద్దతిస్తామని బీజేపీ విభజన సమయంలో ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. రాజధాని శంకుస్థాప నకు వచ్చిన ప్రధాని మట్టి-నీళ్లు పవిత్రమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో పెట్టారని, పార్లమెంట్‌లో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ పవిత్రమైనది కాదా అని ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘంలో ఏపీకి హోదా ఇవ్వొద్దని ఎక్కడా లేదన్నారు. ఆర్థిక సంఘం నివేదికపై కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే కృష్ణా-గోదావరి బేసిన్‌లో 50శాతం వాటా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. విభజన చట్టంలో పొందుపరిచిన ఒక్క అంశాన్ని కూడా బీజేపీ నేరవేర్చలేదని విమర్శించారు. విభజన వల్ల ఏపీ ఆర్థిక వ్యవస్థ 2024 వరకు అస్తవ్యస్తంగానే ఉంటుందన్నారు. అడిగిన అంశాల్ని కాకుండా అడగని అంశాల్ని బీజేపీ ప్రస్తావిస్తోందని, కొత్తగా రాష్ట్రానికి మాత్రం ఏమి చేయలేదని తెలిపారు. ఏపీకి లోటు బడ్జెట్ రూ.16,700కోట్లు ఉంటే కేవలం రూ.3379కోట్లు మాత్రమే విదిలించి ఇక రూ.200 కోట్లు మాత్రమే వస్తాయని చెబుతోందన్నారు. ఒడిషాలో బీజేపీకి నష్టం కాబట్టే విశాఖకు రైల్వే జోన్ ఇవ్వడం లేదని వివరించారు. దుగ్గిరాజపట్నం పోర్టుకు పులికాట్ సరస్సు ఉందనే సాకు చూపుతోందన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాడానికి ఉన్న అడ్డంకి ఏమిటో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో పొందుపరిచిన జాతీయ విద్యాసంస్థల్లో ఒక్క దానికీ పూర్తిగా నిధులు ఇవ్వలేదని వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఒత్తిడి వల్లే ప్రభుత్వాల వైఖరి మారుతుందన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది ఎస్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి యూటీఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రీజనల్ కార్యదర్శి అశోక్ బాబు, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ అధ్యక్షులు యువి కృష్ణయ్య, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ అజయ్‌కుమార్, ప్రజారోగ్య వేదిక నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పసుపు బోర్డు' కాదు.. విభాగంతో సరిపెట్టుకోండి

కేటీఆర్‌కు వాణిజ్యశాఖ మంత్రి సురేష్ ప్రభు లేఖ?

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాష్ట్ర పసుపు రైతుల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. పసుపు పంట కోసం ప్రత్యేకంగా 'పసుపు బోర్డు' ఏర్పాటు చేసేందుకు విముఖత వ్యక్తం చేసింది. ప్రత్యేక బోర్డు స్థానంలో 'మసాలా దినుసుల బోర్డు'లో రాష్ట్రం కోసం ఓ సెల్(విభాగం) నెలకొల్పుతామని ప్రతిపాదించింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేష్‌ప్రభు లేఖ రాశారని తెలిసింది. తెలంగాణలో అత్యధికంగా పసుపు పంట సాగవుతున్న నేపథ్యంలో రాష్ట్ర రైతులకు ప్రయోజనం కలిగించేలా ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఈ విషయంలో నిజామాబాద్ ఎంపీ కవిత ప్రత్యేక చొరవ తీసుకుని పలువురు ముఖ్యమంత్రుల మద్దతు కూడగట్టి కేంద్రానికి విజ్ఞాపనలు సైతం అందజేశారు. ఇటీవల మంత్రి కేటీఆర్ సైతం వాణిజ్యశాఖ మంత్రి సురేష్‌ప్రభుకు లేఖ రావారు.

కానీ కేంద్రం మరోసారి రాష్ట్రానికి మొండిచేయి చూపింది. పసుపు పంట కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయడం కష్టమని తేల్చిచెప్పింది. పైగా మసాలాదినుసుల బోర్డులో తెలంగాణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న సెల్ ద్వారా పంట మార్కెటింగ్, పంట అధిక ఉత్పత్తి కోసం చేయాల్సిన పరిశోధనలు తదితర అంశాల బాధ్యత కేంద్రంతో పాటు తెలంగాణ సంయుక్తంగా చేపట్టాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే 'ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీం'(టీఐఈఎస్) కింద పసుపు కోసం ప్రత్యేకంగా మసాలా దినుసుల పార్క్ నెలకొల్పుతామని లేఖలో పేర్కొన్నారని తెలిసింది.

ప్రధానిపై సీఎం వ్యాఖ్యలు గర్హనీయం

వాస్తవాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- రాష్ట్ర బీజేపీ నేతలకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దిశానిర్దేశం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా గర్హిస్తున్నట్టు కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యలు ముఖ్యమంత్రి పదవిలో ఉండే వారి స్థాయికి తగినవి కాదని అన్నారు. రైతుల్ని కేంద్రంపైకి ఉసిగొల్పేలా సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తమను, రాష్ట్ర నాయకత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయని చెప్పారు. కేసీఆర్ తన భాషను మార్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై మాజీ బీజేపీ సీనియర్ నేత, వి రామారావు ఇంట్లో రాష్ట్ర బిజెపి నేతలు ఆమెతో భేటీ అయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్, శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి, చింతలరాంచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. రైతుల కోసం కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న సహాయ సహకారాల్ని ప్రజలకు చేరేలా ప్రచారాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అంకెలతో సహా కేంద్ర సహకారాన్ని వివరిస్తే... ప్రజలు తప్పనిసరిగా వాస్తవాలు తెలుసుకుంటారని చెప్పారు. రాష్ట్రంలో బిజెపిని బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కేంద్ర మంత్రిత్వ శాఖల వారీగా రాష్ట్రానికి అందిన ఆర్థిక గణాంకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దీనికోసం రాష్ట్ర బీజేపీ నేతలు ఢిల్లీ వస్తే...శాఖల వారీగా ఆయా మంత్రులతో భేటీలు ఏర్పాటు చేయించి, మరింత సమాచారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధుల్ని రాష్ట్రం ఏ విధంగా ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తుందో ఆధారాలతో ప్రజల ముందు ఉంచాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతి కేంద్రమంత్రి తమ శాఖలకు సంబంధించిన లెక్కల్ని ఇచ్చి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల తర్వాత మళ్లీ రాష్ట్రానికి వస్తానని చెప్పారు.

సర్కారు డబ్బు మింగాడు..

- ఐదేండ్ల జైలు..రూ.10 లక్షల జరిమానా. ఏసీబీ కోర్టు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

కుట్ర పూరితంగా జాతీయ పొదుపు పథకం సొమ్ము రూ.91 లక్షలు బొక్కిన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉద్యోగి పుల్లారెడ్డికి ఐదేండ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 లక్షల జరిమానాను విధిస్తు ఏసీబీ కేసుల ప్రత్యేక జడ్జి తీర్పు ఇచ్చారు. సీఐడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సచివాలయంలో ఉన్నత విద్యా శాఖలో డిప్యూటీ స్టాటస్టికల్ అసిస్టెంట్‌గా పని చేసిన పుల్లారెడ్డి జాతీయ పొదుపు పథకం కు చెందిన రూ. 14 కోట్ల 77 లక్షల రూపాయలను ఫోర్జరీ సంతకంతో అంబర్‌పేట్ ఎస్‌బీఐ అక్కౌంటులోకి మార్చాడు. ఇందుకు ఎన్ఎస్ఎస్ లైసాన్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. తర్వాత ఇందులో నుంచి రూ. 91 లక్షల రూపాయలను విత్‌డ్రా చేసుకుని వాడుకున్నాడు. ఇందుకు ఆ సమయంలో ఎన్ఎస్ఎస్ లైజాన్ అధికారి శంకరయ్య, ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కలీముల్లాలు సమీకరించినట్టు సీఐడీ అధికారులు 2004 లో కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఈ కేసును విచారించిన ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు పుల్లారెడ్డిని దోషిగా తేల్చి మిగతా ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసింది. నేరస్తుడు పుల్లారెడ్డికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10 లక్షల జరిమానాను విధించింది.

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితులపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును జీర్ణించుకోలేని మంత్రి లక్ష్మారెడ్డి అనుయాయులు హోలీ వేడుకల్లో దళిత యువకులపై దాడిచేసి గాయపర్చారని, కరీంనగర్ జిల్లా రామ్మడుగు మండలం రాంచంద్రాపురం గ్రామంలో దళిత పాస్టర్ కొలిపాక మోషయ్య అతని కుటుంబ సభ్యులను ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ దుండగులు దాడి చేసి గాయపర్చారని ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సత్యపాల్‌సింగ్‌ను కేంద్రమంత్రిగా తొలగించాలి

- 4,5 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో నిరసనలు: టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సైన్స్‌ను కించపరుస్తూ అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కేంద్ర మానవ వనరుల అభివద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్‌ను వెంటనే మంత్రివర్గం నుండి తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో ఈనెల 4,5 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయంగా నిరూపితమైన డార్విన్ పరిణామ సిద్ధాంతం పనికిరాని చెత్త అని, సిలబస్ నుండి తొలగించాలని, ఇటీవల కేబ్ కమిటీ సమావేశంలో న్యూటన్ గమన సూత్రాలు మంత్రాల్లోనే ఉన్నాయని కేంద్రమంత్రిగా ఉన్న వ్యక్తి వ్యాఖ్యనించడం శోచనీయమని చెప్పారు.

ఇంతటి అజ్ఞాని కేంద్ర మంత్రిగా ఉండటం తగదనీ, ఉన్నత పదవిలో ఉండి వ్యక్తిగత విశ్వాసాల అభిప్రాయాలను వెల్లడించటం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే అవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

మనుషుల్ని వేటాడుతున్న మొసలి

- 6మీటర్ల భారీ మొసలిని పట్టుకున్న ఇండోనేషియా పోలీసులు
- పొట్టలో మనిషి చేయి, కాలు..



బాలిక్‌పాపన్ (ఇండోనేషియా) : కనిపించకుండా పోయిన ఓ వ్యక్తి మొసలికి ఆహారంగా మారాడు. ఆఖరికి అతడి చేతులు, కాళ్లు మాత్రమే ఆ మొసలి పొట్టలో కనిపించాయి. ఈ విషయాన్ని ఇండోనేషియా పోలీసులు శుక్రవారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ పామాయిల్ తోటలో పనిచేసే వ్యక్తి దానికి సమీపంలోని నది ఒడ్డుకు వెళ్లాడు. ఆహారం కోసం పొదలమాటున భారీ మొసలి దాగిఉండటాన్ని అతడు గమనించలేదు. అతడు నీటిలో దిగిన వెంటనే దాడి చేసి నమిలిమింగేసింది. అతడు నీటి వద్దకు వచ్చినట్టు ద్విచక్ర వాహనం, చెప్పులు మాత్రమే ఆనవాళ్లు ఉన్నాయి. ఏదో జంతువు అతన్ని చంపేసి ఉంటుందని పోలీసులు అనుమానించారు.

దాంతో ఆ నదిలో తీవ్రంగా గాలింపులు జరిపారు. అయితే, అందులో కొంత ఛిద్రమైన దేహం కనిపించింది. అదే సమయంలో ఒడ్డుకు సమీపంలోనే వారికి ఓ మొసలి కనిపించింది. దాంతో పోలీసులు దాన్ని కాల్చి చంపారు. అనంతరం దాని పొట్ట చీల్చి చూడగా అందులో ఆ వ్యక్తి కాలు, చేయి బయటపడ్డాయి. ఆ మొసలి దాదాపు ఆరు మీటర్లు (20 అడుగులు) పొడవుంది. బహుశా అతడు స్నానానికి దిగిన సమయంలో మొసలి దాడి చేసి ఉంటుందని పోలీసులు చెప్పారు. గతంలో కూడా ఆ మొసలి బారిన పడి ఓ రష్యన్ వ్యక్తి చనిపోయినట్టు వారు వెల్లడించారు.

మిచిగాన్ వర్సిటీలో కాల్పులు: ఇద్దరు మృతి !

న్యూయార్క్ : అమెరికాలో తుపాకీ కాల్పుల ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మిచిగాన్ వర్సిటీ వసతిగృహంలో తుపాకీ కాల్పులు చోటుచేసుకున్నాయి. శుక్రవారంనాటి ఈ ఘటనలో ఇద్దరు చనిపోయారని స్థానిక మీడియాలో వార్తలు ప్రసారమయ్యాయి. 19 ఏండ్ల గుర్తుతెలియని యువకుడు ఈ కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నారు. క్యాంపస్‌లోని క్యాంప్‌బెల్ హాల్‌లో ఈ కాల్పులు చోటుచేసుకున్నట్టు ట్విట్టర్ సందేశాల ద్వారా తెలుస్తున్నది. మృతుల సంఖ్య పెరగొచ్చునన్న అనుమానం వ్యక్తమైంది. వర్సిటీలో ఎవరైనా అనుమానితుడు కనపడితే, వెంటనే సురక్షిత ప్రాంతంలో తలదాచుకొవాలని, 911 నెంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా అక్కడివారికి పోలీసులు సూచించారు.

అంబులెన్స్ నిరాకరించడంతో శవాన్ని భుజాలపైనే..

ఫోటోలు వైరల్ కావడంతో వెలుగులోకి

లక్నో: అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకనో, తిరస్కరించో రోజుకొక విషాదం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఓ ఆస్పత్రి సిబ్బంది అంబులెన్స్‌ను తిరస్కరించడంతో శవాన్ని భుజాన వేసుకుని తీసుకెళ్తున్న ఓ వ్యక్తి ఫోటోలు వైరల్ అయ్యాయి. సంభాల్ జిల్లాకు చెందిన గోపీచంద్ బంధువు సూరజ్‌పాల్ బెజోయ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోగా అతని మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఆస్పత్రి అధికారులు వాహనం సమకూర్చలేదు. దీంతో సూరజ్‌పాల్ మృతదేహాన్ని గోపీచంద్ భుజాలపై మోసుకెళ్లాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు స్ట్రెచర్ కూడా ఏర్పాటు చేయలేదని గోపీచంద్ తెలిపాడు. భుజాలపై బయటికి తీసుకొచ్చిన తర్వాత అంబులెన్స్‌కోసం వైద్య సిబ్బంది నిరాకరించారని వివరించాడు. ఘటన వెలుగులోకి రావడంతో బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా మెజిస్ట్రేట్ ఆనంద్ కుమార్ సింగ్ ఆదేశించారు.

కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి ఐలమ్మ పేరు పెట్టాలి

- ఎంబీసీ సంఘం డిమాండ్


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి ఐలమ్మ పేరు పెట్టాలని ఎంబీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఎంతో మంది మహిళా మేధావులను తయారు చేసిన ఇలాంటి కళాశాలను మహిళా యూనివర్సిటీగా మార్చడం అభినందనీయమని పేర్కొంది. అటువంటి యూనివర్సిటీకి తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత ఐలమ్మ పేరు పెట్టాలని బీసీ, ఎంబీసీ సంఘాలు కోరుతున్నాయని తెలిపింది. ఇదే అంశంపై శుక్రవారం ఈమేరకు ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. భూస్వాములు, జాగీర్ధార్లకు, జమీందారులకు, రజాకార్లకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటం ప్రపంచ ప్రఖ్యాతిగాంచి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిందన్నారు. ఆ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా మహిళలపైన ఆనాడు హింస సాగిందన్నారు.

నిరుపేద చాకలి కులంలో పుట్టి ఆనాటి సామాజిక పరిస్థితిని అర్థం చేసుకొని తన కుటుంబాన్నంతా ఉద్యమంలో దించి తన సొంత ఇల్లును కార్యాలయంగా మార్చి ఆదర్శ జీవితాన్ని గడిపిన ఐలమ్మ అందరికీ ఆదర్శమైందన్నారు. ఆమె స్ఫూర్తిని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, వివిధ పోరాటాల్లో విద్యార్థులు, యువజనులు ఐలమ్మను గుర్తు చేసుకొని ఉత్తేజం పొందారని గుర్తు చేశారు. అలాంటి చరిత్ర కలిగిన వీరనారి ఐలమ్మ పేరు కోఠి మహిళా యూనివర్సిటీకి పెట్టడం వల్ల తెలుగు రాష్ట్రాలకే కాక తెలంగాణ ప్రభుత్వానికి గౌరవం దక్కుతుందన్నారు. అందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీట్ పీజీ సీట్ల అడ్మిషన్లు సజావుగా నిర్వహించాలి

- మంత్రి లక్ష్మారెడ్డి సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ పూల్‌లో మన రాష్ట్రం చేరినందున మరింత జాగ్రత్తగా పీజీ అడ్మిషన్లు నిర్వహించాలని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. త్వరలో నిర్వహించనున్న నీట్ పీజీ అడ్మిషన్లపై మంత్రి వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు ఈ సారి నీట్ పద్ధతుల్లో జరగనున్నాయన్నారు. మొదటి సారిగా నేషనల్ పూల్‌లో చేరినందున 50 శాతం సీట్లను నేషనల్ పూల్‌కి వదలాల్సి ఉందన్నారు. అలాగే రాష్ట్ర విద్యార్థులు దేశ వ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోనూ అడ్మిషన్లు పొందడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఆ రకంగా 8 వేల మందికి అవకాశాలు లభించవచ్చన్నారు. తాజా పరిస్థితులను బట్టి అడ్మిషన్ల ప్రక్రియను రూపొందించుకోవాలని, సజావుగా జరిగే విధంగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనా సంస్థ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతి కుమారి, అడిషనల్ సెక్రెటరీ సోనీ బాలదేవి, జాయింట్ సెక్రెటరీ రాజారెడ్డి, డిప్యూటీ సెక్రెటరీ సునీతాదేవి, హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి, డీహెచ్ డాక్టర్ లలిత కుమారి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



'ట్రేడ్ వార్' సరైందే..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

- ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకం విధిస్తున్నట్టు ప్రకటించటమేగాక, 'ట్రేడ్ వార్' సరైనదేనని ట్విట్టర్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు. ఈ యుద్ధాల్లో తేలికగా గెలవచ్చు..అని అందులో వ్యాఖ్యానించారు. అంతేగాక మరోసారి ట్రంప్ చైనాపై విరుచుకుపడ్డారు. ప్రపంచ మార్కెట్లన్నీ ట్రంప్ ఇస్తున్న ట్రేడ్ వార్ సంకేతాలతో తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. ట్రంప్ సర్కార్ నిర్ణయం... చైనా, యూరోప్, పొరుగు దేశం కెనడా లాంటి ప్రధాన వాణిజ్య భాగస్వాములపై తీవ్ర ప్రభావం చూపనున్నది. స్టీల్‌పై 25శాతం, అల్యూమినియంపై 10శాతం దిగుమతి సుంకం విధించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై వచ్చే వారం సంతకం చేయనున్నారు. గురువారం స్టీల్, అల్యూమినియం కంపెనీలకు చెందిన ప్రతినిధులతో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు. దిగుమతి సుంకం పెంచడం వల్ల అమెరికాలోని పరిశ్రమలకు లాభం కలుగుతుందని, ఉద్యోగాలు పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య యుద్ధాల పరిణామాలు ఏ స్థాయిలో ఉంటాయో మనం ఊహించలేం. బడాబడా ఆర్థిక వ్యవస్థలు సైతం ఒక్కసారిగా కుప్పకూలిపోతాయి. ఈ యుద్ధం వస్తుందంటే బలమైన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలు సైతం హడలిపోతాయి. ఇటీవల అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం(ట్రేడ్ వార్) జరగనున్నదా అన్న వార్తలు ప్రపంచ మార్కెట్లను హడలెత్తించాయి. చైనాను ట్రేడ్ వార్ దిశగా అమెరికా రెచ్చగొట్టడం, వివిధ రకాలుగా బెదిరింపులకు దిగటం ట్రంప్ సర్కార్ వచ్చాక ఎక్కువైపోయింది.

గన్ కల్చర్‌పై చర్చలు

గన్ లాబీకి అత్యుత్సాహం వద్దని చెబుతూ.. వాటి నియంత్రణకు కొన్ని సూచనలు చేశారు. తుపాకుల నియంత్రణపై వైట్ హౌజ్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన చట్టసభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. తుపాకులపై నియంత్రణకు సంబంధించి ఒక బలమైన బిల్లుతో ముందుకు రావాలని ట్రంప్ సభ్యులకు సూచించారు. ఎవరైనా వ్యక్తికి తుపాకి విక్రయించేటప్పుడు.. అతని బ్యాక్ గ్రౌండ్ గురించి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. అలాగే తుపాకుల కొనుగోళ్ల వయస్సును 18 నుంచి 21 పెంచాలని సూచించారు.

అమెరికాతో చర్చల్లేవ్..

- రష్యా ప్రకటన

మాస్కో: అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా మధ్య విభేదాలు ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఈనెలలో అమెరికాతో జరగబోయే వ్యూహాత్మక చర్చలను రద్దు చేస్తున్నట్టు రష్యా తాజాగా ప్రకటించింది. దీంతో రెండు దేశాల మధ్య మరోసారి విభేదాలు చోటుచేసుకున్నాయి. అయితే అమెరికా తీరు వల్లే తాము చర్చలను రద్దు చేశామని రష్యా చెప్పడం గమనార్హం. మార్చి 6, 7 తేదీల్లో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో అమెరికా, రష్యా మధ్య సమావేశానికి షెడ్యూల్ ఖరారైంది.

ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఈ సమావేశంలో చర్చించేందుకు నిర్ణయించారు. అయితే ఈ సమావేశాన్ని రద్దు చేస్తున్నట్టు అమెరికాలో రష్యా రాయబారి అనాటోలీ ఆంటోనోవ్ తెలిపారు. 'ఇటీవల సైబర్ సెక్యూరిటీపై జెనీవాలో జరిగిన సమావేశం నుంచి అమెరికా చివరి నిమిషంలో తప్పుకుంది. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో రెండు దేశాల మధ్య చర్చలు జరగడం అసాధ్యమని రష్యా భావించింది' అని ఆంటోనోవ్ అన్నారు.

ఇదిలా ఉండగా.. కొత్తతరం హైపర్‌సోనిక్ ఆయుధాలు, సబ్‌మెరైన్‌లను అభివృద్ధి చేస్తున్నామని ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. దీనిపై ఆగ్రహించిన అమెరికా.. ప్రచ్ఛన్న యుద్ధం సమయం నాటి ఒప్పందాలను రష్యా ఉల్లంఘిస్తోందని ఆరోపణలు చేసింది. అయితే ఈ ఆరోపణలపై కూడా ఆంటోనోవ్ తాజాగా స్పందించారు. తాము ఎలాంటి ఒప్పందాలను ఉల్లంఘించడం లేదని అన్నారు. పుతిన్ చెప్పిన ఏ ఆయుధం కూడా ప్రచ్ఛన్న యుద్ధం నాటి ఒప్పందంలో లేదన్నారు.

పాక్‌లో భారత రాయబారికి అవమానం



న్యూఢిల్లీ : భారత రాయబారి అజయ్ బిసారియాను పాకిస్తాన్ ఉద్దేశపూర్వకంగా అవమానించింది. పలు దేశాల రాయబారులు, ఉన్నతాధికారులు సభ్యులుగా ఉండే ఇస్లామాబాద్ క్లబ్‌లో బిసారియా చేరకుండా అడ్డుకునేయత్నం చేసింది. సాధారణంగా ఒకటి రెండు రోజుల్లో ముగిసే ప్రక్రియను నెలలు గడుస్తున్నా వాయిదావేస్తూ వచ్చింది. గతంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు దారుణంగా దెబ్బతిన్న పరిస్థితుల్లోనూ ఇలా ఎప్పుడూ జరగలేదు. కొంతకాలంగా సరిహద్దులో వరుస కాల్పులు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాక్ తాజా చర్య మరింత రెచ్చగొట్టినట్లైంది.

ఇస్లామాబాద్‌లో రాయబార కార్యాలయాలకు సమీపంగా ఇస్లామాబాద్ క్లబ్ ఉంది. 350 ఎకరాల సువిశాల ప్రాగణంలో గోల్ఫ్, స్విమ్మింగ్, రెస్టారెంట్ సహా సకల సదుపాయాలుంటాయి. పాక్‌లో పనిచేసే అన్ని దేశాల రాయబారులు, వారి కుటుంబాలు, అత్యున్నతాధికారులకు అదొక రిక్రియేషన్ సెంటర్. ఏ దేశం నుంచైనా కొత్తగా రాయబారి నియమితులయ్యారంటే, గంటల వ్యవధిలోనే ఆ క్లబ్‌లో మెంబర్ కావడం రివాజుగా వస్తోంది. అలా ఇస్లామాబాద్ క్లబ్ రాయబారుల అడ్డాగా పేరుపొందింది. కాగా, గత డిసెంబర్‌లో అజయ్ బిసారియా పాకిస్తాన్‌లో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. సంప్రదాయం ప్రకారం ఇస్లామాబాద్ క్లబ్ మెంబర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ పాక్ అధికారులు ఆయనకు సభ్యత్వం ఇవ్వలేదు. భారత రాయబారుల కార్యకలాపాలపై ఆంక్షలు విధించాలన్న ఉద్దేశంలోనే పాక్ ఈ రీతిగా వ్యవహరిస్తున్నది.

సమాధానం చెప్పలేక.. ఇజ్రాయిల్ ప్రధాని ఉక్కిరిబిక్కిరి


జెరూసలెం : ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆ దేశ పోలీసులు శుక్రవారం ప్రశ్నించారు. దేశంలోని అతి పెద్ద టెలికమ్యూనికేషన్ల కంపెనీ బెజెక్‌కు ప్రమేయం ఉన్న ఓ అవినీతి కేసులో ఆయనను మొదటిసారి ప్రశ్నించారు. ఆయనపై మరో రెండు ముడుపుల కేసులు విచారణలో ఉన్నాయి. దీంతో నాలుగుసార్లు ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన నెతన్యాహు రాజకీయ భవితవ్యం అయోమయంలో పడింది. అయితే తానేమీ తప్పు చేయలేదని నెతన్యాహు చెప్తున్నారు. బెజెక్ టెలికమ్యూనికేషన్స్ ముడుపుల కేసును కేస్ 4000



నెతన్యాహు

అని పిలుస్తున్నారు. కమ్యూనికేషన్స్ రెగ్యులేటర్ల నుంచి లబ్ధి పొందిన బెజెక్ తన ఆధీనంలో ఉన్న న్యూస్ వెబ్‌సైట్ల ద్వారా బెంజమిన్ నెత్యాహుకు, ఆయన సతీమణి సారాకు అనుకూలంగా, విపరీతమైన ప్రచారం కల్పించిందని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఇద్దరు పోలీసు అధికారులు శుక్రవారం ఉదయం బెంజమిన్ నెతన్యాహు నివాసంలోకి వెళ్ళినట్టు ఓ వార్తా సంస్థ తెలిపింది. అదే సమయంలో టెల్ అవీవ్‌లోని పోలీస్ స్టేషన్‌లో సారా నెతన్యాహు సాక్ష్యమిచ్చినట్టు ఇజ్రాయెలీ రేడియో తెలిపింది.

ట్రంప్ కుమారుడికి కవర్ పంపిన వ్యక్తి అరెస్ట్



డేనియల్ ఫ్రిసీల్లో

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు ట్రంప్ జూనియర్ ఇంటికి ఇటీవల వచ్చిన ఓ కవర్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కవర్ పంపించిన వ్యక్తిని ఎఫ్‌బీఐ అధికా రులు పట్టుకున్నారు. మసాచుసెట్స్‌కు చెందిన డేనియల్ ఫ్రిసీల్లో ఈ ఎన్వెలప్ పంపినట్లు గుర్తించారు. అందులో బెదిరింపు లేఖతో పాటు ఏదో తెల్లని పౌడర్ పంపించాడు. మసాచుసెట్స్‌లోని బీవెర్లీ ప్రాంతానికి చెందిన 24ఏళ్ల డేనియల్ ఇలా బెదిరింపు లేఖలను అయిదుగురికి పంపి చినట్టు గుర్తించారు. ట్రంప్ జూనియర్‌కు పంపిన లేఖలో ఆయన చాలా భయంకరమైన వ్యక్తి అని, ఆయనను తీవ్రంగా ద్వేషిస్తున్నానని రాశాడు.

ఆస్ట్రేలియాలో భారీగా తుపాకుల అప్పగింత

- గన్ ఆమ్నెస్టీ కార్యక్రమానికి అనూహ్య స్పందన

కాన్‌బెర్రా : గత మూడు నెలల కాలంలో 57,324 తుపాకులు, ఆయుధా లకు సంబంధించిన 2,432 విడి భాగాలు ఆస్ట్రేలియా ప్రభుత్వానికి స్వాధీనం చేశారని ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. గన్ ఆమ్నెస్టీ అంటే ప్రజలు స్వచ్ఛందంగా తుపాకులను ప్రభుత్వానికి అప్పగించటం. అలా అప్పగించిన వారికి ఎలాంటి శిక్ష ఉండదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆయుధాల్ని కలిగివుండటంపై ఆస్ట్రేలియాలో 1996 నుంచి కఠిన చట్టాలు అమలుజేస్తున్నారు. 1996 తర్వాత ప్రభుత్వం ప్రకటించిన మొదటి ఆమ్నెస్టీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ప్రపంచంలోకెల్లా కఠిన చట్టాలు ఉన్నప్పటికీ, ఆ దేశంలో 2,50,000 లైసెన్స్ లేని తుపాకులున్నట్టు అంచనా. ఉగ్రవాద దాడుల్లో వీటినే ఎక్కువగా వాడుతున్నట్టు అక్కడి పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఆమ్నెస్టీ పిరియడ్ ముగిసిన తరువాత ఆస్ట్రేలియాలో ఎవరైనా లైసెన్స్ లేని తుపాకులతో కనిపిస్తే అమల్లో ఉన్న చట్టం ప్రకారం 2,12,500 అమెరికన్ డాలర్ల జరిమానాతో పాటు 14 సంవత్సరాల జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

బుర్కినా ఫాసోలో కాల్పులు



వాగాదువో : పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసో ఉగ్రదాడితో ఉలిక్కిపడింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం నుంచి రాజధాని వాగాదువో నగరంలో ఉగ్రవాదులు విరుచుకుపడుతున్నారు. కారులో వచ్చిన ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులకు, బాంబు దాడులకు పాల్పడినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మరోవైపు ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌తోపాటు ఫ్రాన్స్ రాయబార కార్యాలయంపై దాడి జరిగినట్టు అధికారులు ధృవీకరించారు. ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచిస్తు న్నారు. రంగంలోకి దిగిన సైన్యం ఉగ్రవాదులను మట్టుబెట్టే ప్రయత్నాలు చేస్తోం ది. ప్రస్తుతం కాల్పులు కొనసాగుతున్నట్టు సమాచారం. మరోవైపు అమెరికా రాయబార కార్యాలయం కూడా ఉగ్రదాడిని ట్విట్టర్‌లో తెలియజేసింది. కాగా, రెండేండ్ల క్రితం నగరంలోని ఓ టర్కీస్ రెస్టారెంట్‌లోకి చొరబడ్డ ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 17 మందిని పొట్టనపెట్టుకున్న సంగతి తెలిసిందే.

ఘోర అగ్ని ప్రమాదం

- **30మంది సజీవ దహనం**

బకు: అజెర్ బైజాన్ దేశ రాజధాని నగరం బకులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బకు పట్టణం లోని హెల్త్ సెంటర్‌లో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక మీడి యా అందించిన సమాచారం ప్రకారం, ఈ ప్రమాదంలో 30 మంది సజీవదహనం కాగా, మరో నలుగురికి తీవ్ర గాయాల య్యాయి.

బాధి తులను స్థానిక హాస్పిటల్‌కు తరలించి చికిత్సనందిస్తున్నారు. ప్రమాదస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానిక న్యూస్ ఏజెన్సీ ఏపీఏ రిపోర్టు చేసింది. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు, తదితర వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమాసియా, తూర్పు యూరప్ దేశాల సరిహద్దు వెంబడి అజెర్‌బైజాన్ దేశం ఉంటుంది.


భగీరథకు 'అప్పుల' భారం

మూడేండ్లుగా రూ.3 వేల కోట్లే

- కార్పొరేషన్ పేర రుణాల సేకరణ
- నెలకు రూ. 1000 కోట్లు వడ్డీ
- ప్రజల మీద భారాలు మోపే యోచన ?



(ఫైల్)



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకుగాను సర్కారు చేపట్టిన మిషన్ భగీరథకు అప్పులే ప్రధానం కానున్నాయి. ఈ పథకం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించడం లేదు. కేవలం అప్పులతో మాత్రమే ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. మూడేండ్ల క్రితం చేపట్టిన ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ. 48 వేల కోట్లు వ్యయం కానుంది. ఇందులో ప్రధాన పనులకు రూ. 42 వేల కోట్లు కాగా, గ్రామాల్లో అంతర్గత పనులు(ఇంట్రా నెట్‌వర్క్) పనుల కోసం మరో రూ. 5500 కోట్లు అవనున్నాయి. దాదాపు 26 వేల ఆవాసాలకు తాగునీటిని సరపరా చేసేందుకు పనులు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ లిమిటెడ్(టీడీడబ్ల్యూఎస్‌సీఎల్)ను రిజిష్టర్ చేశారు. సురక్షిత మంచినీటిని అందించడం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడమేగాకుండా అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. 2045 సంవత్సరం అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మనిషికి రూ. 100 లీటర్లు, పట్టణాలు, మున్సిపల్ కార్పొరేషన్లల్లో ప్రతి మనిషికి 150 లీటర్ల చొప్పున సరఫరా చేయనుంది. ఇందుకోసం ఆయా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, వాణిజ్య బ్యాంకుల నుంచి అప్పులు తెస్తున్నది.

అప్పుల కోసం కార్పొరేషన్

భగీరథ కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందించడం లేదు. దాదాపు నాలుగేండ్ల పాలనలో ఇప్పటివరకు కేవలం రూ. 3000 కోట్లు మాత్రమే సర్కారు ఇచ్చింది. ఇది కూడా 2017–18 బడ్జెట్‌లో చూపించింది. ఇప్పటివరకు దాదాపు రూ. 30 వేల కోట్ల మేర అప్పులు తెచ్చేందుకు ఆయా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, వాణిజ్య బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. హడ్కో, నాబార్డుతోపాటు వాణిజ్యబ్యాంకులైన ఎస్‌బీఐ. ఆంధ్రాబ్యాంకు, పీఎన్‌బీ, ఓరియంటల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకుతో మరో పది బ్యాంకుల నుంచి అప్పులు తెస్తున్నారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ నుంచి నిధులు ఇచ్చేది లేదని ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తెచ్చిన రూ. 30 వేల కోట్లల్లో నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 20 వేల కోట్లు వ్యయం చేశారు. అవసరాలకు అనుగుణంగా ఆయా వాణిజ్య సంస్థల నుంచి అప్పులు తెచ్చేందుకు మిషన్ భగీరథతోపాటు ఆర్థిక శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

నెలకు రూ. 1000 కోట్లు వడ్డీ

భగీరథ కోసం ఆయా బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పుల కోసం ప్రతినెలా ప్రభుత్వం ఆయా బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రూ. 1000 కోట్ల మేర మడ్డీ చెల్లిస్తున్నది. రాష్ట్రంలోని 26 సెగ్మెంట్లల్లో భగీరథ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఒకో సెగ్మెంట్‌లో మూడు, నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో సెగ్మెంట్‌కు కనీసంగా రూ. 1500 కోట్ల నుంచి రూ. 3500 కోట్ల వరకు నిధులు కేటాయంచారు. ఇంటెక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు, మెయిన్ పైపులైన్లు తదితర ప్రధాన పనుల కోసమే రూ. 42 వేల కోట్లు వ్యయం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్ కోసం రూ. మరో రూ. 5500 ఖర్చు చేయనున్నారు.

ప్రజలపైనే భారాలు

మొత్తం అప్పులతో చేపట్టిన ఈ ప్రాజెక్టును భవిష్యత్తులో ఎలా నిర్వహిస్తుందనే విషయంలో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రకాల అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లోని పానీసమితిల ద్వారా ప్రతినెలా తాగునీటి చార్జీలను వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక్కడా ఆ పద్ధతిని అమలుచేయాలనే యోచనలో టీఆర్ఎస్ సర్కారు ఉంది. అలాగే ఈ ప్రాజెక్టులో 90 శాతం తాగునీటి అవసరాల కోసమైతే, మరో 10 శాతం నీటిని పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించనున్నారు. ప్రజలకు, ప్రభుత్వ సంస్థలకు ఉచితంగా నల్లా కనెక్షన్ ఇచ్చినా యూజర్ చార్జీలు తప్పకపోవచ్చని పేరు రాయడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి చెప్పారు. అలాగే పారిశ్రామిక సంస్థలకు అధికారికంగా డబ్బులు తీసుకుని నీటి కేటాయింపులు చేస్తారు. సరఫరా చేసిన నీటి ఆధారంగా చార్జీలు వసూలు చేస్తారని భగీరథ ఇంజినీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సాధారణ ప్రజలు, ఇతర వినియోగదారులపై ప్రతినెలా రూ. 100 నుంచి రూ. 150 మేర వసూలు చేసే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అలాగే పారిశ్రామిక సంస్థల నుంచి వచ్చే సొమ్మును ప్రాజెక్టు నిర్వహణకు వాడుకోవడం లేదా సర్కారు ఖాతాకు మళ్లించాలనే ఆలోచన సైతం ప్రభుత్వ మదిలో ఉన్నట్టు సమాచారం.

సర్పంచుల సమ్మేళనాలు నేటి నుంచి షురూ


- **నేడు మహబూబ్‌నగర్, ఐదున నిజామాబాద్‌లో హాజరు కానున్న మంత్రి జూపల్లి**

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో మూడు చోట్ల సర్పంచుల సమ్మేళనాలు నిర్వహించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ సన్నాహాలు చేస్తున్నది. ఇందులో భాగంగా శనివారం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కష్ణారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అప్పన్నపల్లిలోని వైట్‌హౌస్ కన్వెన్షన్ హాల్లో జోగులాంబ–గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ – మల్కాజ్‌గిరి, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల సర్పంచుల సమ్మేళనాన్ని ఉదయం 11 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. అలాగే ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కొమురంభీం– ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న–సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల సర్పంచ్ ల సమ్మేళనాన్ని మార్చి ఐదున నిజామాబాద్ లో నిర్వహిస్తారు. గత నెల 27 న జరగాల్సిన భద్రాద్రి– కొత్తగూడేం, జనగామ, జయశంకర్–భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ (రూరల్), వరంగల్ (అర్బన్), యాదాద్రి–భువనగిరి జిల్లాల సర్పంచ్ ల సమ్మేళనాన్ని మార్చి రెండో వారంలో చేపడతారు. ప్రతి జిల్లా నుంచి 100 మంది సర్పంచులను ఆహ్వానిస్తున్నారు వీరికి జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందిన గ్రామ సర్పంచులతో తమ అనుభవాలను పంచుకొనేలా సమ్మేళనాలను ఏర్పాటు చేస్తున్నారు. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, వందశాతం పన్నుల వసూలు, ఎల్‌ఈడీ లైట్ల వినియోగం, నీటి సంరక్షణ, ఉపాధిహామీ లాంటి కార్యక్రమాల్లో తాము ఎలా ముందుకువెళ్లింది వివరించి, ఇతర సర్పంచులను ఆ దిశగా సన్నద్ధం చేసేలా సర్పంచుల సమ్మేళనాలకు తెలంగాణా గ్రామీణాభివ ద్ధి శిక్షణ సంస్థ(టీసీపార్డ్) ఏర్పాట్లు చేస్తోంది.

కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.2 కోట్ల నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పత్తి

నవతెలంగాణ–గజ్వేల్

కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు రూ.2 కోట్ల పత్తి కాలిబూడిదయింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని బయ్యారం చౌరస్తా వద్ద శివ కాటన్ మిల్స్‌లో శుక్రవారం జరిగింది. మిల్ యజమాని ఉమాపతి తెలిపిన వివరాల ప్రకారం... కాటన్ మిల్‌కు ఓ రైతు ట్రాలీ ఆటోలో పత్తి తీసుకొచ్చాడు. మిల్లులోకి ఆటో ప్రవేశించగానే ఆటో సైలెన్సర్ నుంచి నిప్పులొచ్చాయి. దీంతో ఒక్కసారిగా మిల్లులో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారమందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.2 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు యజమాని తెలిపాడు.

20 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

- **18,089 మంది విద్యార్థులు గైర్హాజరు**
- **ప్రశ్నాపత్రంలో రెండు తప్పులు**
- **ఆలస్యంగా స్పందించిన ఇంటర్ బోర్డు**
- **ముందే జవాబు రాసిన విద్యార్థుల ఆందోళన**
- **ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం**

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ పరీక్షలు గతనెల 28న ప్రారంభమైన విషయం తెలిసిందే. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, కన్నడ, మరాఠీ) పరీక్ష జరిగింది. జనరల్, ఒకేషనల్‌లో కలిపి ఈ పరీక్షల కోసం 4,39,422 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 4,21,333 మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18,089 (4.11 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో తొలిరోజు 20 మంది విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్లలో ఒకరు, భద్రాద్రి కొత్తగూడెంలో ఒకరు, నల్లగొండలో ముగ్గురు, యాదాద్రి భువనగిరిలో 11 మంది, మహబూబ్‌నగర్‌లో ఒకరు, వికారాబాద్‌లో ఇద్దరు, మేడ్చల్‌లో ఒకరు చొప్పున మొత్తం 20 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు పెట్టామని తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారులు పరిశీలకులుగా వికారాబాద్, రంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ, జనగామ, యాదాద్రి, హైదరాబాద్ జిల్లాల్లో పరీక్షలను పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ ప్రశ్నాపత్రంలో రెండు తప్పులు దొర్లాయి.


సెకండ్ లాంగ్వేజ్ తెలుగు ప్రశ్నాపత్రంలో అధికారులతో సంభాషణ ఉండాల్సిన ప్రశ్న వైద్యులతో సంభాషణ అని వచ్చింది. పరీక్ష ప్రారంభమైన గంటన్నర తర్వాత ఇంటర్ బోర్డు ఆలస్యంగా స్పందించింది. వైద్యులతో సంభాషణ అని పదాలను అధికారులతో సంభాషణ అని మార్చుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు ఇంటర్ బోర్డు ఆదేశించింది. అప్పటికే విద్యార్థులు జవాబులు రాయడంతో ఆందోళన చెందారు. సంస్కృతం ప్రశ్నాపత్రంలో 10ఏ ప్రశ్నలో సుకర్షకు బదులుగా సుదర్శ అని ప్రచురించారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రశ్న సరిగ్గా ప్రచురించకపోవడంతో గందరగోళం చెందారు. ఇంటర్ బోర్డు అధికారులు ఆలస్యంగా స్పందించడంతో విద్యార్థులు జవాబు సరిగ్గా రాయలేదని తెలుస్తున్నది. అధికారులు సకాలంలో స్పందించి తప్పులను గుర్తించి వెంటనే సరిచేస్తే విద్యార్థులు గందరగోళానికి గురికావడానికి అవకాశముండబోదని అధ్యాపక సంఘాలు సూచిస్తున్నాయి.

ఎస్ఐ వేధిస్తున్నాడంటూ...

- **హోంగార్డు ఆత్మహత్యాయత్నం**

ఆరోపణలు సత్యదూరం : సీఐ

నవతెలంగాణ–కొల్లాపూర్



హోంగార్డు చెంచు బయ్యన్న

మూడు నెలలుగా కోడేరు ఎస్ఐ తనను వేధిస్తున్నాడని హోంగార్డు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం జరిగిం ది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన చెంచు బయ్యన్న కోడేరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. మూడు నెలలుగా తనకు ఇంటి దగ్గర పనులున్నాయని ఎంత వేడుకున్నా ఎస్ఐ ఒక్కరోజు కూడా సెలవు ఇవ్వలేదు. ఎస్ఐ ఇంట్లో పని చేయించుకుంటున్నాడు. ప్రతిరోజూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అందుకే తాను చస్తేనన్నా నాలాంటి పదిమంది హోంగార్డులకు న్యాయం జరుగుతుంది. ఈ క్రమంలో బయ్యన్న కొల్లాపూర్‌లో పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా అక్కడున్న వారు అడ్డుకున్నారు. సమాచారమందుకున్న కొల్లాపూర్ పోలీసులు వెంటనే వచ్చి అతడిని వాహనంలో ఎక్కించుకుని ఠాణాకు తరలించారు. అయితే, హోంగార్డు బయ్యన్న ఆత్మహత్యాయత్నం అనేది నాటకమని సీఐ సైదయ్య 'నవతెలంగాణ'కు చెప్పాడు. అతని ఆరోపణలు సత్యదూరమన్నారు. మద్యం మత్తులో విధులు నిర్వహిస్తున్నాడని, ఇతని విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

నవచిత్రం



'రంగస్థలం'లో రామ్ చరణ్

రంగస్థలానా చిట్టిబాబు చిందులు..!

ఇటీవల 'ఎంత సక్కగున్నావే..' పాటతో ఆకట్టుకున్న చరణ్ ఇప్పుడు టైటిల్ సాంగ్‌తో అలరిస్తున్నారు. 'రంగ.. రంగ.. రంగస్థలానా రంగుపూసుకోకున్నా...' అంటూ సాగే రెండో పాటను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో చరణ్ 'వినబడేట్టు కాదురా.. కనబడేట్టు కొట్టండహే..' అనే డైలాగులు, వేసే చిందులు ఆకట్టుకుంటున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. సుకుమార్ దర్శకత్వంలో చరణ్ తొలిసారి నటిస్తున్న ఈ చిత్రం 1985 నాటి గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. ఇందులో చరణ్ చిట్టిబాబు పాత్రలో చెవిటివాడుగా కనిపించనున్నారు. సమంత కథానాయికగా నటిస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. మొదటి పాటకు భారీ స్పందన లభించింది. దీంతో ఈ సాంగ్‌ను శ్రీదేవికి అంకితమిచ్చారు. చంద్రబోస్ రాసిన తాజా ఫోక్ సాంగ్ సైతం విపరీతంగా అలరిస్తోంది. ఈ చిత్ర షూటింగ్ సందర్భంగా చరణ్ లుంగితో ఉన్న కొన్ని ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఈ సినిమాను ఈ నెల 30న విడుదల చేయనున్న విషయం తెలిసిందే. దీంతోపాటు చరణ్ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. కైరా అద్వాని కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతుంది.

25వ చిత్రానికి మరో ఆకర్షణ

ప్రస్తుతం 'భరత్ అనే నేను' చిత్రంలో నటిస్తున్న మహేష్‌బాబు తదుపరి వంశీపైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. మహేష్‌బాబుకిది 25 సినిమా. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతీ మూవీస్ పతాకాలపై సి.అశ్వనీదత్, దిల్‌రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ కెమెరామెన్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మహేష్ 25వ చిత్రాన్ని మా బ్యానర్‌లో నిర్మించడం హ్యాపీగా ఉంది. భారీ బడ్జెట్‌తో రూపొం దించనున్న ఈ చిత్రానికి ప్రముఖ బాలీవుడ్ సినిమాటో గ్రాఫర్ కె.యు.మోహనన్ ఎంపికయ్యారు. బాలీవుడ్‌లో 2006లో వచ్చిన 'డాన్', 'తలాష్', 'రయీస్' వంటి భారీ చిత్రాలకు అద్భుతమైన విజువల్స్‌ని అందించి ఆకట్టుకున్న ఆయన మా సినిమాకు పనిచేయడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.



మహేష్‌బాబు

పూర్తి రౌడీయిజాన్ని చూడలేదు



'కాలా'లో రజనీకాంత్

'మీరింకా నా పూర్తి రౌడీయిజాన్ని చూడలేదు. ఇప్పుడు చూస్తారు' అని అంటున్నారు రజనీకాంత్. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'కాలా'. 'కబాలి' తర్వాత పా.రంజిత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. లైకా ప్రొడక్షన్, వండర్ బార్ పతాకాలపై ధనుష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి ఇందులో రజనీ సరసన కథానాయికగా నటిస్తుంది. రజనీకాంత్ కరికాలన్ అనే డాన్ పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు నానాపటేకర్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో 'కాలా.. ఇదేం పేరు' అని నానా పటేకర్ అంటే 'కాలా అంటే నలుపు, కరికాలన్ అంటే చావుకే దేవుడు. రక్షించడానికి పోరాడేవాడు..' అంటూ వచ్చే బ్యాక్‌గ్రౌండ్ వాయిస్ ఆకట్టుకుంటోంది. చివరగా 'నేనొక్కడినే వచ్చాను. దమ్మున్నోడు రండిరా. మీరింకా నాపూర్తి రౌడీయిజాన్ని చూడలేదు. చూస్తారు' అని తనదైన స్టయిల్‌లో రజనీ చెప్పే డైలాగులు ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. సినిమాపై విపరీతమైన క్రేజ్‌ను పెంచుతున్నాయి. ఈ టీజర్ గురువారమే విడుదల కావాల్సింది. కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి కన్నుమూసిన నేపథ్యంలో వాయిదా వేశారు. అందుకు అభిమానులకు నిర్మాత ధనుష్ క్షమాపణలు కూడా తెలిపారు. ఇక ముంబయి మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న ఈచిత్రం ఏప్రిల్ 27న విడుదల కానుంది. శంకర్ దర్శకత్వంలో రజనీ నటిస్తున్న '2.0' చిత్రం గ్రాఫిక్స్ కారణంగా వాయిదా పడిన విషయం విదితమే. ఈ చిత్రాన్ని స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా గానీ, దీపావళికిగానీ విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే రజనీకాంత్ నెక్ట్స్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. దీనికి అనిరుధ్ సంగీత దర్శకత్వం వహించనున్నారు.



అనుష్క

పోలీస్ పాత్రలో !

ఇటీవల 'భాగమతి'తో మంచి విజయాన్ని అందుకున్న అనుష్క నెక్ట్స్ నటించబోయే సినిమా ఏంటనేది ఇంకా క్లారిటీ రాలేదు. పలు కమర్షియల్ సినిమాల్లో చేయబోతుందనే వార్తలు వచ్చాయి. కానీ తాజాగా ఆమె మరోసారి మహిళా ప్రాధాన్యత కలిగిన తమిళ చిత్రం 'నాచియర్' తెలుగులో రీమేక్‌లో నటించబోతుందట. జ్యోతిక పోలీస్ ఆఫీసర్‌గా నటించిన ఈ సినిమా గత నెల 16న విడుదలై మంచి విజయం సాధించింది. సినిమాలో జ్యోతిక ఉపయోగించిన డైలాగులు వివాదాస్పదంగా మారాయి. మహిళల్ని కించపరిచేలా ఉన్నాయంటూ పలువురు విమర్శించారు. కానీ విడుదలైన సినిమా పాజిటివ్ టాక్‌తోపాటు మంచి కలెక్షన్లను రాబడుతోంది. ఈ చిత్ర రీమేక్, అనువాద హక్కులు తెలుగు నిర్మాత కల్పనా కోనేరు దక్కించుకున్నారు. తెలుగులో అనుష్క ప్రధాన పాత్రధారిణిగా రీమేక్ చేయాలని భావిస్తున్నారు. దీనిపై అనుష్క కూడా ఆసక్తిగా ఉన్నట్టు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అన్ని కుదిరితే అనుష్క తదుపరి చిత్రం ఇదే అవుతుందని అంటున్నారు.

యాక్షన్ సీక్వెన్స్‌తో నూతన చిత్రం షురూ!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నూతన దర్శకుడు శ్రీనివాస్ డైరెక్షన్‌లో రూపొందుతున్న నూతన చిత్రం ఇటీవల ప్రారంభమైన విషయం విదితమే. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని (నాని) నిర్మిస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. ఆ విశేషాలను నిర్మాత తెలియజేస్తూ, 'ఫైట్ మాస్టర్ స్టంట్ శివ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణతో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మొదటిసారి కొత్త దర్శకుడితో సినిమా చేయడం విశేషం. శ్రీనివాస్ గతంలో పలు విజయవంతమైన చిత్రాలకు పనిచేశారు. బెల్లంకొండ ప్రొఫెషనలిజం ఉన్న హీరో. బ్రేక్ లేకుండా షూటింగ్‌లో పాల్గొంటున్న ఆయన ప్యాషన్, కమిట్‌మెంట్‌కు హ్యాట్సాఫ్. సరికొత్త కాన్సెప్ట్‌తో రొమాంటిక్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లుంటారు. అబ్బూరి రవి మాటలు, ఛోటా కె. నాయుడు సినిమాటోగ్రఫీ, థమన్ మ్యూజిక్ సినిమాకు అసెట్' అని అన్నారు. ఈ చిత్రానికి ఆర్ట్: చిన్న, ఎడిటర్: ఛోటా కె.ప్రసాద్.

పాదయాత్ర

బయోపిక్‌ల ట్రెండ్‌ను టాలీవుడ్‌లోనూ ఊపందుకుంటోంది. ప్రస్తుతం 'ఎన్టీఆర్' బయోపిక్, 'మహానటి' సావిత్రి బయోపిక్‌లు తెరకెక్కుతున్నాయి. గత కొన్ని రోజులుగా మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవితం ఆధారంగా ఓ బయోపిక్‌ను రూపొందించడానికి దర్శకుడు మహిత్ రాఘవ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో వైఎస్ఆర్‌గా నటించేందుకు మలయాళ నటుడు మమ్ముట్టి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తి కావడంతో త్వరలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారట. ఈ చిత్రానికి 'యాత్ర' అనే టైటిల్‌ను పరిశీలిస్తు న్నారట. రాజశేఖర్ రెడ్డి సీఎం కాకముందు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. ఆ పాద యాత్ర ప్రధానంగానే సినిమా సాగుతుండటంతో 'యాత్ర' అనే టైటిల్ ఫైనల్ చేయాలనుకుంటున్నారు. మమ్ముట్టి 'అంకుల్', 'పెరంబు', 'పేరోల్', 'మామాంకమ్', చిత్రాల్లో నటిస్తున్నారు.



మమ్ముట్టి

తల్లిగా కామెడీ పంచుతూ..



దేవయాని

పవన్ కళ్యాణ్ నటించిన 'సుస్వాగతం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన దేవయాని ఇటీవల ఎన్టీఆర్ నటించిన 'జనతా గ్యారేజ్'లో కనిపించి మెప్పించింది. ఇప్పుడు తల్లి పాత్రలో నటించబోతుంది. ధినేష్, అతిధి మీనన్ జంటగా నటిస్తున్న 'కలవాని మాపిల్లై' చిత్రంలో అతిధికి తల్లి పాత్రలో దేవయాని కనిపించనుంది. గాంధి మణివాసగం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. కామెడీ సన్నివేశాల్లోనూ దేవయాని బాగా చేశారని చిత్ర బృందం చెబుతోంది.



'కిరాక్ పార్టీ'లో నిఖిల్, సిమ్రాన్ పరీన్జా

కాలేజ్ క్యాంపస్ నేపథ్యంలో...!

నిఖిల్, సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా హీరోహీరోయిన్లుగా శరన్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'కిరాక్ పార్టీ'. ఏ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏ టీవీ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురించి చిత్ర బృందం తెలియజేస్తూ, 'కాలేజ్ క్యాంపస్ డ్రామా నేపథ్యంలో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. సినిమాకు సుధీర్ వర్మ, చందు మొండేటి స్క్రీన్‌ప్లే, మాటలు అందించడం విశేషం. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభించింది. నిఖిల్ స్టయిలీష్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. నిఖిల్ నటించిన 'హ్యాపీడేస్' తరహాలో ఈ సినిమా మరో భారీ విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోన్న ఈ సినిమాను అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెల 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పింది.

వినోదాత్మకంగా వ్యాంకిష్ మీడియా చిత్రం

ఆయూష్, వర్ణిక హీరోహీరోయిన్లుగా రవికుమార్ పొన్నగంటి దర్శకత్వంలో వ్యాంకిష్ మీడియా పతాకంపై షేక్ గౌస్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురువారం గుంటూరులో ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్లాప్‌నివ్వగా, నిర్మాత షేక్ గౌస్ కెమెరా స్విచాన్ చేశారు. గుంటూరు అర్బన్ అడిషనల్ ఎస్పీ వై.టి.నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అతిథులు చిత్ర బృందానికి అభినందనలు తెలిపి, సినిమా పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. నిర్మాత షేక్ గౌస్ మాట్లాడుతూ, 'గురువారం నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించాం. నిరంతరాయంగా ఈ నెల 24 వరకు చిత్రీకరణ జరుపనున్నాం. సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తిచేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. పాటలను కొల్‌కొత్తా, వైజాగ్, బ్యాంకాక్‌లో అందమైన లొకేషన్లలో చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఏప్రిల్ చివరి వారంలోగానీ, మే మొదటి వారంలోగానీ విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అమ్మపండు, కెమెరా: దుర్గ ప్రసాద్.



వర్ణిక, ఆయూష్‌లపై క్లాప్‌నిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్



తాప్సీ

ఇలాంటి కోచ్‌ను చూడలేదు

'సందీప్ సింగ్ లాంటి కోచ్‌ను ఇప్పటి వరకు చూడలేదు. ఆయన ది బెస్ట్ కోచ్' అని అంటోంది తాప్సీ. హాకీ ప్లేయర్ సందీప్ సింగ్ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో 'సూర్మ' అనే చిత్రం రూపొందుతుంది. ఇందులో తాప్సీ కథానాయికగా నటిస్తుంది. షాద్ అలీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సందీప్ సింగ్ పాత్రలో దిల్జిత్ దోసాంజే నటిస్తున్నారు. ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. తాప్సీ కూడా ఇందులో హాకీ ప్లేయర్‌గా కనిపించనుంది. అందు కోసం ఏకంగా సందీప్ సింగ్ వద్దే శిక్షణ తీసుకుందట. ట్రైనింగ్‌కు సంబంధించిన అనుభవాలను పంచుకుంటూ, 'ఛాలెంజింగ్‌తో కూడిన ఆటను సైతం ఈజీగా ఆడేలా చేయగల సమర్థుడు సందీప్. నా దృష్టిలో ఆయన బెస్ట్ కోచ్. ఈ సినిమా చేయడం నాకు గొప్ప అనుభూతినిచ్చింది. సరికొత్త ఎనర్జీతో హాకీ ప్లేయర్‌గా నటించాను. కచ్చితంగా నన్ను ఇది మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుంది' అని తెలిపింది. ఈ సినిమా జూన్ 29న విడుదల కానుంది. దీంతోపాటు తాప్సీ 'దిల్ జంగ్లీ', 'ముల్క్', 'మాన్‌మర్జియాన్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



కంగనా రనౌత్

ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి

"మణికర్ణిక' చిత్రంలో నటించేటప్పుడు దాదాపు నా ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎదురైంది' అని అంటోంది కంగనా రనౌత్. బాలీవుడ్‌లో మహిళా ప్రాధాన్య చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన కథానాయికల్లో కంగనా ఒకరు. ప్రస్తుతం ఆమె క్రిష్ దర్శకత్వంలో 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రంలో నటిస్తున్నారు. ఝాన్సీ రాణి లక్ష్మీభాయి జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్‌లో భాగంగా పలు యుద్ధ సన్నివేశాల్లో నటించేటప్పుడు కంగనా ముఖానికి కత్తిగాట్లు అయ్యాయి. ఆ విశేషాలను ఆమె తెలియజేస్తూ, 'చిత్ర టైటిల్‌ను చూస్తే అర్థమవుతుంది ఇది యుద్ధం నేపథ్యంలో సాగే చిత్రమని. ఇందులో నా పాత్ర చాలా ఛాలెంజింగ్‌తో కూడుకున్నది. సినిమా కోసం కత్తి సాము, గుర్రపు స్వారీ నేర్చుకున్నాను. ఎన్నో ప్రమాదాలకు గురయ్యాను. ఈ పాత్ర చేస్తూ దాదాపు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురైంది. అంత కఠినంగా ఉంటుంది. అయినప్పటికీ పాత్రకు న్యాయం చేసేందుకు ప్రయత్నించాను. అది ఎలా ఉందనేది ప్రేక్షకులు నిర్ణయించాల్సి ఉంటుంది' అని తెలిపింది. ప్రస్తుతం రాజస్థాన్‌లో చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ సినిమాను ఏప్రిల్ 27న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ఆదివాసీలను పట్టించుకోకపోవడం సరికాదు

- సీఎం కేసీఆర్‌కు ఆదివాసి గిరిజన సంఘం లేఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదిలాబాద్ పర్యటన ఆదివాసులకు నిరాశే కల్గించిందని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. సీఎం కేసీఆర్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సున్నం రాజయ్య, తొడసం భీంరావు శుక్రవారం బహిరంగ లేఖరాశారు. ఈ లేఖప్రతినీ వారు మీడియాకు విడుదల చేశారు. టీఆర్ఎస్‌పార్టీకి చెందిన ఆదివాసి నాయకులతో మాత్రమే సమావేశం ఏర్పాటు చేసి గిరిజన సంఘాల నాయకులతో ఆదివాసీల సమస్యలన్నింటిపై చర్చించామని ఆదివాసులను నమ్మించాలని చూశారని లేఖలో పేర్కొన్నారు. 951 హామ్లెట్ గ్రామాలుంటే, వాటిలో 478 గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేదని చెప్పారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ సింగిల్ ఫేజ్ విద్యుత్ సౌకర్యమే ఉందని తెలిపారు. 24గంటల కరెంట్ ఇస్తున్నామని ప్రకటిస్తున్నా, గిరిజన గ్రామాల్లో 12గంటలు కూడా ఉండటం లేదని లేఖలో పేర్కొన్నారు. భూమిలేని గిరిజనులకు మూడెకరాల భూపంపిణీ గురించి సీఎం కేసీఆర్ ఒక్క మాటా మాట్లాడలేదని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి రూ.75కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారనీ, కానీ అవి ఏమూలకూ సరిపోవని చెప్పారు. గతంలో జోడేఘాట్‌లో జిల్లాకు ప్రకటించిన గిరిజన యూనివర్సిటీ ఊసేలేదని పేర్కొన్నారు.

కేసీఆర్ ఫాసిస్ట్ పాలనకు పరాకాష్ట: టీపీఎఫ్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో తెలంగాణ పోలీస్ బలగాలు పదిమంది మావోయిస్టులను కాల్చిచంపడాన్ని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) తీవ్రంగా ఖండించింది. శుక్రవారం ఎన్‌కౌంటర్‌ను నిరసనగా విరసం నేత వరవరరావు నేతృత్వంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరవరరావు, టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నలమాస కృష్ణ, మెంచు రమేశ్ మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ ఎజెండానే టీఆర్ఎస్ ఎజెండా అని చెప్పి అధికారంలోకి వచ్చి, ప్రస్తుతం మావోయిస్టులను వెంటాడి కాల్చిచంపడం దుర్మార్గమని చెప్పారు. మావోయిస్టుల పేరుతో సాదారణ ప్రజలను చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే కుంబింగ్ ఆపాలని, పోలీస్ అదుపులో ఉన్న వారిని కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.

ఎన్‌కౌంటర్!

నవతెలంగాణ-భద్రాచలం/ వెంకటాపురం

భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో భూపాలపల్లి ఎస్పీ భాస్కరన్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఓఎస్డీలు, ఎఎస్పీలతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్‌కిషోర్ ఝూ విలేకరులకు ఎన్‌కౌంటర్ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేతలు సమావేశం అవుతున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో రెండు రాష్ట్రాల ఈవోఏప్, గ్రేహౌండ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా వెంకటాపురం మండలం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలోనే ఎదురు కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా పదిమంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. అందులో ఆరు మృతదేహాలు మహిళలవి. ఈ కాల్పుల్లో గ్రేహౌండ్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ కూడా చనిపోయాడు. ఘటనాస్థలంలో ఏకే 47, 2 ఎస్ఎల్ఆర్, 5 ఇన్సాస్, 303 పిస్టోల్, ఒక పిస్టోల్‌తో పాటు రాకెట్ బాంబులు, డిటోనేటర్లను, విప్లవ సాహిత్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మావోయిస్టు మృతదేహాలతో పాటు గ్రేహౌండ్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహాన్ని హెలికాప్టర్ ద్వారా భద్రాచలం ఏరియా స్పత్రికి తరలించారు. మిగిలిన మృతదేహాలను శనివారం ఉదయానికల్లా అక్కడకు తరలించనున్నారు. మృతులు ఎవరనేది ఇంకా ధ్రువీకరించలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు నిపుణులైన డాక్టర్లు, రెవెన్యూ అధికారులు సమక్షంలోనే పోస్టుమార్టం నిర్వహించి మావోయిస్టుల మృతదేహాలను భద్రాచలం ఏరియా స్పత్రిలోనే భద్రపరుస్తామని ఎస్పీ చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మృతుల్లో మావోయిస్టు కేంద్ర నాయకులు ?

మావోయిస్టు మృతుల్లో కేంద్ర కమిటీ నాయకత్వం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జగన్ అలియాస్ హరిభూషణ్‌తో పాటు అతని భార్య సమ్మక్క అలియాస్ శారద, ఖమ్మం జిల్లా కార్యదర్శి గోపన్న అలియాస్ సాంబయ్య, మరో అగ్రనేత, సెంట్రల్ రెవల్యూషనరీ కమిటీ కార్యదర్శి సాగర్ ఉన్నట్టు ప్రచారం సాగుతోంది.

మృతుల్లో మా అన్న, వదిన లేరు : హరిభూషణ్ కుటుంబ సభ్యులు

హరిభూషణ్ మృతి చెందాడన్న విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియాస్పత్రికి చేరుకున్నారు. హరిభూషణ్ తమ్ముడు అశోక్, చెల్లి భారతి అక్కడున్న మృతదేహాలను పరిశీలించారు. తమ అన్న, వదిన మృతుల్లో లేరని చెప్పారు. 1991లో తమ అన్న అజ్ఞాతంలోకి వెళ్లాడని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ తమ వద్దకు రాలేదని తెలిపారు.

కానిస్టేబుల్ మృతదేహం తరలింపు....


పోస్టుమార్టం అనంతరం కానిస్టేబుల్ మృతదేహాన్ని సొంత గ్రామానికి తరలించారు. అంతకు ముందు సుశీల్‌కుమార్ మృతదేహానికి ఎస్పీలు, ఇతర పోలీసులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఎన్‌కౌంటర్‌లో కానిస్టేబుల్ మృతి

- మేకవనంపల్లిలో విషాదఛాయలు

నవతెలంగాణ-మోమిన్‌పేట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం మేకవనంపల్లికి చెందిన గ్రే హౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్(32) మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుశీల్‌కుమార్ స్వస్థలం కర్నాటక రాష్ట్రం బీదర్. అతని తల్లి శారద ఐసీడీఎస్‌లో ఉద్యోగం నిమిత్తం 30 ఏండ్ల కిందట మేకవనంపల్లికి వచ్చి స్థిరపడ్డారు. సుశీల్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వతరగతి వరకు, 6,7 తరగతులు చిలుకూరులోని గురుకుల పాఠశాలలో, 8, 9, 10 మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ సదాశివపేట్‌లోని ప్రగతి జూనియర్ కళాశాలలో పూర్తిచేశాడు. ఆ తరువాత 2004 సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. మొదట్లో శంషాబాద్, చందానగర్‌లో విధులు నిర్వహించారు. 2010లో డిప్యూటేషన్‌పై గ్రేహౌండ్స్‌లోకి వెళ్లాడు.



సుశీల్‌కుమార్ (ఫైల్)

మేకవనంపల్లికి చెందిన సుష్మను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి మూడేండ్ల కుమార్తె ఉంది. కాగా, సుశీల్ తల్లి రిటైర్‌మెంట్ తర్వాత వారి కుటుంబం మళ్లీ స్వగ్రామం బీదర్‌కు వెళ్లిపోయింది. ఎదురు కాల్పుల్లో సుశీల్ మృతిచెందాడన్న సమాచారం టీవీల్లో రావడంతో భార్య, అత్తామామ కన్నీరు మున్నీరవుతున్నారు.

ఐదోస్థానంలో సింగరేణి థర్మల్ కేంద్రం



సింగరేణి థర్మల్ విద్యుత్కేంద్రం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద నున్న సింగరేణి థర్మల్ కేంద్రం విద్యుదుత్పత్తిలో జాతీయ స్థాయిలో ఐదోస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సగటున 90.70 పీఎల్ఎఫ్ సాధించినట్టు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. ఫిబ్రవరి నెలలో 93.59 శాతం పీఎల్ఎఫ్ సాధించామని చెప్పారు. సింగరేణి థర్మల్ విద్యుత్కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరం 11 నెలల కాలంలో మొత్తంగా 8,725 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి, 8,203 మి.యూ.,ను గ్రిడ్‌కు సరఫరా చేసినట్టు తెలిపారు. ప్లాంట్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 12,974 మి.యూ., ఉత్పత్తి జరగ్గా, 12,149 మి.యూ.,ను రాష్ట్ర అవసరాల కోసం అందించామన్నారు. పెరుగుతున్న రాష్ట్ర అవసరాలకు తగినట్టు విద్యుదుత్పత్తికి సింగరేణి థర్మల్ కేంద్రం కృషి చేస్తున్నదని, వచ్చే ఏడాదిలో జాతీయ స్థాయిలో మరింత మెరుగైన స్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు.

సిట్టింగ్ జడ్జిచేత విచారణ

- టీ మాస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) డిమాండ్ చేసింది. ఘటనకు కారణమైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ సీపీఐ (ఎం-ఎల్) ప్రతిఘటన

ఎన్‌కౌంటర్ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఐ (ఎం-ఎల్) ప్రతిఘటన డిమాండ్ చేసింది. అది ఎన్‌కౌంటర్ కాదని.. ఏకపక్ష కాల్పులని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనకు ముఖ్యమంత్రి కేసీఆరే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి : సీపీఐ

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయని సీపీఐ పేర్కొంది.

తండాల పంచాయతీల్లో నూరుశాతం

- ఎస్టీలకే రిజర్వేషన్లు :

తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన తండాలకు చెందిన పంచాయతీల్లో నూటికి నూరుశాతం రిజర్వేషన్లను ఎస్టీలకే కేటాయించాలని తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించి రొటేషన్ పద్ధతిని వెంటనే విరమించుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.రవినాయక్, ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సంఘం పోరాటాల ఫలితంగానే రాష్ట్రంలోని తండాలన్నింటినీ పంచాయతీలుగా గుర్తించేందుకు ప్రభుత్వం హామీనిచ్చిందని వారు గుర్తుచేశారు. 500 జనాభా కలిగిన తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలంటూ తాము పలుమార్లు ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో 2,243 తండాలు నూతన పంచాయతీలుగా ఏర్పడతాయంటూ గిరిజనులు భావించారని తెలిపారు. అయితే దానివెనుక కుట్ర దాగుందనే విషయం తేలిందని విమర్శించారు. తండాలను పంచాయతీలుగా మారిస్తే వాటన్నింటికీ నూటికి నూరుశాతం ఎస్టీలే సర్పంచులు అవుతారని భావించామని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా ఆయా పంచాయతీల్లో ఇతర కులాల వారికి కూడా రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించటం దారుణమని తెలిపారు. ఈ ఆలోచనను విరమించుకుని పూర్తిగా ఎస్టీలకే అవకాశమివ్వాలని రవినాయక్, ధర్మానాయక్ డిమాండ్ చేశారు.

టార్గెట్ హరిభూషణ్!

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో తిరిగి పాగావేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్న మావోయిస్టు రాష్ట్ర కమిటీ కార్య దర్శి హరిభూషణ్ ఎలియాస్ వేప నారాయణ టార్గెట్‌గానే శుక్రవారం రాష్ట్ర సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గతేడాది జనవరి నుంచే ఆపరేషన్ హరిపేరిట అంతర్గతంగా నిఘావిభాగం వ్యూహరచన సాగించిందని, అతని కదలికలపై నిరంతరం నిఘావేసి ఉంచి వేగులను రంగంలోకి దింపినట్టు తెలిసింది. ఈమేరకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసుస్టేషన్‌కు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఉసురు పోలీసు స్టేషన్ పరిధిలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. రెండు రోజుల కిందట వరకు కూడా ఛత్తీస్‌గఢ్ పోలీసులకు సైతం ఉప్పందకుండా జాగ్రత్త పడ్డ రాష్ట్ర అధికారులు తాము ముందుకు కదిలాక సమాచారాన్ని ఇచ్చి ఆపరేషన్‌ను పూర్తి చేసినట్టు తెలిసింది. అయితే పది మంది వరకు మావోయిస్టులు మరణించగా, ఇందులో తాము టార్గెట్ చేసిన హరిభూషణ్ తప్పించుకున్నాడనే సమాచారం పోలీసు ఉన్నతాధికారులకు మింగుడు పడటం లేదని తెలిసింది. అయితే హరిభూషణ్ ఇద్దరు గన్‌మెన్లు మరణించడం, అతని ఏకె 47 ఘటనా స్థలంలో దొరకడం వలన అగ్రనేత కూడా తీవ్రంగా గాయపడి ఉంటాడని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌కౌం టర్ జరిగిన ప్రాంతం నుంచి చుట్టు పక్కల 50 కి.మీ పరిధిలో కూంబింగ్‌ను కొనసాగించాలని నిర్ణయించారని తెలిసింది.ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత నాలుగేండ్లలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్‌లలో మొత్తం 28 మంది వామపక్ష తీవ్రవాదులు మరణించారు. ఇందులో రెండు ఘటనలు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పరిధులలో జరిగినప్పటికి ఆ ఆపరేషన్‌లు చేసింది రాష్ట్ర గ్రేహౌండ్స్ కావడం గమనార్హం. అలాగే గతంలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో సీపీ గ్రూపునకు చెందిన 9మంది మరణిం చారు. 2016 మార్చి 28న వరంగల్ జిల్లా గోవిందరావు పేట మండలం మొద్దుగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ లో శృతి ఎలియాస్ మహిత, సాగర్ ఎలియాస్ విద్యాసాగర్‌రెడ్డిలు మరణించారు.ఇద్దరు కూడా విద్యాధికు లై అప్పటికి రెండేండ్ల కిందటే మావోయిస్టు కార్యకలాపాలకు ఆకర్షితులై చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక ఎన్‌కౌంటర్లు ఉండవని భావిస్తున్న తరుణంలో తొలి ఎన్‌కౌంటర్‌గా ఈ ఘటన నిలిచింది. ఇక 2017 డిసెంబర్ 6వ న రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతానికి 20కి.మీ దూరంలో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. మొత్తం ఏడుగురు మావోయిస్టులు ఈ ఎదురు కాల్పులో మరణించారు. ఘటన జరిగింది మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లా సిరోంచి ప్రాంతంలో చోటు చేసుకుంది. అయితే ఆపరేసన్‌ను జరిపింది మాత్రం రాష్ట్ర గ్రేహౌండ్స్ పోలీసులేనని పోలీసు వర్గాలు ఆ సమయంలో తెలిపాయి. ముఖ్యంగా రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు ఏరియాకు వెళ్లి అక్కడ భద్రతను సమీక్షించాక ఆప్రాంతంలోనే మహారాష్ట్రకు చెందిన యాంటీ నక్సలైట్ విభాగం అధికారులతో సమావేశం జరిపారు. ఈసమావేశం జరిగిన రెండుమూడు రోజులకే సిరోంచిలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈఎన్‌కౌంటర్ జరిగిన మరుసటి రోజునే రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణపు పనులను అక్కడికి వచ్చి ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. కాగా గతేడాది డిసెంబర్ 14న భద్రాద్రి కొత్తగుడెం జిల్లా నల్లమడుగు అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 9మంది మావోయిస్టులు మరణించారు. వీరిని చంద్రపుల్లారెడ్డి వర్గానికి చెందిన మావోయిస్టులుగా పోలీసులు గుర్తించారు దాదాపు పదేండ్ల నుంచి పేరు లేకుండా పోయిన సీపీ గ్రూపు కార్యకలాపాలు ఒక్కసారిగా పెరిగాయని, ఈ గ్రూపును ఒకపక్కటి నక్షత్రి నాయకుడు కూర రాజన్న నిర్వహిసున్నాడని తమ విచారణలో తేలిందని పోలీసు ఉన్నతాధికారులు తెలుపడం గమనార్హం. ఇక తాజాగా భద్రాది కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసు స్టేషన్‌కు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఉసురు పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి భారీ ఎన్‌కౌంటర్ జరిగి 10 మంది మావోయిస్టులు మరణించడం సంచలనం రేపింది. ఈ ఆపరేషన్‌కు పూర్తిగా నేతృత్వం వహించింది రాష్ట్ర గ్రేహౌండ్స్ పోలీసులని అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌కు ఛత్తీస్‌గఢ్ యాంటీ నక్సలైట్ వింగ్ పోలీసులు కూడా సహకరించారని చెబుతున్నారు. కాని ఆపరేషన్‌కు పూర్తిగా స్కెచ్ గీసింది మాత్రం రాష్ట్ర ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ పోలీసు ఉనతాధికారులని విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఘటనలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్ మరణించడం పోలీసు అధికారులకు అశనిపాతమైంది. కాగా గతేడాది డిసెంబర్ 24న మావోయిస్టు అగ్రనేత, ఒడిషా రాష్ట్ర కమిటీ బాధ్యుడు, మిలట్రీ కమిషన్ ఇన్‌ఛార్జి అయిన జినుగు నర్సింహరెడ్డి ఎలియాస్ జంపన్న అతని భార్య సవితలు డీజీపీ ఎదుట లొంగిపోయారు. ఈయనతో పాటు మరో ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగుబాటలో నడుస్తున్నారని ఆ సమయంలో ఉన్నతాధికారులు తెలిపారు. కాగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఇద్దరిని ఇన్‌ఫార్మర్లుగా పేర్కొంటు మావోయిస్టులు హత్య చేయడం, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి జిల్లాల్లో ట్రాక్టర్లు తగుల బెట్టడం, మందుపాతరలు పెట్టడం వంటి చర్యలతో పోలీసు యంంత్రాంగం గత జనవరి నుంచే తీవ్రవాదులు కదలికలపై నిఘాను తీవ్రతరం చేసింది. అంతేగాక మావోయిస్టులు రాష్ట్రంలోకి అడుగు పెడితే ఖతమే నన్నది అంతర్గత దిశా నిర్దేశం తో రాష్ట్ర పోలీసులు పని చేస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. కాగా రాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై గ్రేహౌండ్స్, ఎస్ఐబీ అధికారులతో రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీశారని సమాచారం.

టచ్‌లో పెద్ద తలకాయలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవల తాను అమెరికా వెళ్లి ప్రవాస భారతీయులను కలిశానని, ఈ సందర్భంగా వారంతా తమ పార్టీకి సహకారం అందిస్తామని చెప్పినట్టు టీజేఏసీ ఛైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పారు. కొత్తగా రాబోయే పార్టీ నూతన ఒరవడితో రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. కొత్త పార్టీలో చేరేందుకు పెద్ద తలకాయలు టచ్‌లో ఉన్నారని, ఆ విషయాన్ని సరైన సమయం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన...తనను కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇతర పార్టీల నేతలు కూడా తనతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు.

ఇప్పటికే పార్టీ పనులు చురుకుగా జరుగుతున్నాయని, కార్యకర్తలు కూడా ఉత్సాహంగా పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు చేయాల్సినంత చేయడం లేదన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి పేరిట ఉత్తరాల ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. కేవలం హైదరాబాద్‌లోనే 20వేల ఉత్తరాల ఉద్యమం జరిగిందన్నారు. నిరుద్యోగులు రాసిన కొన్ని ఉత్తరాలను ఆయన చదివి వినిపించారు. 'ఉద్యోగాలు ఇచ్చుడో కేసీఆర్ చచ్చుడో' అని ఉత్తరాల ద్వారా విద్యార్థులు తమ నిరసనను తెలుపుతున్నట్టు చెప్పారు. ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగ కాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీలకు 60 సీట్లిస్తాం.. మీరిస్తారా..?

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సామాజిక న్యాయ లక్ష్యసాధనకు బీఎల్ఎఫ్ కట్టుబడి ఉంటుందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఛైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. దీనిలో భాగంగా 52శాతం ఉన్న బీసీలకు కనీసం 60 నుంచి 65 సీట్ల వరకూ కేటాయిస్తామనీ ఆయన స్పష్టం చేశారు. ఇదే స్థాయిలో బీసీలకు సీట్లు కేటాయించేందుకు కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు సిద్ధమా.? అని ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఎల్ఎఫ్ స్టీరింగ్ కమిటీ సభ్యులు జి రాములు, మాస్టార్జీ, జి నాగయ్య, కన్వీనర్ నాగరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి మూడున్నర ఏండ్లు దాటినా, నేటికీ ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదని నల్లా సూర్యప్రకాశ్ అన్నారు.

రూ.70వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న ప్రభుత్వం, నేడు రెండులక్షల కోట్ల అప్పులపాలైందని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, దళిత ముఖ్యమంత్రి...తదితర హామీల ఊసే లేకుండా పోయిందని తెలిపారు. 40 ఏండ్ల కాంగ్రెస్ పాలన కూడా అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టిందని అన్నారు. టీఆర్ఎస్ హయాంలో కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు, నాడు కాంగ్రెస్ పార్టీ పాలనలోనూ జరిగాయని చెప్పారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నా యంగా మార్క్స్, అంబేద్కర్ సిద్ధాంతాల కలయికతో బీఎల్ఎఫ్ ఏర్పడిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులకు పోటీకి అవకాశం కల్పించి సరికొత్త చరిత్రను బీఎల్ఎఫ్ సృష్టిస్తుందన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఎల్ఎఫ్ నిశబ్దవిప్లవం తీసుకొస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మంత్రివర్గంలో మహిళలను చేర్చుకోకుండా, మహిళోద్ధరణ గురించి ఉపన్యాసాలు ఇస్తే ఎవ్వరూ నమ్మరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖకు రెడ్డి కులానికి చెందిన మంత్రి, మహిళా, శిశు సంక్షేమశాఖకు పురుషుడు మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. జి రాములు మాట్లాడుతూ...సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం కోసం బీఎల్ఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ మినహా మిగిలిన శక్తులను బీఎల్ఎఫ్ ఐక్య పరుస్తుందని చెప్పారు. 14న హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.

అది చిన్న పొరపాటే

(మొదటిపేజీ తరువాయి)

సంకుచిత వ్యక్తిత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌ది కాదు అని చెప్పారు. మోడీ గాడు అనే మాట కేవలం దొర్లిన తప్పిందం మాత్రమేనన్నారు. పెద్ద ఉపన్యాసంలో చిన్న పొరపాటు మాట దొర్లిందన్నారు. దేశ ప్రధానిని అవమానించుకుంటే దేశాన్ని అవమానించినట్టేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైతులు, పేద ప్రజల కోసం ఏమీ చర్యలు తీసుకోలేదన్న ఆవేదనతోనే సీఎం కేసీఆర్ మాట్లాడారు తప్ప ఎవరినీ అవమానించడానికి కాదన్నారు. దీన్ని బీజేపీ నేతలు ఇంత రాద్ధాంతం చేయడం అనవసరమని, వారి రాజకీయ దిగజారుడుతనానికి ఇది నిదర్శనం అన్నారు.

దావోస్‌లో 600 కోట్ల మంది నాకు ఓటు వేశారని ప్రధాని తప్పు మాట్లాడారు. దేశంలో ఉన్నది 130 కోట్ల మంది మాత్రమే. ఇలా మాట దొర్లడం అందరికీ సహజమేనన్నారు.

హామీలపై గళం విప్పుతాంల

ఈ నెల 5వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తమ గళం వినిపిస్తామని కవిత తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రైతులు, పేదల ఆదాయం పెంచుతారని అనుకున్నామని, కానీ అందుకు పూర్తి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆమె అభిప్రాయ పడ్డారు. రానున్న రోజుల్లో రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ చెప్పారు కానీ.. దానికి సంబంధించిన ఎలాంటి బిల్లూ ఇప్పటి వరకు పార్లమెంటుకు రాలేదన్నారు. వ్యాపారానికి సంబంధించిన 30 బిల్లులు ఇప్పటివరకు పెట్టారు. కానీ వ్యవసాయానికి సంబంధించిన బిల్లును పెట్టలేదన్నారు. గతంతో పోల్చితే కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గాయన్నారు. రైతును యూనిట్ గా తీసుకొని ఇన్సూరెన్స్ చేయాలని తాము ఎప్పటి నుంచో కోరుతున్నామని గుర్తుచేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరామన్నారు. రైతుల కోసం ఇప్పటిదాకా కేంద్రం సరైన ప్రణాళిక వేయలేదన్నారు.

ఈ పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం నిధుల కోసం మాట్లాతామన్నారు. బడ్జెట్ సమావేశాలు పెట్టినప్పటి నుంచి టీఆర్ఎస్ తన గళం గట్టిగా వినిపించిందన్నారు. హైకోర్టు విభజన, ట్రైబల్ యూనివర్సిటీ ఇతర అంశాలపై పోరాటం సాగుతున్నదన్నారు. హార్టికల్చర్ యూనివర్సిటీకి నిధులు పెంచాలని అడిగామనీ, జీఎస్టీ వల్ల రాష్ట్రాలకు వచ్చిన నష్టాలను పూడ్చాలని చెప్పామని అన్నారు. చాలా రాష్ట్రాలకు బడ్జెట్ లో ఏ కేటాయింపులు లేవని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు రాష్ట్రంలోని సమస్యలపై పార్లమెంటులో పోరాడుతామన్నారు. విభజన చట్టంలోని అన్ని హామీలను కేంద్రం నెరవేర్చాల్సిందేనన్నారు.

విషాదం నింపిన హోలీ

నవతెలంగాణ-కంది/ సంగారెడ్డి టౌన్

అతివేగం ఐదుగురు ప్రాణాలను పొట్టనబెట్టుకుంది. మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఐఐటీ (హెచ్) సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం..సంగారెడ్డికి చెందిన మహేశ్ గుప్తా(28)కేతకీ డిజిటల్స్ పేరుతో ఈవెంట్ ఆర్గనైజింగ్, ఫ్లెక్సీ పబ్లిషింగ్ నిర్వహిస్తున్నాడు. అతడి వద్ద వెంకట్రామ్‌రెడ్డి(30), వెంకట్‌రెడ్డి(22), నరేందర్ (25), రాజు(25) పనిచేస్తున్నారు. హోలి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారంలో 'పిచికారి' పేరుతో తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాన్ని కాంట్రాక్టు తీసుకున్నాడు. సంగారెడ్డి నుంచి శుక్రవారం ఉదయమే వారంతా అక్కడకు కారులో వెళ్లారు. ఈవెంట్ అయిపోగానే మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత కారులో సంగారెడ్డికి బయల్దేరారు. కారును గుప్తా నడుపుతున్నాడు. ఐఐటీ(హెచ్) వద్దకు చేరుకోగానే మితిమీరిన వేగంతో ఉన్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలోనే కారు టైరు పేలిపోయి రాంగ్‌రూట్‌లో దూసుకెళ్లి జహీరాబాద్ నుంచి లింగంపల్లి వెళ్తున్న జహీరాబాద్ ఆర్టీసీ డిపో బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరు పరిస్థితి విషమించి చనిపోయారు. బస్సులోని ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి.అందులో కండక్టర్ లింగేశ్వర్ ఉన్నాడు. క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేశ్‌గుప్తా సహా చనిపోయిన వారందరూ సంగారెడ్డి వాసులే. అందులో నరేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మిగతా వారు అవివాహితులు. కారు అతివేగంగా వచ్చిందని, అదుపు కాక డివైడర్‌ను దాటుకుని బస్సును ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బస్సు డ్రైవర్ అప్రత్తమై బస్సును రోడ్డు కిందకు దించడంతో ప్రమాద తీవ్రత తగ్గిందన్నారు. సంగారెడ్డి, కంది పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను జేసీబీలతో పక్కకు తొలగించారు. డీఎస్పీ శ్రీనివాస్‌కుమార్ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఘటనాస్థలికి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించడంలో ఆయన సాయం చేశారు.

అంతర్మథనం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నేతలు అనేక సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రజలకు నష్టం జరిగితే నిలదీ యడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే ఇటీవల ప్రకటించిన కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగమూ కలగలేదు. మొండిచేయి చూపించింది. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను పట్టించుకోలేదు.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు పెట్టిన డిమాండ్లను విస్మరించింది. దీంతో కేంద్రంతో రాష్ట్రానికి లోపాయికారి ఒప్పందం జరిగిందని ఆరోపణలు రావడం, అదే సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేసిన ప్రస్తుత తరుణంలో టీఆర్ఎస్‌పార్టీ ఎంపీలు పార్ల మెంటులో ఎలా వ్యవహరిస్తారన్న దానిపై చర్చ జరుగుత ఎన్నది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం స్థాపన, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, అసెంబ్లీ స్థానాల పెంపు, ఎయిమ్స్, హైకోర్టు విభజన, ట్రైబల్ యూనివర్సిటీతో పాటు పలు అంశాలపై కేంద్రం నుంచి స్పష్టత రాలేదు. ఇంకా అసెంబ్లీలో చేసిన పలు తీర్మానాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మైనార్టీలకు

12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీలకు రిజర్వేషన్ల పెంపు, ఎస్సీల వర్గీకరణ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు ఈయేడాది జూన్ నుంచి అమలు చేయబోతున్న నాలుగువేల రూపాయల పెట్టుబడి పథకానికి సాయం వంటి డిమాండ్లు కేంద్రంవద్ద ఉన్నాయి. ఈఅంశాలపై గతంలో టీఆర్ఎస్ ఎంపీలు ప్రస్తావించినా గట్టిగా పట్టుబట్టిన సందర్భాలు లేవు. దీంతో పాటు మైనార్టీలకు రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదనను బీజేపీ వ్యతిరేకిస్తున్నది. అసెంబ్లీ స్థానాల పెంపుపై కేంద్రం స్పందించడం లేదు. రాష్ట్రానికి కేంద్రం నుండి ఎలాంటి మేలు జరగలేదని సీఎం , మంత్రులు, ఎంపీలు సహా చెబుతూనే మరోవైపు జీఎస్టీని, నోట్లరద్దు వాటిని మెచ్చుకోవడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.

కేంద్రంతో దోస్తీ లేదనకుంటూనే ప్రధానమంత్రిని ఆకాశానికెత్తడం పలు విమర్శలకు దారితీసింది. కేంద్రబడ్జెట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించకపోవడం మరింత అనుమానాలకు తావిచ్చినట్టయింది. వారం రోజుల ఢిల్లీ పర్యటనలో మాట మాత్రమైనా మాట్లాడకుండా గవర్నర్ వద్ద బడ్జెట్‌పై మండిపడినట్టు మీడియాలో కథనాలు రావడం చర్చనీయాంశమైంది. ఇటీవల ప్రధానమంత్రిపై ఘాటైన వ్యాఖ్యలు చేసి, ఆ తర్వాత అవి పొరపాటున దొర్లాయని ఆపార్టీ నేతలు వివరణ ఇచ్చుకుంటున్నారు. అయినా సమస్యలపై నిలదీస్తామని చెబుతున్నా, కేంద్రంతో అమితుమీకి సిద్ధమవుతారా అన్నది అనుమానమేనని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అయితే శనివారం నాటి సమావేశంలో కేసీఆర్ ఎంపీలకు ఏమి నిర్దేశిస్తారన్నది చర్చనీయాంశమైంది.

పోస్టుమార్టంను వీడియో తీయాలి:హైకోర్టు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తొండపాల్ అటవీ ఏరియాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలకు పోస్టుమార్టంపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మ తదేహాల్ని భద్రాచలం ఆస్పత్రికి తీసుకొని వచ్చి ఉంటే వాటికి పోస్టుమార్టం నిర్వహించేప్పుడు వీడియో చిత్రీకరణ చేయాలని ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ర మేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక వాటిని కుటుంబసభ్యులకు అందజేయాలని బెంచ్ ఆదేశించింది. మరణించిన వారిలో ఎంతమంది తెలంగాణ వారున్నారని బెంచ్ ఆరా తీసింది. తెలంగాణ వారుంటే వారి మృతదేహాల విషయంలో కూడా అదేవిధంగా చేయాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్ ఆదేశించింది.

మ తదేహాలకు వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆస్పత్రులో పోస్టుమార్టం నిర్వహించాలి. ఎన్‌కౌంటర్‌పై సీబీఐతో దర్యాప్తునకు ఆదేశించాలి. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై 302 (హత్యానేరం) కింద కేసు నమోదు చేయాలి... అని కోరుతూ పౌర హక్కుల కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన అత్యవసర ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ భోజన విరామ సమయంలో విచారణ జరిపింది. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది మావోయిస్టులు మరణించారని, అందులో హరిభూషణ్ అనే మావోయిస్టు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. ఫోరెన్సిక్ వైద్యుడు భద్రాచలం ఆస్పత్రిలో లేనందున వరంగల్‌లో పోస్టుమార్టానికి ఆదేశించాలని కోరారు. ఎన్‌కౌంటర్ ఘటన తెలంగాణ రాష్ట్రంలో జరగలేదని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని హుసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని తెలంగాణ ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు చెప్పారు. హైకోర్టు పరిధిలోకి ఘటన లేదన్నారు. మృతదేహాల్ని భద్రాచలం ఆస్పత్రికి తీసుకొచ్చినందున తాము జోక్యం చేసుకోవచ్చునని బెంచ్ స్పష్టం చేసింది. భద్రాచలంలో అన్ని వసతులున్నాయని చెప్పారు. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు వేయాలని ఆదేశించింది.

రాజ్యసభ రేసులో కాంగ్రెస్?

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాలకు సంబంధించిన వ్యక్తులకు ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి తెచ్చింది. దీనిపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు స్పష్టత ఇస్తే మద్దతు ఇవ్వాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీయే ఆ కుటుంబాలను నుంచి ఒక వ్యక్తిని బరిలోకి దించాలని యోచిస్తున్నది. అధికార పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని ప్రకటించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణకు 24, ఏపీకి 9 టీఎంసీలు


(మొదటిపేజీ తరువాయి)

సాగునీటిని అందించవలసి ఉందని కూడా తెలంగాణ వివరించింది.

తెలంగాణ వాదన సరికాదు.. ఏపీ

శుక్రవారం జలసౌధలో జరిగిన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు ఏపీ అధికారులు తెలిపారు. నీటి వినియోగానికి సంబంధించి తెలంగాణ అధికారులు బోర్డుకు అందచేసిన వివరాలతో తాము ఏకీభవించటం లేదన్నారు. తాగు, సాగునీటి అవసరాలకు ఏపీకి మరో 26 టీఎంసీలు కావాలని వారు కోరారు. బోర్డు త్రిసభ్య కమిటీ సోమవారం మళ్ళీ సమావేశమై పూర్తి స్థాయిలో లెక్కలను పరిశీలిస్తుందని తెలిపారు. నీటి కేటాయింపులు మళ్ళీ జరుగుతాయన్నారు.

సెన్సెక్స్ ▼137	నిఫ్టీ ▼39	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు
34,046	10,458	66.16	రూ. 30,192	రూ. 41,600	హైదరాబాద్ 355, ఒక్కగుడ్డుకు 4.15, వరంగల్ 357, విజయవాడ 348, చెన్నై 395, ముంబయి 340






గురువారం మార్కెట్లు ముగిసే సమయానికి

'మీ' స్మార్ట్‌టీవీ రూ.13,000!



ముంబయి: భారత్‌లోని టీవీ మార్కెట్‌పై కన్నేసిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ షియోమి మధ్య తరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకొని మిడ్ రేంజ్ టీవీలను మార్కెట్లోకి తీసుకు రానున్నట్టుగా సమాచారం. ఇందులో భాగంగా రూ.15 వేల కంటే తక్కువ ధరలోనే 32 అంగుళాల టీవీని మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టుగా తెలుస్తోంది. హైడెఫినేషన్ (హెచ్‌డీ) క్వాలిటీతో రూ.12,999కే 32 అంగుళాల స్మార్ట్ టీవీని సంస్థ మార్కెట్లోకి తేనుందని ప్రముఖ టెక్నాలజీ వార్తా సంస్థ ఐగ్యాన్ ప్రచురించింది. ఇందులో 1 జీబీ ర్యామ్‌తో పాటు 4జీబీ ఇంటర్నల్ మెమోరీ సౌలభ్యం ఉండనున్నట్టుగా తెలిపింది. దీనికి తోడు రూ.21,999 లకే 43 అంగుళాల ఫుల్ హెచ్‌డీ టీవీని అందించే అవకాశం ఉందని పేర్కొంది. ఇందులో 2 జీబీ ర్యామ్, 8జీబీ ఇంటర్నల్ మెమోరీ అందుబాటులో ఉంటాయని ఐగ్యాన్ తెలిపింది. అత్యాధునిక బ్లూటూత్ వెర్షన్, వైఫై సౌకర్యాలు ఈ టీవీకి అదనపు హంగులుగా నిలువనున్నాయి. ఎంఐ 4ఏ సిరీస్‌లో వీటిని లాంచ్ చేసే అవకాశం ఉంది. మార్చి 7న వీటిని అధికారికంగా లాంచ్ చేయనున్నట్లు సంస్థ తన అధికారిక యాప్‌లో ప్రకటించింది.

పని చేయని స్టాక్ మార్కెట్లు



ముంబయి: హోలీ పండుగ పురస్కరించుకొని శుక్రవారం స్టాక్ మార్కెట్లు పని చేయలేదు. ద్వితీయ మార్కెట్లతో పాటుగా బులియన్, కమోడిటీ మార్కెట్లు శుక్రవారం పని చేయలేదు. మూడు రోజుల వరుస సెలవులతో కూడుకున్న లాంగ్ వీకెండ్ తరువాత (శుక్ర, శని, ఆది) మార్కెట్లు తిరిగి సోమవారం తెరుచుకోనున్నాయి. వరుస సెలవుల నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో గురువారం సెన్సెక్స్ 137 పాయింట్లు నష్టపోయి 34046.94 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 34.50 పాయింట్లు క్షీణించిన 10458.35 పాయింట్ల వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

'రియల్'గా సహకరిస్తాం..

- స్థిరాస్తి రంగం అభివృద్ధికి పలు చర్యలు
- సవాళ్ల పరిష్కారానికి వివిధ సంస్కరణలు
- ప్రపంచ నగరంగా హైదరాబాద్ సిటీ
- క్రెడాయ్ ప్రాపర్టీషో ప్రారంభోత్సవంలో ఈటల
- రియల్ ఎస్టేట్‌కూ టీఎస్-ఐపాస్ : క్రెడాయ్
- మొదలైన స్థిరాస్తి ప్రదర్శన



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలోనే ఉత్తమ నివాసయోగ్యమైన నగరం హైదరాబాద్ అని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఢిల్లీ, ముంబై, చెన్నైలకంటే కూడా నివాసయోగ్య నగరం భాగ్యనగరమని, అధిక కాలుష్యం లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం హైదరాబాద్ సొంతం అని వివరించారు. అన్ని తరగతుల వారు ఇక్కడ ఇండ్లను కొనుక్కొని బతుకుతున్న పరిస్థితి భాగ్యనగరంలోనే ఉన్నట్టుగా తెలిపారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో 'కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'(క్రెడాయ్) ఏర్పాటు చేసిన 6వ హైదరాబాద్ ప్రాపర్టీషోను ఆయన శుక్రవారం ప్రారంభించారు. 'రైజింగ్ హైదరాబాద్' థీమ్‌తో ప్రారంభమైన ఈ ప్రాపర్టీషో ఆదివారం (4వ తేదీ) వరకు కొనసాగనుంది. ఈ ప్రాపర్టీషోలో దాదాపు 120 డెవలపర్లు పలు ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. రాష్ట్రంలో స్థిరాస్తి రంగం కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని.. వాటిని దూరం చేసి పరిశ్రమ రానున్న రోజుల్లో మరింతగా విస్తరించేందుకు గాను తాము అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్టగా ఆర్థిక మంత్రి వివరించారు.

జీఎస్టీ తగ్గింపు దిశగా కృషి..


దేశంలో వ్యవసాయం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న స్థిరాస్తి రంగంపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ) భారం అధికంగా ఉండడం పట్ల ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. స్థిరాస్తి రంగానికి తక్కువ జీఎస్టీని వర్తింపజేయాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్టుగా ఆయన వివరించారు. ఇందులో భాగంగా రానున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్టుగా మంత్రి తెలిపారు. ప్రస్తుతం స్థిరాస్తి రంగంపై 12 శాతం జీఎస్టీ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ డ్యూటీ ఆరు శాతంగా ఉంది. దీనిని మొత్తంగా ఆరు శాతానికి కుదించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. కేవలం చౌక ధరల గృహ నిర్మాణాలు చేపట్టే వారికే ప్రస్తుతం 8 శాతం జీఎస్టీ వర్తిస్తోంది.

ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు రామ్‌రెడ్డి మాట్లాడుతూ నాలా పన్ను, విద్యుత్తు టారీఫ్‌తో పాటు జీఎస్టీ తదితర అంశాలు స్థిరాస్తి రంగాన్ని బాగా ప్రభావితం చేస్తున్నట్టుగా తెలిపారు. ఈ విషయంలో సర్కారు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ త్వరలో వ్యాపార నిర్వహణ సులభతరం చేసేందుకు గాను వివిధ రంగాలలో సవరణలు తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ విభాగం ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణారావు మాట్లాడుతూ నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో సరసమైన ధరలకు ప్రజలకు గృహాలను అందించేందుకు గాను స్థిరాస్తిపై జీఎస్టీ భారాన్ని 12 నుంచి 8 శాతానికి కుదించాలని కోరారు. ఈ చర్య వల్ల స్థిరాస్తి రంగానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

పరిశ్రమ హోదా కల్పించండి: క్రెడాయ్

స్థిరాస్తి రంగం వేగంగా విస్తరించేందుకు గాను సర్కారు ఈ రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలని క్రెడాయ్ సర్కారుకు విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం స్థిరాస్తి రంగానికి రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకులు విముఖత చూపుతున్నాయని పరిశ్రమ హోదాతో ఈ సమస్య దూరమవుతుందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీఎస్-ఐపాస్ విధానాన్ని స్థిరాస్తి రంగానికి కూడా వర్తింపజేయాలని ఆయన కోరారు. ఫలితంగా సింగ్ విండో విధానంలో అనుమతులు మంజూరవడమే కాకుండా పరిశ్రమ ఎదుగుదలకు ఇది దోహదం చేస్తుందని క్రెడాయ్ పేర్కొంది.

నీరవ్‌పై ఒత్తిడి తేవొద్దు..



న్యూయార్క్: పీఎన్‌బీ స్కామ్‌లో ప్రధాన నిందితుడు ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి అమెరికా కోర్టులో పెద్ద ఊరట లభించింది. ఆయనకు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ అమెరికాలోని కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. శుక్రవారం స్థానిక కోర్టు ఈ అంశంపై విచారణ చేపట్టింది. రుణదాతలు నీరవ్ దగ్గర నుంచి రుణాలను ఇప్పుడే వసూలు చేయొద్దని.. అతడి మీద ఎటువంటి ఒత్తిడి తీసుకురావద్దని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెండు పేజీల నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం నీరవ్‌కు రుణాలు ఇచ్చిన రుణదాతలు ఆయన దగ్గర నుంచి డబ్బులు తిరిగి తీసుకోవడం కష్టతరం కానుంది. ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటివి కూడా చేయడానికి వీలుపడదు. నీరవ్‌పై రుణదాతలు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకునే పిటిషన్లు దాఖలు చేయకూడదని కోర్టు ఆదేశించింది. రుణం చెల్లించాల్సిందిగా రుణగ్రహీతకు ఫోన్, మెయిల్‌లో కూడా డిమాండ్ చేయకూడదని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తే రుణదాతలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది.

బీవోబీపై దక్షిణాఫ్రికా సీరియస్!



జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడి రాజీనామాకు దారితీసిన గుప్తా కుంభకోణంలో కీలక భూమిక పోషించినట్టుగా అభియోగాలు ఎదుర్కొంటున్న భారత్‌కు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడాపై (బీవోబీ) అక్కడి రాజకీయ పార్టీలు సీరియస్ అవుతున్నాయి. స్కామ్ నేపథ్యంలో దక్షిణాఫ్రికాలోని ప్రతిపక్ష పార్టీ డెమెక్రాటిక్ అలయన్స్ (డీఏ) బీఓబీ పై క్రిమినల్ చర్యలకు సిద్ధపడుతున్నట్టుగా సమాచారం. బీవోబీలో సీనియర్ బ్యాంకు అధికారులు గుప్తా కుటుంబ యాజమాన్యంలోని కంపెనీలతో సహా, సహారా గ్రూపుకు చెందిన వివిధ కంపెనీలకు దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వ సంస్థల నుండి పెద్ద ఎత్తున, వివరణ లేని చెల్లింపులు జరిపారన్నది అక్కడి పార్టీల ప్రధాన ఆరోపణ. ఈ విషయంలో జూనియర్ ఉద్యోగులు లేవనెత్తిన అనుమానాస్పద లావాదేవీల నివేదికలను (ఎస్ఆర్ఎస్) అధికారులు ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారని విమర్శిస్తోంది. జోహన్నెస్‌బర్గ్‌లో బీవోబీ బ్రాంచ్‌లో ఈ అక్రమ లావాదేవీలు ఎక్కువగా 2016 లో నమోదైనట్టుగా స్థానిక మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డీఏ డిమాండ్ చేస్తోంది. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ చట్టం 29 , 52 సెక్షన్ల ప్రకారం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది.

పారిస్ రైల్వేస్టేషన్‌లో...

భారతీయ వజ్ర వ్యాపారుల నిలువుదోపిడి



పారిస్: వ్యాపార సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లిన ఇద్దరు భారతీయ వజ్ర వ్యాపారులపై దొంగలు దాడి చేసి విలువైన ఆభరణాలను దోచుకున్నారు. ఈ ఘటన పారిస్‌లోని మెట్రో రైల్వేస్టేషన్లో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... వ్యాపార పనుల నిమిత్తం పారిస్‌కు వచ్చిన ఇద్దరు భారతీయ వ్యాపారులు పని ముగించుకొని పారిస్‌లోని మెట్రో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారిని గమనిస్తున్న కొంతమంది వజ్రాల దొంగల ముఠా వ్యాపారుల వద్దకు వచ్చి మారణాయుధాలతో బెదిరించారు. వారి వద్దనున్న రూ. 2.40 కోట్ల విలువైన ఆభరణాలున్న బ్యాగులను దొంగిలించారు. కొన్నేండ్లుగా పారిస్ నగరంలో వజ్రాల దొంగలు అధికమయ్యారు. దీనికి సంబంధించిన ఓ ముఠా.. వజ్రాల వ్యాపారులను మారణాయుధాలతో బెదిరిస్తూ వారి వద్దనున్న వజ్రాలను దొంగిలిస్తున్నారు. ఘటనకు సంబంధించి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా టీఆర్టీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించింది. శుక్రవారం ఉదయం హెచ్ఎండీఏ పరిధిలో రెండు కేంద్రాల్లో ఎస్జీటీ (బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళం) మాధ్యమం అభ్యర్థులకు నిర్వహించిన పరీక్షకు 2,284 మంది దరఖాస్తు చేయగా, 2,161 (94.6 శాతం) మంది పరీక్ష రాశారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం హెచ్ఎండీఏ పరిధిలో ఒక కేంద్రంలో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) తెలుగు మాధ్యమం పరీక్షకు 922 మంది దరఖాస్తు చేస్తే, 557 (60.4 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. టీఆర్టీ రాతపరీక్షలను కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

నేడు ఆన్‌లైన్‌లో స్కూల్ అసిస్టెంట్

టీఆర్టీ రాతపరీక్షల్లో భాగంగా శనివారం ఆన్‌లైన్‌లో స్కూల్ అసిస్టెంట్ రాతపరీక్షలు జరుగుతాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ తెలిపారు.

శనివారం ఉదయం హెచ్ఎండీఏ పరిధిలో రెండు కేంద్రాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, బయోసైన్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసిన (హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం) మాధ్యమం అభ్యర్థులు 1,643 మంది హాజరవుతారని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం హెచ్ఎండీఏ పరిధిలో ఒక కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ (ఇంగ్లీష్ మాధ్యమం) అభ్యర్థులు 638 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా బాయర్-ఆర్‌వీజే అగ్రికల్చర్ స్కూల్ స్నాతకోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాయర్-ఆర్‌విజె స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ 18వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. సురేష్ ప్రొడక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డి సురేశ్‌బాబు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారం సూపర్‌మార్కెట్ల నుంచి వస్తోందని నేటితరం పిల్లలు భావిస్తున్నారని తెలిపారు. వ్యవసాయం, పంటలపై సరైన అవగాహన లేదని పేర్కొన్నారు. భారత్‌లో వ్యవసాయమే ప్రాథమిక రంగమని తెలిపారు. అందరికీ ఆహారాన్ని అందిస్తున్నది అన్నదాతలేనని పేర్కొన్నారు. బాయర్-ఆర్‌విజె స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నుంచి ఫామ్ అసిస్టెన్స్ కోర్సు పూర్తి చేసిన 37 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి అధ్యక్షుడు డిఎన్ రావు, ప్రధాన కార్యదర్శి బి శరత్‌గోపాల్, డిఆర్ఎన్‌విజెఐఆర్‌డి సలహామండలి అధ్యక్షుడు సిహెచ్ అచ్యుతరామప్రసాద్, బాయర్-ఆర్‌విజె డైరెక్టర్ అర్జున్‌రావు, బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అదాని చేతికి అంబానీ 'పవర్'!

వాటా విక్రయానికి స్టాక్‌హోల్డర్లు సై

- ఒప్పంద విలువు 18,800 కోట్లు
- కాస్త తీరనున్న అనిల్ రుణ భారం


(ఫైల్)

న్యూఢిల్లీ: అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రాకు చెందిన ముంబయి పవర్ బిజినెస్ అదాని చేతుల్లోకి చేరిపోయేందుకు మార్గం సుగమమైంది. ముంబయి పవర్‌ను అదాని ట్రాన్స్‌మిషన్‌కు విక్రయించేందుకు గాను రిలయన్స్ ఇన్‌ఫ్రా వాటాదారులు మెజార్టీ మంది సమ్మతి తెలిపారు. పవర్ బిజినెస్‌లో పూర్తి వాటా విక్రయపు ప్రతిపాదనకు 94 శాతం మంది వాటాదారులు తమ అంగీకారం తెలిపినట్టుగా రిలయన్స్ ఇన్‌ఫ్రా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో తమ ముంబయి పవర్ బిజినెస్‌లోని 100 శాతం వాటాను అదాని సంస్థకు అప్పగించనున్నట్టుగా రిలయన్స్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. ఈ వ్యవహారం మొత్తం విలువ దాదాపు రూ.18,800 కోట్లు. ఈ కొనుగోలుతో ముంబయి, దాని చుట్టుపక్క పట్టణాల్లోని 30 లక్షల మంది నివాసులకు, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు దాదాపు 1,800 మెగా వాట్ల విద్యుత్ సరఫరా అంశం అదాని ట్రాన్స్‌మిషన్ చేతుల్లోకి వెళ్లనుంది. వాస్తవానికి రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అదాని ట్రాన్స్‌మిషన్‌లు 2017 డిసెంబర్‌లోనే ఈ పవర్ విక్రయపు ఒప్పందంపై సంతకాలు చేసినప్పటికీ రెగ్యులేటరీ అనుమతుల్లో భాగంగా రిలయన్స్ ఇన్‌ఫ్రా తమ వాటాదారుల అనుమతి తీసుకోవడం విశేషం. ఈ కొనుగోలు ఒప్పందానికి ఫెయిర్ ట్రేడ్ రెగ్యులేటర్ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి నెలలో ఆమోదం తెలిపింది. పవర్ బిజినెస్ విక్రయం ఒక కొలిక్కి వస్తే ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీకి కాస్త ఉరట లభించనుంది. ఈ డీల్‌తో లభించే సొమ్ము మొత్తాన్ని తాము అప్పులు చెల్లించేందుకు గాను ఉపయోగించనున్నట్టుగా కంపెనీ ఇప్పటికే వెల్లడించింది.

ప్రసారభారతిపై కక్షసాధింపు

రెండు నెలలుగా జీతభత్యాలు లేక ఉద్యోగస్తులకు అవస్థలు



న్యూఢిల్లీ : తాము చెప్పినట్టు వినటం లేదని, ఆడమన్నట్టు ఆడటం లేదని ప్రసారభారతిపై కేంద్రం కక్షగట్టింది. ప్రసారభారతి(దూరదర్శన్, రేడియో)కి విడుదల చేయాల్సిన నిధుల్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ నిలిపేసింది. దీంతో దూరదర్శన్ ఉద్యోగస్తులకు రెండునెలలుగా జీతాలు ఇవ్వడానికి పరిస్థితి కష్టంగా మారింది. సంస్థలోని అత్యవసర నిధుల్ని ఖర్చుచేసి జనవరి, ఫిబ్రవరి జీతాలు అందజేయాల్సి వచ్చింది.

దీనిపై 'ద వైర్' కథనం ఇలా ఉంది...2017-భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేడుకల ప్రసార హక్కుల్ని దూరదర్శన్‌కు కాకుండా, ముంబయికి చెందిన 'ఎస్ఓఎల్ ప్రొడక్షన్స్ ప్రై.లిమిటెడ్' అనే కంపెనీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ప్రభుత్వ సంస్థ అయిన తమను కాదని ప్రయివేటుకు అప్పజెప్పటమేంటని దూరదర్శన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. వేడుకల్ని ప్రత్యక్ష ప్రసారం చేసినందుకు రూ.2.92 కోట్లను ప్రయివేటు సంస్థకు చెల్లించలేమని దూరదర్శన్ తెలిపింది. దీనిని మనసులో పెట్టుకున్న కేంద్రం, ఇప్పుడు ప్రసార భారతి(దూరదర్శన్, రేడియో)పై కక్షసాధింపు చర్యలకు దిగుతోంది.

ప్రభుత్వ ఆధీనంలో నడిచే ప్రసారభారతి ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగినది. గ్రాంట్ల రూపంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ నిధులు ఇవ్వాల్సిందే. కానీ కేంద్రం కక్ష సాధింపు తీరు వల్ల గత రెండు నెలలుగా (జనవరి, ఫిబ్రవరి) ప్రసారభారతి ఉద్యోగస్తులకు నెల జీతాలు ఇవ్వటం కష్టంగా మారిందని స్వయంగా సంస్థ చైర్మన్ సూర్యప్రకాష్ 'ద వైర్'కు తెలియజేశారు. ఏప్రిల్ కల్లా నిధుల సమస్య తీర్చకపోతే, అటు తర్వాత తామేమీ చేయలేమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

అదంతా తప్పుడు ప్రచారం : కేంద్రం

ప్రసారభారతి (దూరదర్శన్, రేడియో) పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ నిధులు విడుదల చేయట్లేదన్న ఆరోపణల్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఖండించింది. "కావాలనే...ఒక దురాలోచనతో ఈ చెడు ప్రచారం మాపై చేస్తున్నారు. తప్పుడు సమాచారంపై ఆధారపడి, అవాస్తవాల్ని ఆధారంగా చేసుకొని కథనాలు రాస్తున్నారు. దీనివల్ల ప్రజల దృష్టిలో కేంద్ర సమాచార, ప్రసారశాఖ పలుచనవుతోంది"అని కేంద్రం శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. గతకొంతకాలంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖకు, ప్రసారభారతికి మధ్య ఉప్పునిప్పుగా పరిస్థితి తయారైంది. దీనిపై జాతీయ మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి.

13న పరీక్ష వాయిదా వేయండి

- ఇంటర్ బోర్డు కార్యదర్శికి విద్యార్థి సంఘాల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 13న జరిగే రాష్ట్రబంద్ సందర్భంగా అదేరోజు నిర్వహించే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్‌ను విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. అనంతరం రుద్రవరం లింగస్వామి (ఎంఎస్ఎఫ్), కోట రమేష్ (ఎస్ఎఫ్ఐ), ఎం పరుశురాం (పీడీఎస్‌యూ), వేణు (ఏఐఎస్ఎఫ్), కోట శ్రీనివాస్ (టీవీఎస్), జూపాక శ్రీనివాస్ (పీడీఎస్‌యూ), మద్దిలేటి (టీవీవీ), కృష్ణమాదిగ (టీఎస్‌యూ), కంచర్ల బద్రి (డీఎస్‌యూ), గోవింద్ నరేష్ మాదిగ (ఎంఎస్ఎఫ్), సగరపు ప్రసాద్ (టీఎన్ఎస్ఎఫ్) సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసనగా ఈనెల 13న ఎమ్మార్పీఎస్ చేపట్టే రాష్ట్రబంద్‌కు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయని తెలిపారు. ఈ బంద్‌కు రాజకీయ పార్టీలు, విద్యార్థి, కుల, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ఈనెల 13న జరిగే పరీక్షను వాయిదా వేసి బంద్‌కు సహకరించాలని కోరారు. బంద్ సందర్భంగా రవాణా వ్యవస్థ స్తంభించడం వల్ల విద్యార్థులు పరీక్షకు హాజరుకాకుండా నష్టపోతారని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 13న జరిగే పరీక్షను వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సయమంలో బంద్ ప్రకటించిన సందర్భాల్లో ఇంటర్ పరీక్షలను నాటి ప్రభుత్వం వాయిదా వేసిందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ, ఎమ్మార్పీఎస్‌పై నిర్బంధానికి వ్యతిరేకంగా 4న 'విరసం' సదస్సులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమాన్ని బలపర్చడమేగాక, ఎమ్మార్పీఎస్‌పై పోలీస్ నిర్బంధానికి వ్యతిరేకంగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఈనెల నాలుగున ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించనుంది. హైదరాబాద్‌లోన బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ఈసదస్సులు ప్రారంభమవుతాయి. ప్రధానంగా నాలుగు అంశాలపై విరసన ప్రణాళిక రూపొంచింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ-రాజ్యాంగం, వివిధ కమిషన్లు అంశంపై ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు ప్రసంగిస్తారు.

వర్గీకరణ ఉద్యమం-సాహిత్య ప్రతిఫలనం అంశంపై డాక్టర్ డి.ఉదయ్‌భాను, వర్గకరణ ఉద్యమంలో మహిళల పాత్రపై రత్నమాల మాట్లాడతారు.వీటికి గీతాంజలి అధ్యక్షత వహిస్తారు. అలాగే భోజన అనంతరం వర్గీకరణ ఉద్యమ నేపథ్యంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రసంగిస్తారు. ఇకపోతే వర్గీకరణ ఉద్యమంపై రాజ్యనిర్బంధంపై వరవరరావు మాట్లాడతారు. ఈ సదస్సులకు సి.కాశీం అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులను విజయవంతం చేయాలని విప్లవ రచయితల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో నగర ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

హక్కుల సాధనకు ఏకమవుదాం : జాజుల శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో, రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సమాన వాటా దక్కడం లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హక్కుల సాధనకు ఏకమవుదామని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ భవనంలో బీసీ సంఘాల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘాల జేఏసీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీసీ మంత్రులు నివేదిక రూపొందించి మూడు నెలలు గడిచినా అమలు చేయడం లేదన్నారు. ఆ నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నెలరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తోందని, ఎంబీసీ కార్పొరేషన్ నిధుల విడుదల ఏదని ప్రశ్నించారు. బీసీ భవన్‌కు మోక్షమెప్పుడని ప్రభుత్వాన్ని అడిగారు. ప్రధాని బీసీ ఉన్నా న్యాయం జరగడం లేదన్నారు. హక్కులను యాచించి కాకుండా శాసించి సాధించుకోవాలని అన్నారు. బీసీలను జాగృతం చేసేందుకు అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా రథయాత్ర చేపడతామని చెప్పారు. గోశిక యాదగిరి (పద్మ శాలి), ఎఆర్ మల్లయ్య (గంగపుత్ర సంఘం), కుందారం గణేష్ (విశ్వబ్రాహ్మణ సంఘం), మల్లయ్య (మత్స్యకారుల సంఘం), బంగారు నర్సింహ్మ (సగర ఉప్పర సంఘం), రంగాచారి (స్వర్ణకార్ల సంఘం) తదితరులు పాల్గొన్నారు.

ఒక్కక్లిక్ తో వీడియోలు డౌన్ లోడ్....

నచ్చిన వీడియోను యూట్యూబ్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవడానికి ఒక్కొక్కరు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఆలా డౌన్ లోడ్ చేసుకోవాడానికి చాలా మంది ప్రత్యేకంగా అప్లికేషన్ లు వాడుతుంటారు. ఎలాంటి అప్లికేషన్ లు అవసరం లేకుండా కేవలం ఒక్క క్లిక్ తో యూట్యూబ్ నుంచి వీడియోలు ఇట్టే డౌన్ లోడ్ కావాలంటే ఆ వీడియో లింక్ లో www. తీసేసీ ss టైప్ చేసి ఎంటర్ నొక్కండి. వెంటనే డౌన్ లోడ్ బటన్ ప్రత్యక్షమవుతుంది. మీకు కావాలసిన ఫార్మట్ లో వీడియోని 720p HD క్వాలిటీలో పొందవచ్చు. en.savefrom.net లోకి వెళ్లి అదే యూట్యూబ్ వీడియో లింక్ ను పేస్ట్ చేసి ఎంటర్ ఇస్తే చాలు. సేమ్ క్వాలిటీలో వీడియో డౌన్ లోడ్ అవుతుంది.

ఫేస్ బుక్ నుంచి వీడియోలు పొందండిలా. ..

ఫేస్ బుక్ నుంచి వీడియోలు పొందడానికి www.fbdown.net చాలా సులువైన మార్గం. ఫేస్ బుక్ వీడియో లింకును తీసుకువచ్చి ఈ సైట్లో కనిపించే బాక్స్ లో వేయడమే మన పని. వెంటనే డౌన్ లోడ్ అయిపోతుంది..



'వ్యూ ఇమేజ్ 'బటన్ కనిపించడం లేదా ?



నెట్ నుంచి మనకు ఏదైన ఇమేజ్ కావాలంటే గూగుల్ లో సెర్చ్ చేస్తాం. ఇమేజెస్ కేటగిరి నుంచి మనకు కావాల్సిన ఫొటోలను వెతుకుతాం. సెర్చ్ రిజల్ట్‌లో కనబడే ' వ్యూ ఇమేజ్' ఆప్షన్లను కొంత మందే వాడతారు. ఇకపై 'వ్యూ ఇమేజ్' ట్యాబ్ కనిపించదు. వారం రోజుల క్రితం గూగుల్ getty Images తో చేసుకున్న ఒప్పదం ప్రకారం ఈ బటన్‌ను తీసేయాలని గూగుల్ నిర్ణయించింది. అయితే దీన్ని క్లిక్ చేయగానే ఇమేజ్ మథర్ సైట్ నుంచి న్యూ విండోలో ఓపెన్ అయ్యేది. ఇక అవకాశం ఉండదు. ఖచ్చితంగా మథర్ సైట్‌కే వెళ్లి క్వాలిటీ ఇమేజ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీన్ని అదిగమించడానికి 'జోషా' అనే ఆస్ట్రేలియన్ విద్యార్థి ' వ్యూ ఇమేజ్ ' ఎక్స్‌టెన్షన్ తయారు చేశారు. గూగుల్, ఫైర్‌ఫాక్స్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వ్యూ ఇమేజ్ బటన్‌ను తిరిగి మీ సెర్చ్ బ్రౌజర్‌లో చూడవచ్చు.

ట్విట్టర్ యూజర్లకు గుడ్ న్యూస్



ట్విట్టర్ తన యూజర్ల కోసం అద్భుతమైన ఫీచర్ లాంచ్ చేసింది. ఏదైనా ట్వీట్‌ను సేవ్ చేయడానికి 'book mark tweet' ను అందు బాటులోకి తెచ్చింది. దీంతో సైట్ లేదా యాప్‌లో యూజర్లు తమకు నచ్చిన ట్వీట్లను బుక్ మార్క్స్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. ప్రతి ట్వీట్ కింద కొత్తగా షేర్ ఐకాన్ క్రియేట్ చేసింది. దానిపై ట్యాప్ చేస్తే వచ్చే మెనూలో Add Tweet to Bookmarks అనే ఆప్షన్‌పై క్లిక్ చేయగానే ట్వీట్ బుక్ మార్క్ అవుతుంది. సేవ్ అయిన ట్వీట్‌ను కావాలనుకున్నప్పుడు ఓపెన్ చేసి రీడ్ చేయొచ్చు. సంవత్సరం కాలంగా టెస్టింగ్‌లో ఉన్న ఈ ఫీచర్ ఈ వారం లాంచ్ చేసి యూజర్లకు అందుబాటులో ఉంచింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్, ట్విట్టర్ లైట్ యూజర్లకు ఇది ఇప్పుడు అందుబాటు ఉంది.

యూజర్లను ఆకట్టుకోవడానికి వాట్సాప్ కొత్త కొత్త ఫీచర్లను అందుబాటులోకి తెస్తోంది. అప్‌డేట్ ఫీచర్లను విడుదల చేస్తూ మరింత క్రేజ్ సంపాదిస్తోంది. ఇన్‌స్టంట్ మెసేజింగ్ కేటగిరీలో ఇప్పుడు ఫస్ట్ ప్లేస్‌లో ఉన్న వాట్సాప్ వరుస ఫీచర్లతో సంచలనాలు సృష్టిస్తోంది. ఇటీవలే వాట్సాప్ పేమెంట్స్‌ని పరిచయం చేసి తమ మార్క్ వేసుకొని ఈ వారంలో మరిన్ని వెర్షన్లతో అదుర్స్ అనిపిస్తోంది. ఇటీవల వాట్సాప్ విడుదల చేసిన ఫీచర్లు, అప్‌డేటెడ్ వెర్షన్లపై టెక్‌ప్లస్ స్టోరీ...



ఫీచర్స్ అదుర్స్

వాట్సాప్‌ను ఫేస్‌బుక్ కంపెనీ 2014 టేకోవర్ చేసిన విషయం తెలిసిందే.. తర్వాత ఈ ఆప్ నెటిజన్లకు మరింత దగ్గరయింది. ప్రపంచ వ్యాప్తంగా రెండు వందల కోట్ల మంది వాట్సాప్ యూజర్లు ఉన్నట్టు ఫేస్‌బుక్ సీఈఓ జూకర్ బర్గ ఇటీవల తెలిపారు. ఇండియాలో అయితే 20 కోట్ల మంది యాక్టివ్ వినియోగదారులు దీన్ని ఉపయోగించుకుంటున్నారు. మెసేజింగ్‌లో రంగంలో అత్యధిక ప్రాచుర్యం పొందిన వాట్సాప్ ఎప్పటికప్పుడూ కొత్తకొత్త ఫీచర్లతో దూసుకెళ్తోంది. అండ్రాయిడ్, ఐఓస్, విండోస్ కోసం కొత్త కొత్త ఫీచర్లు విడుదల చేస్తూ ఆకట్టుకుంటోంది.

ఐఓఎస్‌లో

ఇక టైం, లోకెషన్ స్టికర్స్ : వాట్సాప్ ఐఫోన్ యూజర్లకు టైం, లొకేషన్ స్టికర్లు అందుబాటులోకి వచ్చాయి. 2.18.30 వెర్షన్ ఆప్‌లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. ఈ అప్‌డేటెడ్ ఫీచర్‌ను వాట్సాప్ తాజాగా విడుదల చేసింది. ఈ ఫీచర్ ద్వారా మీ మెసెజ్‌ను షార్ట్ మెథడ్‌లో మీ మిత్రులకు సమాచారం చేరవేయొచ్చు. ఆప్‌స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 154 ఎంబీ సైజ్‌తో ఉంది. ఐఓస్ 7.0 లేదా ఆపై వెర్షన్‌లో ఈ ఫీచర్ రన్ అవుతుంది.

యూట్యూబ్ వీడియోలు వాట్సాప్‌లోనే : వాట్సాప్‌లో ఏదైనా యూట్యూబ్ వీడియో లింక్ షేర్ చేస్తే అది చాట్‌లో ప్లే అయ్యేది కాదు. లింక్‌పై క్లిక్ చేయగానే యూట్యూబ్‌కి స్కిప్ అయ్యేది. ఇకపై ఇలా ఉండదు. వాట్సాప్ విడుదల చేసిన 'యూట్యూబ్ స్ట్రీమింగ్' ఫీచర్‌తో



వీడియోలను చాట్ బాక్స్‌లోనే వీక్షించవచ్చు. ఎప్పటి నుంచో విడుదల చేయాలని చూస్తున్న ఈ ఫీచర్ ఎట్టకేలకు ఈ వారంలోనే విడుదలయింది. కేవలం ఐఓఎస్ లో మాత్రమే ఈ ఫీచర్ రన్ అవుతోంది. 2.18.11 వెర్షన్ ఆప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఈ ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్ యూజర్లకు త్వరలో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ యోచిస్తోంది. ఈ ఫీచర్‌తో పాటు, లాక్ రికార్డింగ్ వంటి ఫీచర్లను తీసుకొచ్చింది. గ్రూపు మెసేజ్‌లలో వ్యక్తిగత సందేశాలలు పంపే వీలు కల్పించనుంది.


పీఐపీ మోడ్ : మరో ఫీచర్ పీఐపీ (పిక్చర్ ఇన్ పిక్చర్) మోడ్. ఈ ఫీచర్ ద్వారా వాట్సాప్‌లో వీడియో కాల్ చేస్తున్నప్పుడు ఏదైనా చేయాలంటే ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. వీడియో కాల్ రన్నింగ్‌లో ఉండగానే చాటింగ్ చేస్కోవచ్చు, ఫోన్ అపరేటింగ్ చేస్కోవచ్చు.

స్పామ్ మెసెజెస్‌ని కనిపెట్టేయొచ్చు: స్పామ్ మెజెజెస్‌తో ఇబ్బంది పడే వారు ఇక వాటికి చెక్ పెట్టొచ్చు. వాట్సాప్ 2.18.67 వెర్షన్‌లో ఫార్వర్డ్ మెసెజ్ ఫీచర్ అందుబాటులో ఉంది. ఏదైనా ఒక మెసెజ్ 25 సార్లు ఫార్వర్డ్ అయి ఉంటే దానికి కింద పార్వర్డ్ మెసెజ్ అని కనబడుతుంది. దీన్ని గమనించి ఇగ్నోర్ చేయొచ్చు లేదా రీడ్ చేయొచ్చు.

వాట్సాప్ పేమెంట్స్ : ఇటీవల విడుదల చేసిన ఫీచర్లలో వాట్సాప్ పేమెంట్స్ సంచలనం సృష్టించింది. వాట్సాప్ ఉంటే చాలు ఇకపై నగదు చెల్లింపులు చేయవచ్చు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా వాట్సాప్‌లో నగదు లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఐఓఎస్, ఆండ్రాయిడ్ మొబైల్‌లో 'వాట్సాప్ బీటా వెర్షన్' వినియోగిస్తున్న వారు మాత్రమే ఈ ఫీచర్‌ను వినియోగించుకోవచ్చు. వెబ్ వెర్షన్‌లో ఈ ఫీచర్ కనబడదు. ఐవోఎస్‌లో 2.18.21 వాట్సాప్ వెర్షన్, ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లకు 2.18.41 వెర్షన్‌లో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. పేమెంట్స్ ఆప్షన్ లాగిన్ అయిన వారికి మాత్రమే నగదు లావాదేవీలు చేసుకునే వెసులుబాటు ఉంది.

పేమెంట్ సెటప్ ఎలా ?

నగదు బదిలీ చేయాలనుకుంటున్న ఫ్రెండ్ ప్రోఫైల్ చాట్ ఓపెన్ చేయాలి. అటాచ్ బటన్ (పేపర్ క్లిప్) పై నొక్కగానే మనకు ఇమేజ్, డాక్యుమెంట్స్, గ్యాలెరీ, ఆడియో, లొకేషన్ ఐకాన్స్‌తో పాటు 'పేమెంట్' ఐకాన్ కూడా కనిపిస్తుంది. దానిపై నొక్కగానే బ్యాంకుల పేర్లు కనిసిస్తాయి. ఈ బ్యాంకుకు నగదు బదిలీ చేయాలనుకుంటున్నారో ఆ బ్యాంకును ఎంచుకోవాలి. తర్వాత డెబిట్ లేదా క్రిడిట్ కార్డు వెరిఫికేషన్ అడుగుతుంది. తర్వాత లింక్ ఫోన్ నంబర్‌కు ఆరు డిజిట్ల యూపీఐ నంబర్ వస్తుంది. దీన్ని ఎంటర్ చేయగానే సెటప్ పూర్తి అవుతుంది. అటాచ్‌లోని పేమెంట్ ఐకాన్‌పై నొక్కగానే ఎర్రర్ వస్తే మీరు నగదు బదిలీ చేయాలనుకున్న ఫ్రెండ్ వాట్సాప్ అప్‌డేట్‌లో లేదన్నట్టు లెక్క. అప్‌డేటెడ్ వాట్సాప్‌ను ఇద్దరు వాడితేనే నగదు బదిలీ చేయడానికి అవకాశం ఉంది. సెట్టింగ్‌లోకి వెళ్లి పేమెంట్ ఫీచర్ కోసం అప్‌డేట్ చేసుకోవాలని అవతలి వ్యక్తిని ఇన్వైట్ చేయొచ్చు.





సైన్సు దినోత్సవ విశిష్టత ఏమిటి?

నమ్మకాలు నిజాలు

జవాబు : ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీని జాతీయ సైన్సు దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ వరవడి 1986వ సంవత్సరం నుండి ప్రారంభమైంది. దేశంలో వర్తమాన శాస్త్ర సాంకేతిక ప్రగతిని సమీక్షించుకోవడం, భవిష్యత్తులో ప్రతిభా రంగాలను గుర్తించి ప్రోత్సహించడం, దేశం యావత్తు, ఆ రోజును ఓ పండుగలా జరుపుకోవడం జాతీయ సైన్సు దినోత్సవ ప్రధాన లక్ష్యాలు. ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రత్యేక అంశం మీద ఆ రోజు నుంచి మరుసటి జాతీయ సైన్సు దినోత్సవం వరకు కార్యక్రమాలను నిర్వహించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా జాతీయ సైన్సు దినోత్సవ సంబరాల్లో అంతర్భాగం. 2018 సంవత్సరపు జాతీయ సైన్సు దినోత్సవ ప్రత్యేక అంశం: 'సమతులానాభివ ద్ధి - భవిత కొరకై శాస్త్ర సాంకేతిక రంగాలు'(Science and Technology for Sustainable Future).. 2017 సంవత్సరపు అంశం : ప్రత్యేక వికలాంగుల కోసం శాస్త్ర సాంకేతిక రంగాలు (Science and Technology for Specially Abled Persons) సాధారణ శారీరక అంగ నిర్మాణం లేనందు వల్ల ప్రత్యామ్నా యాంగిక పద్ధతుల్లో జీవన కార్యక్రమాల్ని నిర్వర్తించుకొనేలా శారీరక అంగ వైకల్యం ఉన్న వారికి శాస్త్ర సాంకేతిక రంగాలు సహకరించేలా సాధనాలు ఉత్పత్తి చేయాలన్న ఆకాంక్షతో 2017 సంవత్సరపు లక్ష్యం ఉద్దేశించబడింది. పర్యావరణానికి, జీవావరణా నికి శక్తి వనరుల వినియోగానికి గడ్డు కష్టాలు లేకుండా భవిష్యత్తరాల కోసం భూగోళాన్ని సమతులన పద్ధతిలో బదలాయించడం వర్తమాన తరపు కర్తవ్యమన్న భావన ఆధారంగా ఈ సంవత్సరపు నినాదం ఏర్పడింది.

ఫిబ్రవరి 28వ తేదీనే జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేక కారణం ఉంది. రామన్ ఫలితం (Raman Effect) గురించి భారతీయులందరూ వినే ఉంటారు. ఫిబ్రవరి 28, 1928 సంవత్సరం నాడు సర్ సి.వి.రామన్ తన Phdశిష్యుడయిన క్రిష్ణన్‌తో కలిసి ఎఫెక్ట్‌ను ఆవిష్కరించారు. ఓ నూతన కాంతి (A New kind of Radiat ion) అనే పతాక శీర్షికతో Nature (ప్రపంచ ప్రసిద్ధ పరిశోధనా పత్రాలను ప్రచురించే పత్రిక(Journal)లో రామన్ ప్రచురించాడు. రెండేళ్ల తిరక్కుండానే 1930 సంవత్సరం లో సి.వి.రామన్‌కు భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతిని బహూకరించారు. ఆ రోజు నుంచి నేటి వరకు సుమారు 90 సంవత్సరాలు గడిచినా భారతదేశానికి శాస్త్ర రంగాల్లో మరో నోబెల్ బహుమతి రాకపోవడం విచారించదగ్గ విషయం. అది ప్రస్తుతం అప్రస్తుతం. అంతర్జాతీయంగా భారతదేశ శాస్త్రాభివ ద్ధిని శిఖరాగ్రాన నిలిపిన రామన్ ఫలితం ఆవిష్కరణ జరిగిన రోజయిన ఫిబ్రవరి 28 ని ప్రేరణ సూచనగా 1986 ఫిబ్రవరి 28 నుంచి జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. అదే రోజు 1988 సంవత్సరం ఫిబ్రవరి 28 నాడు జనవిజ్ఞాన వేదిక రూపు దిద్దు కొంది. విజయవాడ నడిబొడ్డున వున్న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించింది. అప్పటి నుంచి నేటి వరకు ప్రజల్లో శాస్త్ర ప్రచారం చేస్తూ సామాన్య ప్రజానీకంలోను, విద్యార్థుల్లోను శాస్త్రీయ ద క్పథాన్ని కలిగించడానికి జన విజ్ఞాన వేదిక అవిరాళ క షి చేస్తూ నేడు రెండు తెలుగు రాష్ట్రాలోని ప్రతి జిల్లాలోను కమిటీలను ఏర్పర్చుకొని సైన్సు ప్రచారానికి అంకితమయి క షి చేస్తోంది. ఈ ఫిబ్రవరి 28 నుంచి రాబోయే ఫిబ్రవరి 28 వరకు 30 సంవత్సరాలు పూర్తయినందున సూచికగా వైవిధ్యభరితమైన కార్యక్రమాలను చేపడుతోంది.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక

నయామాల్

అమెజాన్‌లో ప్రైమ్ మ్యూజిక్ సర్వీస్



ఆన్‌లైన్ షాపింగ్ రంగంలో దూసుకుపోతున్న ప్రముఖ సంస్థ అమెజాన్.. Saavn, Gaana, apple music కు పోటీగా మ్యూజిక్ సర్వీస్‌ను లాంచ్ చేసింది. ఇది వరకే అమెజాన్ ప్రైమ్ వీడియోలతో కస్టమర్లను ఆకట్టుకున్న ఆ సంస్థ ఇప్పుడు మ్యూజిక్ సర్వీస్‌తో మరింత దగ్గరవనుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్, వెబ్ ప్లాట్‌ఫాంలపై అమెజాన్ ప్రైమ్ మ్యూజిక్ లభిస్తున్నది. ఈ డివైస్‌లలో అమెజాన్ ప్రైమ్ యూజర్లు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ఈ సేవను ఉచితంగా పొందవచ్చు. అలాగే వెబ్ ప్లాట్‌ఫాంపై music.amazon.in సైట్‌లోకి లాగిన్ అవడం ద్వారా ఈ సేవను వాడుకోవచ్చు. పది ఇండియన్ లాంగ్వేజెస్‌తో ఈ సర్వీస్ ఇస్తోంది. అమెజాన్ నుంచి ఈ సర్వీస్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకున్న వారికి ఫ్రీ అన్‌లిమిటెడ్ సాంగ్స్‌ని ఆఫ్లైన్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది.

లోయర్ మిడ్ రేంజ్‌లో...

సామ్‌సాంగ్ కంపెనీ మరో కొత్త ఫోన్‌ను ఇండియా మార్కెట్‌లో రిలీజ్ చేసింది. ఏటా కొత్త వెర్షన్లతో కొత్త మొబైల్స్‌ను విడుదల చేస్తున్న ఆ కంపెనీ లోయర్ మిడ్ రేంజ్‌లో Samsung Galaxy A8+ 2018 ఫోన్‌ను విడుదల చేసింది.

కెమెరా : డ్యూయల్ ఫ్రంట్ (8+16 ఎంపీ) అండ్ బ్యాక్ 16 ఎంపీ
బ్యాటరీ : 3500 ఎంఏహెచ్

సైజ్ : 6 inch HD Display
వీడియో : 1080p హెచ్‌బీ 30 fps
మెమొరీ : 6 జీబీ ర్యామ్, 64జీబీ స్టోరేజీ
ఓఎస్ : ఆండ్రాయిడ్ 7.1.1
కలర్స్ : గ్రే, బ్లాక్, గోల్డ్, బ్లూ
వెల : అమెజాన్ - రూ. 32,990
ఫొటో : Samsung Galaxy A8+



16000 ఎంఏహెచ్ బ్యాటరీ ఫోన్

గ్లోబల్ సిస్టమ్ ఆఫ్ మొబైల్ కమ్యూనికేషన్ (జీఎస్ఎంఎ) ఆధ్వర్యంలో బర్సిలోనాలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్(ఎండబ్ల్యూసీ) 2018లో విస్తృత మొబైల్ టెక్నాలజీలు అవిష్కృతమయ్యాయి. టాప్ మొబైల్ కంపెనీలు అదిరిపోయే గాడ్జెట్‌లను రిలీజ్ చేశారు. ఎనర్జైజర్ లైసెన్సు బ్రాండు అవెనిర్ మొబైల్స్ సంస్థ ఓ మొబైల్‌ను ఆవిష్కరించింది. దాని బ్యాటరీ 16000 ఎంఏహెచ్ ఉండటం మొబైల్ యూజర్లను ఆశ్చర్యానికి గురిచేసింది. నీ ఎనర్జైజర్ పవర్ మ్యాక్స్ పీ16కే ప్రొ, ఎనర్జిజెర్ పవర్ మ్యాక్స్ పీ490ఎస్, ఎనర్జిజెర్ హార్డ్‌కేస్ హెచ్590ఎస్ అనే పేర్లతో మూడు స్మార్ట్‌ఫోన్లను ఎండబ్ల్యూసీ వేదికగా మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. దీనిలో ఎనర్జైజర్ పవర్ మ్యాక్స్ పీ16కే ప్రొ స్మార్ట్‌ఫోన్‌కు 16000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది.

ఈ మధ్య కాలంలో రిలీజ్ అవుతున్న ఫోన్లకు మామూలుగా 4000 నుంచి 5 వేల లోపు ఎంఏహెచ్ బ్యాటరీలుంటాయి. షియోమీ తాజాగా లాంచ్ చేసిన ఎంఐ మ్యాక్స్2లో 5300 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. కాగా ఎనర్జైజర్ కంపెనీ 16000 ఎంఏహెచ్‌తో స్మార్ట్ ఫోన్ విడుదల చేసి రికార్డు సృష్టించింది.



మీకు తెలిసిన టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఇతరులతో షేర్ చేసుకోవాలనుకుంటున్నారా ? మార్కెట్‌లోకి వస్తున్న కొత్త కొత్త గాడ్జెట్స్, మొబైల్స్, స్మార్ట్ ఐటెమ్స్ గురించి ఇతరులకు తెలియజేయాలనుకుంటున్నారా..? టెక్నాలజీ పరంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎలా పరిష్కరించారో అందరితో పంచుకోవాలనుకుంటున్నారా ?

డియర్ రీడర్స్..

అయితే మాకు పంపండి.

మాచిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవతెలంగాణ దినపత్రిక, ఎంహెచ్ భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.
tech.nava11@gmail.com, **వాట్సాప్ నెం:** 07660066469



నవ్‌జోత్‌కు స్వర్ణం

- కాంస్య పోరులో సాక్షి మాలిక్ గెలుపు
- ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్

న్యూఢిల్లీ : ఏస్ రెజ్లర్ నవ్‌జోత్ కౌర్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి ఒడిసి పట్టింది. టైటిల్ పోరులో జపాన్ రెజ్లర్ మియా ఇమాయిను 9-1 తో చిత్తు చేసింది. మహిళల 65 కిలోల ఫ్రీ స్టైల్ విభాగంలో శుక్రవారం జరిగిన ఫైనల్లో నెగ్గి.. తాజా ఆసియా పోరులో భారత్‌కు తొలి బంగారు పతకం అందించింది. అంతకు ముందు జరిగిన 62 కిలోల విభాగపు కాంస్య పోరులో.. రియో ఒలింపిక్స్ కాంస్య విజేత సాక్షి మాలిక్ గెలుపొందింది. నువ్వా నేనా అన్నట్టు సాగిన కుస్తీ పోరులో కజకిస్థాన్ బాక్సర్ ఆయులిమ్ కసిమోవాను 10-7 ఓడించింది. ఈ పతకాలతో భారత్ ఖాతాలో మొత్తం ఆరు పతకాలు చేరాయి. గురువారం వినేశ్ ఫోగట్ రజతం గెలుపొందగా మరో ముగ్గురు రెజ్లర్లు కాంస్య పతకాలు నెగ్గారు.



ఆరంభం అదరాలి

- తొలి పోరులో అర్జెంటీనాతో భారత్ అమీతుమీ
- నేటి నుంచే సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీ

ఐపో (మలేసియా) : గతేడాది భారత్ పురుషుల హాకీ జట్టు మెరుగైన ప్రదర్శన చేసి, హాకీ అభిమానుల మది దోచుకున్నది. కొత్త కోచ్ స్జోర్డ్ మార్జేన్ శిక్షణలో అంచనాలకు తగ్గ ఆటతో తాజా సీజన్ తొలి పోరులోనూ సత్తా చాటాలని భారత హాకీ జట్టు ఉవ్విళ్లూరుతున్నది. సర్దార్ సింగ్ సారథ్యంలో ఇప్పటిదాకా సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్ నుంచి పతకం గెలవకుండా వెనుదిరగని భారత్.. ప్రపంచ నెంబర్ 2 అర్జెంటీనాతో నేడు తొలిపోరు చేయనున్నది. 2008లో సుల్తాన్ నేతృత్వంలో భారత్ రజతం నెగ్గగా, 2015, 2016లలో కాంస్యంతో తిరొచ్చింది.

ప్రధాన పోరుకు ముందు గురవారం జరిగిన వార్మప్ మ్యాచులో ప్రపంచ నెంబర్ వన్ ఆస్ట్రేలియాకు భారత్ గట్టిపోటీనిచ్చింది. తొలుత 1-2తో వెనుకంజ వేసినా చాలా భాగం మ్యాచ్‌పై ఆధిపత్యం చలాయించింది. భారత్ తరఫున వైస్ కెప్టెన్ రమన్‌దీప్ సింగ్ ఏకైక గోల్ చేశాడు. వార్మప్ మ్యాచ్‌లో ఓడినా కోచ్ మార్జేన్ జట్టు బలంపై ధీమాతో ఉన్నాడు. 'తేమతో కూడిన వాతావరణానికి అలవాటు పడేందుకు ఆస్ట్రేలియాతో మూడు క్వార్టర్స్‌ల మ్యాచ్ ఆడాం. చాలా అంశాలపై నాకు సంతృప్తి ఉన్నది. సరికొత్త కాంబినేషన్‌తో తొలి మ్యాచ్‌లో మంచిగా ఆడారు. అర్జెంటీనాతో ఆటకు ఈ అనుభవాన్ని ఉపయోగించుకుంటాం' అని మార్జేన్ ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. 'గతంలో నేను చెప్పినట్టు ఫలితం గురించి నేను పట్టించుకోను. వాతావరణ పరిస్థితులు అనుకూలమైనపుడు ఆడిన కాస్తలో ఏ మేర రాణించాం అన్నదే నాకు ముఖ్యం. అయితే ఇలాంటి వాతావరణంలో మా ప్రత్యర్థులు బలహీనులు కారు



అనే విషయం భోదపడింది.' అని మార్జేన్ వివరించాడు.

ఇక ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనా కోచ్ కార్లోస్ రెటెగుయ్ లేకుండానే మలేసియాలో అడుగుపెట్టారు. ఇటీవలే దిగ్గజ కోచ్ రాజీనామా చేయటంతో అతడు లేని పక్షంలో పోరుకు సన్నద్ధమవటం ఆ జట్టుకు ఇబ్బందే. 2008లో కార్లోస్ శిక్షణలోనే అర్జెంటీనా తమ తొలి, ఏకైక అజ్లాన్ షా కప్ గెల్చుకున్నది. ఆనాటి టోర్నీ ఫైనల్లో భారత్‌పై 2-1తో అర్జెంటీనా పైచేయి సాధించింది. కానీ ఇప్పుడు పరిస్థితులు వేరు. అప్పటికీ, ఇప్పటికీ ఆటగాళ్లలో మార్పొచ్చింది. మెరుగైన శిక్షణలో భారత జట్టు మెరికల్లాంటి ప్లేయర్స్‌ను తయారు చేసుకున్నది. అయితే ఈసారి కీలక సీనియర్ ఫార్వర్డు ఆ ట గా ళ్లు ఆకాశ్‌దీప్ సింగ్, ఎస్‌వీ సునీల్, మన్‌దీప్ సింగ్‌లు లేకపోవటంతో జట్టు ప్రదర్శనపై ఆసక్తి నెలకొన్నది. మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్, గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ పోటీలో లేరు. డ్రాగ్‌ఫ్లిక్ నిపుణులు రుపిందర్ పాల్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్‌లకు విశ్రాంతి లభించటంతో సర్దార్ అంతా కుర్రాళ్లతోనే అజ్లాన్‌షా బరిలో దిగనున్నాడు. యువ ఆటగాళ్లు ఒత్తిడి లేకుండా ఆడితే సీనియర్లు లేని లోటు కనబడనివ్వరనేది కోచ్ మాటగా ఉన్నా.. అగ్ర శ్రేణి జట్లతో సమరాల్లో ఒత్తిడిలోను కాకుండా కుర్ర హాకీ ప్లేయర్లుంటారా అన్నదే సంశయం. అయితే ఆట విధానం, ప్రణాళికల్లో మెరుగైన వ్యూహాలతో ఈసారి బృందాన్ని సిద్ధం చేయటం భారత్‌కు కలిసొచ్చే అంశం. గతేడాది విజయాలు సైతం ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయి. అర్జెంటీనా శిబిరంలో గొంజాలో పెయ్‌లాట్, లూకాస్ రోసి, జువన్ మాన్యుయెల్ వివాల్డి, పెడ్రో ఇబర్రా, మేటియాస్ పారెడాస్‌లు కీలక ఆటగాళ్లు. కానీ మార్గదర్శకుడు లేని జట్టు భారత్‌కు అదే తరహా పోటీనిస్తుందా? లేక అంచనాలు అందుకుని భారత్ ప్రత్యర్థిని చిత్తు చేస్తుందా అనేది ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

జట్టు బలాబలాలపై సర్దార్ సింగ్ మాట్లాడుతూ..'గెలవటమే మా తొలి, తుది లక్ష్యం అయినా, ముందుగా అనుకున్న ప్రణాళికను ఆచరణలో పెట్టగలగటంపైనే దృష్టి పెడతాం. అర్జెంటీనా లాంటి జట్టుతో ఆడుతున్నప్పుడు పొరపాట్లకు తావుండకూడదు. ఆస్ట్రేలియాతో ప్రాక్టీస్ మ్యాచ్ మా కుర్రాళ్లకు చక్కటి అనుభవాన్నిచ్చింది. ఒక్కొక్కటిగా మ్యాచులు నెగ్గుతూ టైటిల్ దిశగా దూసుకుపోతాం.' అన్నాడు.

ధోని నుంచి నేర్చుకుంటా

- ఇంగ్లాండ్ పేసర్ మార్క్‌వుడ్

న్యూఢిల్లీ : టీమిండియా మాజీ సారథి, మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోని నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉన్నదని ఇంగ్లాండ్ పేస్ బౌలర్ మార్క్ వుడ్ అన్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున పేస్ బాధ్యతలు మోయనున్నాడు వుడ్. ఐపీఎల్ గురించి మాట్లాడుతూ..' ఒత్తిడిని అధిగమించి ఆడటమనేది ఎలాంటి ఆటగాడికైనా ఉపయోగపడే అంశం. ఐపీఎల్ ద్వారా.. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో నుంచి చాలా విషయాలు నేర్చుకునే అవకాశం నాకు దక్కింది. చెన్నై సేనాని ధోని, జట్టులో కీలక సభ్యుడైన బ్రావో.. వీరిద్దరూ మ్యాచ్ విన్నర్లు. ఒత్తిడిలోనూ జట్టును విజయ తీరాలకు చేర్చగల సమర్థులు. అలాంటి దిగ్గజ క్రికెటర్ల నుంచి నేర్చుకునే ప్రతి చిన్న అంశం భవిష్యత్తులో నాకెంతో ఉపయోగపడుతుంది. బ్రావో నుంచి బౌలింగ్ మెలకువలు నేర్చుకుంటా' అని తెలిపాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడటాన్ని అదృష్టంగా భావిస్తున్నానని వుడ్ అన్నాడు. 'ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున ఆడటం ఎంతో గర్వంగా ఉన్నది. ఉత్తమ పోటీ వాతావరణం గల ఐపీఎల్‌లో అత్యుత్తమ జట్టు చెన్నైకు ఆడటం అదృష్టం. అలాంటి అవకాశాన్ని ఎవరు వదులుకుంటారు?. మా జట్టులో నేను కూడా మ్యాచ్ విన్నర్‌గా మారాలన్నదే నా ఆకాంక్ష. అన్ని సార్లు అనుకూల పరిస్థితులు ఎదురవకపోవచ్చు. కానీ, మెరుగ్గా ఆడటానికి శాయశక్తులా కృషి చేస్తే.. ప్రతి బంతిని కీలకమైనదిగా భావిస్తే.. ఫలితం కచ్చితంగా ఉంటుంది. ఒత్తిడిలో రాణిస్తేనే మజా!. అదే నేను నమ్ముతా' అని వుడ్ వివరించాడు.





మహిళల ముక్కోణపు సిరీస్ షెడ్యూల్ మార్పు?

న్యూఢిల్లీ : ఈ నెలలో జరగనున్న మహిళల ముక్కోణపు క్రికెట్ టోర్నీ షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకోనున్నట్టు సమాచారం. షెడ్యూల్ ప్రకారం మార్చి 22 నుంచి ఏప్రిల్ 3 వరకు భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాల మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ జరగాల్సి ఉన్నది. అయితే, స్టార్ స్పోర్ట్స్‌తో బీసీసీఐ కుదు ర్చుకున్న మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసార ఒప్పందం ఈ నెల 31తో ముగియ నున్నది. దీంతో ఈ ముక్కోణపు టోర్నీని కాస్త ముందుకు జరపాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ సిరీస్ కంటే ముందు ఆస్ట్రేలియా మహిళల జట్టు భారత్‌లో పర్యటించ నున్నది. మార్చి 12 నుంచి 18 వరకు భారత్‌తో ఆస్ట్రేలియా మూడు వన్డేలు ఆడనున్నది. ఇక ముక్కోణపు సిరీస్ ముగిసాక, ఏప్రిల్ 8 నుంచి 14 వరకు ఇంగ్లాండ్ భారత్ పర్యటన చేయనున్నది. ఇంగ్లాండ్‌తో నూ మిథాలీ సేన మూడు వన్డేల సిరీస్ ఆడనున్నది. దీంతో ఏయే సిరీస్ షెడ్యూల్‌లలో మార్పులు చోటు చేసుకుంటాయన్నది ఇప్పుడే చెప్పలేం. సఫారీ అమ్మాయిలతో గత నెల జరిగిన మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కాలేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యం లో ఇకపై అన్ని మహిళల అంతర్జాతీయ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. ఇక 2018 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు.. ఐదేండ్లకు గానూ ప్రసార హక్కుల కోసం ఇదివరకే బీసీసీఐ టెండర్లు ఆహ్వానించింది.


రేపటి నుంచి జాతీయ బధిరుల టీ20 పోటీలు

హైదరాబాద్ : నాల్గో జాతీయ బధిరుల టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్‌కు తెలంగాణ జట్టు పాల్గొననున్నది. శ్రీకాంత్ రెడ్డి కెప్టెన్సీలో 16 మందితో కూడిన జట్టు వివరాలను తెలంగాణ బధిరుల స్పోర్ట్స్ కౌన్సిల్ వెల్లడించింది. రేపటి నుంచి అహ్మదాబాద్‌లో వివిధ స్టేడియాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఐసీసీ నిబంధనల మేరకు నిర్వహించనున్న టోర్నీ మార్చి 11న ఫైనల్స్‌తో ముగియనున్నది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల్ని జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్టు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

స్టార్క్ మెరుపులు

- తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 162కే ఆలౌట్
- ఆస్ట్రేలియాతో తొలి టెస్టు రెండో రోజు

దర్బన్ : కంగారూ బౌలర్ మిచెల్ స్టార్క్ (5/34) విజృంభించటంతో ఆతిథ దక్షిణాఫ్రికా 162 పరుగులకే కుప్పకూలింది. స్టార్క్ మెరుపులకు స్పిన్నర్ నాథన్ లైయన్ (3/50) జత కలిశాడు. వీరువురు చెలరేగటంతో రెండో రోజు ఆఖరు పది ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయిన సఫారీలు 16 పరుగులు మాత్రమే చేయగలిగారు. దక్షిణాఫ్రికా తరఫున ఏబీ డివిలియర్స్ (71) ఒక్కడే రాణించాడు. కంగారూ బౌలర్లలో



స్టార్క్ ఐదు, లైయన్ మూడు వికెట్లు పడగొట్టగా.. జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమిన్స్ చెరో వికెట్ తీసుకున్నారు. అంతకుముందు 225/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. మిచెల్ మార్ష్ (96, 173 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) అర్థ శతకంతో 351 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్ (35, 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) సైతం ధనాధన్ ఆటతో అబ్బురపరిచాడు. రెండో రోజు సఫారీ బౌలర్లలో కేశవ్ మహరాజ్ మూడు వికెట్లు తీయగా.. వెర్నన్ ఫిలాండర్, కగిసో రబాడా చెరో వికెట్ దక్కించుకున్నారు.



అనర్హులై చరిత్ర సృష్టించారు!

బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్) : ఏదైనా పోటీలో ఒకరు లేదా ఇద్దరు క్రీడాకారులు అనర్హతకు గురికావటం మనం చూస్తునే ఉంటాం. టెక్నికల్ తప్పిదాల వలనో మరో కారణం చేతనో ఇలాంటివి జరుగుతుంటాయి. కానీ, పోటీలో పాల్గొన్న అందరు అథ్లెట్లు డిస్‌క్వాలిఫై అయిన (అనర్హులైన) అరుదైన ఘటన ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్స్‌లో శుక్రవారం చోటు చేసుకున్నది. అత్యంత వేగవంతమైన అథ్లెట్‌గా పేరొందిన గ్రెనడా స్ప్రింటర్ బ్రాలోన్ టాప్లిన్ సహా మిగిలిన ఆటగాళ్లందరూ 400 మీటర్ల సెమీస్ పరుగులో అనర్హులయ్యారు. టాప్లిన్, స్టీవెన్ గేల్ (జమైకా), ఆస్ట్రిస్ కార్పిన్‌స్కిస్ (లాట్వియా)లు గీత దాటిన కారణంగా డిస్ క్వాలిఫై అయ్యారు. అంతకు ముందు ఖతార్ స్ప్రింటర్ అబ్దెలెలాహ్ హరౌన్ తప్పుగా పరుగందుకుని రెడ్ కార్డ్ అందుకున్నాడు. ఓ మేజర్ టోర్నమెంట్‌లో ఇలా అథ్లెట్లందరూ అనర్హత బారిన పడటం ఇదే తొలిసారని క్రీడా పండితులు చెబుతున్నారు.

నిరుద్యోగం పైపైకి..

దేశంలో 3.1 కోట్ల మంది రోడ్ల వెంబడి: తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: మన దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగిత ఒకటని..మోడీ సర్కారు వచ్చాక అది మరింతగా పెరుగుతున్నదని అధ్యయనాలు చెబుతున్నాయి. గత కొద్ది నెలల్లో తారస్థాయికి చేరిన ఈ సమస్య గత నెల 25తో ముగిసిన వారాంతానికి 7.1 శాతానికి చేరుకున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. తాజా అధ్యయన నివేదిక ప్రకారం ఇప్పుడు దేశంలో దాదాపు 3.1 కోట్లమంది ఉద్యోగాల కోసం పడిగాపులు కాస్తున్నారు. అక్టోబర్ 2016 నాటి స్థాయి కన్నా ఇది అత్యధికం కావటం విశేషం. గత 15-16 నెలల కాలంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిరుద్యోగ సమస్య గరిష్ట స్థాయికి చేరుకున్నదని ఈ అధ్యయన నివేదికలో ప్రస్తావించింది.



హెచ్చు, తగ్గులు

గత ఏడాది జులైలో దేశంలో కనిష్ట స్థాయిలో వున్న నిరుద్యోగ సమస్య నాటి నుంచి క్రమంగా పెరుగుతూ వస్తోందని ఈ నివేదిక వెల్లడించింది. గత మూడు వారాల కాలంలో ఈ నిరుద్యోగ సమస్య 7 శాతానికి చేరుకుని కలవరపాటుకు గురి చేస్తోందని ఈ అధ్యయనం నిర్వహించిన సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) సంస్థ సీఈఓ మహేష్ వ్యాస్ తెలిపారు. దీనిని పెద్దనోట్ల రద్దు ముందునాటి స్థాయికి తీసుకెళ్లటం సుసాధ్య మేనని ఆయన అభిప్రాయపడ్డారు.

అయితే దేశంలో స్థిరమైన నిరుద్యోగిత ప్రమాదకర స్థాయిలో లేనప్పటికీ అది క్రమంగా పెరుగుతుండటమే కలవరపాటుకు కారణమవుతోంద న్నారు.

మసకబారిన భవిత

సమీప భవిష్యత్‌లో సైతం ఉద్యోగావకాశాలు ఆశించిన మేర కన్పించకపోవటంతో యువత భవిష్యత్ మసకబారుతోంది. గత నెల చివరి నాటికి అధికారికంగా నమోదయిన 3.1 కోట్ల మంది నిరుద్యోగులకు వచ్చే మే నాటికి తాజాగా పట్టభద్రులైన యువత



జతకానున్నారు. అయితే రానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్త ఉద్యోగావకాశాలు కేవలం 6 లక్షలకు మాత్రమే పరిమితమవుతాయన్న అంచనాలు యువతను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో రబీ పంట నాట్ల తరువాత ఉపాధి క్రమంగా మందగిస్తుందని, మే మధ్యలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో పరిమిత స్థాయిలో మాత్రమే ఉపాధి అవకాశాలుంటాయని ఈ నివేదిక వివరించింది.

నోట్ల రద్దు ప్రభావం

నోట్ల రద్దు సమయంలో దేశంలో నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గిందన్న ఈ అధ్యయన నివేదిక దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించటం కన్నా కొత్త నైపుణ్యాల సాధనపై దృష్టి కేంద్రీకరించటం ఇందుకు కారణమని ఈ నివేదిక వివరించింది. ఈ సమయంలో లేబర్ పార్టిసిపేషన్ రేట్ (మొత్తం ఉద్యోగుల సంఖ్య లేదా ఉద్యోగాన్వేషణలో వున్న వారి సంఖ్య) 46-48 శాతం మధ్య వుండేదని తెలిపింది. 2017 జులై నాటికి ఇది 43 శాతానికి తగ్గిందని, గత నెల చివరి నాటికి ఇది 44 శాతానికి చేరిందని సీఎంఐఈ తన నివేదికలో పేర్కొంది. నోట్ల రద్దు ప్రభావం నుంచి కార్మిక శక్తి ఇంకా పూర్తిగా కోలుకోలేదని, రిజర్వ్ బ్యాంకు కొత్త నోట్ల సరఫరా ప్రారంభించినప్పటికీ లేబర్ పార్టిసిపేషన్‌ను అంతకుముందు స్థాయికి తీసుకు వచ్చే విధంగా లేదని ఈ నివేదికలో పేర్కొన్నారు. ఉద్యోగార్థులు క్రమంగా ఉద్యోగాలకు వస్తున్నప్పటికీ వారికి తగిన స్థాయిలో కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడకపోవటం కూడా నిరుద్యోగ సమస్య పెరుగుదలకు మరో కారణమని ఈ నివేదిక వివరించింది.



అరుణారెడ్డికి ఘనస్వాగతం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో జరిగిన 'వరల్డ్ జిమ్నాస్టిక్ కప్' పోటీల్లో కాంస్య పతకం సాధించి స్వరాష్ట్రానికి వచ్చిన వచ్చిన బుద్దా అరుణారెడ్డికి రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు, క్రీడాకారులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. రాజీవ్ గాంధీ విమానాశ్రయం నుండి అత్తాపూర్‌లోని అరుణా రెడ్డి నివాసం వరకు ఈ సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిమ్నాస్టిక్ కోచ్ రవీందర్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రంగారావు, సెక్రటరీ ప్రేమ్‌రాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited Laxmidas Bhavan, Phase-2, Plot. 8&9,Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500021, 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : S.Veeraiah. Tel Tel/2015/60815